
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal
సంపుటి: 19 సంచిక:249 హైదరాబాద్, బుధవారం, 9 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00



## దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు




హైదరాబాద్, ఏప్రిల్ 8: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ బాంబ్ బ్లాస్ట్ కేసులో ( తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో దోషులు వేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. అంతేకాదు.. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధిస్తూ ట్రయల్ కోర్ట్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధతో కూడిన ధర్మాసనం.. దోషులందరికీ ఉరిశిక్షను ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది. కాగా.. 2013, ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లో వరుస బాంబు పేలుళ్ల కేం2016 డిసెంబర్ 13న ఐదుగురు నిందితులను దోషులుగా గుర్తించి ఉరిశిక్ష విధిస్తూ ఎన్ఐఏ కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేశారు నిందితులు. సుమారు 45 రోజుల పాటు సుదీర్ఘంగా విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేసింది. నేడు తీర్పును వెల్లడించింది. బాంబ్ బ్లాస్ట్‌లో వీరి కుట్ర ఉందని.. దోషులుగా తేల్చింది. ఈ ఐదుగురికి ఉరిశిక్ష ఖరారు చేస్తూ హైకోర్టు ధర్మాసనం తీర్పును వెల్లడించింది.

ఈ కేసులో ఏ2 అసదుల్లా అక్తర్ ( యూపీ), ఏ3జియ ఉర్ రహమాన్ ( పాకిస్థాన్), ఏ4 మహమ్మద్ తహసీన్ అక్తర్ హసన్ ( బీహార్ ), ఏ5 మహమ్మద్ యాసిన్ భత్కల్, ఏ6 అజాజ్ షేక్ సమర్ అర్మాన్ (మహారాష్ట్ర) ఉన్నారు. అయితే ప్రధాన దోషి అయిన రియాజ్ భత్కల్ అలియాస్ మహమ్మద్ రియాజ్ ఇంకా పరారీలోనే ఉన్నాడు. అంతేకాకుండా బాంబు పేలుళ్లలో కీలకంగా వ్యవహరించిన ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాది సయ్యద్ ముక్బల్ అనారోగ్యంతో గత ఏడాది జులైలో గాంధీ ఆస్పత్రిలో మృతి చెందాడు.

కాగా.. దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన బాంబు పేలుళ్లలో 17 మంది మృతి చెందగా.. 130 పైగా గాయాలు అయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టాండ్‌లో మొదటి బాంబ్ పేలగా.. 100 మీటర్లు దూరంలో ఏ1 మిర్చి సెంటర్ వద్ద రెండో బాంబ్ బ్లాస్ట్ అయ్యింది. సైకిల్‌పై టిఫిన్ బాక్స్‌లో బాంబ్ పెట్టి పేల్చారు ఉగ్రవాదులు. సాయంత్రం 6:58:38 గంటలకు మొదటి పేలుడు, ఆరు సెకన్ల వ్యవధిలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ ( తో 6:58:44 గంటలకు రెండో పేలుడు సంభవించింది. ఈ పేలుళ్లలో అనేక మంది బాధితులుగా మిగిలారు. వారంతా టెర్రరిస్ట్ బాంబ్ బ్లాస్ట్ విక్టిమ్స్ అసోసియేషన్ పేరుతో బాధితుల సంఘం ఏర్పాటైంది. ప్రతి ఏటా కోణార్క్ థియేటర్ వద్ద బాధిత కుటుంబాలు నివాళులు అర్పిస్తున్నారు. ఈ కేసులో దోషులకు ఉరిశిక్ష ఖరారు అవడంతో బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.




## అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం.. కేంద్రం నోటిఫికేషన్ జారీ

దిల్లీ: ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 అమల్లోకి వచ్చింది. ఈ మేరకు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం (ఏప్రిల్ 8) నుంచే ఈ చట్టం అమల్లోకి తీసుకొస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల నుంచి ఈ బిల్లు పాస్ అవ్వగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ (సవరణ) బిల్లు చట్టంగా మారింది. ఈ నేపథ్యంలో నేటి నుంచే అమల్లోకి తీసుకొస్తున్నట్లు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

మరోవైపు కేంద్రం తీసుకొచ్చిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొత్తం 15 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం కేవియట్‌ను దాఖలు చేసింది. తమ అభిప్రాయం తెలుసుకోకుండా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయొద్దని కోరింది.

## టీచర్ పోస్టులపై సీబీఐ దర్యాప్తు అక్కర్లేదు.. సుప్రీంలో దీదీ సర్కార్‌కు స్వల్ప ఊరట

దిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం ( వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు నిమిత్తం హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో కొన్నింటిని సుప్రీంకోర్టు తాజాగా పక్కనపెట్టింది. అదనపు పోస్టుల సృష్టిపై రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సీబీఐ దర్యాప్తు అవసరం లేదని స్పష్టం చేసింది.

"నిపుణులతో చర్చలు జరిపిన తర్వాతే బెంగాల్ విద్యాశాఖ ఈ అదనపు పోస్టులను సృష్టించింది. దీనికి గవర్నర్ నుంచి ఆమోదం లభించింది. అలాంటప్పుడు ఇందులో న్యాయపరమైన జోక్యం అవసరం లేదు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. అయితే, టీచర్ల నియామకాల్లో ఇతర అవకతవకలకు సంబంధించిన ఇతర అంశాలు, ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతుందని కోర్టు పేర్కొంది.

ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12



తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. అయితే, ఖాళీలు ఉన్న సంఖ్య కంటే ఎక్కువ మందిని ఎంపిక చేయడంపై వివాదం రాజుకుంది. ఉద్దేశపూర్వకంగానే అదనపు పోస్టులను సృష్టించి అక్రమ నియామకాలు చేపట్టారని ఆరోపణలు వచ్చాయి.

దీనిపై విచారణ జరిపిన కలకత్తా హైకోర్టు 2016 నాటి ఆ నియామక ప్రక్రియ చెల్లదని తీర్పు వెలువరించింది. అంతేగాక, ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పాత్రతో పాటు అవకతవకలపై దర్యాప్తు జరపాలని సీబీఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. సీబీఐ దర్యాప్తుపై స్టే విధించింది. తాజాగా అదనపు ఉద్యోగాల సృష్టిపై దర్యాప్తు అవసరం లేదంటూ తీర్పు వెలువరించింది. ఇప్పటికే 25,753 మంది టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు గతవారం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే.

## బహిరంగ సభకు కూడా అనుమతులు ఇవ్వకుంటే కోర్టును ఆశ్రయిస్తాం: కేటీఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 8,

పార్టీ సిల్వర్ జూబ్లీ సంబరాల నిర్వహణ పైన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడారు.



వరంగల్ ఎల్కతుర్తిలో ఎలాంటి ట్రాఫిక్ లేకుండా, ప్రజలకు ఇబ్బంది కానీ ప్రాంతంలో సభ నిర్వహణ జరుగుతుంది. 1200 ఎకరాల్లో పార్కింగ్ తో పాటు సభ ఏర్పాటు అన్ని ఘనంగా జరుగుతున్నాయి. తెలుగునాట విజయవంతంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న రెండు పార్టీలు తెలుగుదేశం, బిఆర్ఎస్ మాత్రమే. అందుకే ఏడాదిపాటు సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు చేస్తాం. 28వ తేదీ మార్చి రోజున సభ అనుమతి కోసం జిల్లా పోలీసులకు దరఖాస్తు పెట్టడం జరిగింది. ఈ మేరకు డీజీపీకి వ్యక్తిగతంగా విజ్ఞప్తి కూడా చేశాము . ఆర్టీసీ ద్వారా 3000 బస్సుల కోసం విజ్ఞప్తి చేశాను ఆర్టీసీ సూత్రప్రాయంగా అంగీకరించింది. 27వ తేదీ ఆదివారం కావడం విద్యార్థులకు సెలవులు ఉండటం ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగవు . 33 జిల్లాల నాయకులు ప్రతినిధులతో కేసీఆర్ గారు స్వయంగా నియోజకవర్గాల వారికి సమీక్ష నిర్వహించారు. పార్టీ పరంగా కమిటీలను వేసుకోవడం జరిగింది. మా పార్టీ చరిత్రలో ఈ సమావేశం ఒక పెద్ద మీటింగ్ అవుతుంది. గతంలో జరిగిన వరంగల్ సభ మాదిరి భారీగా నిర్వహణ చేయబోతున్నామని అన్నారు.బహిరంగ సభ తర్వాత విద్యార్థి , కార్యకర్తల సభ్యత్వ నమోదు చేస్తాం. సభ్యత నమోదు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది. సభ్యత్వ నమోదు తర్వాత అధ్యక్ష ఎన్నిక జరుగుతుంది. రాష్ట్ర కమిటీలతో పాటు జిల్లా కమిటీలను ఇతర కమిటీలను వేసుకుంటాం. ఆ తర్వాత జిల్లాల వారీగా కార్యకర్తల శిక్షణ సమావేశాలు ఉంటాయి. ప్రతినెల ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహించేలా 12 నెలలపాటు కొనసాగేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. ఈ సంవత్సరం మొత్తం సంస్థాగత నిర్మాణంతోపాటు , ప్రజా సమస్యల పైన పోరాటం చేస్తాంమని అన్నారు.

ప్రభుత్వం గతంలో మా పార్టీ సమావేశాలకు అనుమతులు ఇవ్వకుంటే ఇబ్బందులు పెట్టింది . ఈ బహిరంగ సభకు కూడా అనుమతులు ఇవ్వకుంటే కోర్టును ఆశ్రయించి అనుమతి పొందుతామని అన్నారు. అనుమతి ఇవ్వక పోవడానికి ప్రభుత్వం వద్ద ఇలాంటి కారణాలు లేదు . అత్యంత శాంతియుతంగా పార్టీ నిర్వహించుకుంటున్న ఒక సంబరం మాత్రమేనని అన్నారు.

## ఏప్రిల్ చివరి నాటికి ఇంటర్ రిజల్ట్స్

హైదరాబాద్, ఏప్రిల్ 8,

తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (టీజీబీఐఈ).. 2025 సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలను ఏప్రిల్ చివరి నాటికి విడుదల చేసే అవకాశం ఉంది. మొత్తం 9 లక్షల 96 వేల 971 మంది పరీక్షలు రాశారు. వారు, వారి తల్లిదండ్రులు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.ఫస్ట్, సెకండ్ ఇయర్ ఇంటర్ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ బిబఎతివ.ఇఞణ.ఞనీల.తిని ద్వారా తెలుసుకోవచ్చు. ఫలితాలు ప్రకటించాక.. థర్డ్ పార్టీ ఏజెన్సీలు కూడా ఫలితాలను అందుబాటులో ఉంచుతాయి. గత సంవత్సరం ఇంటర్ ఫలితాలను ఏప్రిల్ 24న ప్రకటించారు. 2023కి సంబంధించి ఫలితాలు మే 9న విడుదలయ్యాయి. 2022లో జూన్ 28న ఫలితాలను ప్రకటించారు. అదేవిధంగా 2021లో కూడా జూన్ 28న ఫలితాలను విడుదల చేశారు. 2020లో జూన్ 18న ప్రకటించారు.ఫస్ట్ సెకెండ్ ఇయర్ ఫలితాల కోసం అధికారిక వెబ్‌సైట్ బిబఎతివ.ఇఞణ.ఞనీల.తిని ఓపెన్ చేయాలి.ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్, బ్రిడ్జ్ కోర్స్ లింకులు కనిపిస్తాయి. దాని పక్కనే రిజల్ట్స్ లింక్ ఉంటుంది3.రిజల్ట్స్ లింక్‌పై క్లిక్ చేయాలి. రిజల్ట్ ఇయర్, ఫస్ట్ లేదా సెకండ్ ఇయర్ సెలెక్ట్ చేసుకోవాలి.క్యాటగిరీ, ఎగ్జామినేషన్ టైప్ సెలెక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేయాలి. గెట్ మెమోపై క్లిక్ చేసి.. ఫలితాలను చూసుకోవచ్చు..పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఫలితాలు ఓపెన్ అవుతాయి. భవిష్యత్తు అవసరాల కోసం దాన్ని ప్రింట్ తీసుకోవాలి.

35 శాతం సాధించాలి..

ఇంటర్మీడియట్ పరీక్షలు 2025లో ఉత్తీర్ణత సాధించడానికి.. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో కనీసం 35 శాతం మార్కులు సాధించాలి. మొత్తం మీద 35 శాతం మార్కులు సాధించిన వారు ఉత్తీర్ణులుగా పరిగణించబడతారు. ఫలితాలపై సంతృప్తి చెందని విద్యార్థులు రీ వాల్యూయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు.ఫలితాల విడుదల తర్వాత, మూల్యాంకనం లేదా మార్కుల విషయంలో విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే.. వారు ఇంటర్ బోర్డును సంప్రదించవచ్చు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చ్ 5 నుంచి 24 వరకు జరగగా, రెండవ సంవత్సరం పరీక్షలు మార్చ్ 6 నుంచి 25 వరకూ జరిగాయి.

భారత శక్తి
VOICE OF INDIAN

# ఆవిరవుతున్న కుబేరుల సంపద

ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్ దేశంలో అన్ని రంగాలపై క్రమంగా పడుతోంది. స్టాక్ మార్కెట్ నేల చూపుల విషయం కాసేపు పక్కనబెడదాం. రేపటి రోజుల ఇంకా ఎలాంటి టారిఫ్ విధిస్తారోనన్న భయం బిజినెస్‌మేన్లను వెంటాడుతోంది.అమెరికా- చైనా మధ్య సుంకాల యుద్ధం, ఆర్థిక మాంద్యం భయం స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులను కదిలించాయి, స్టాక్ మార్కెట్ దాదాపు 5 శాతం క్షీణతను చవిచూసింది. దీనివల్ల పెట్టుబడిదారులు రూ.20 లక్షల కోట్లకు పైగా నష్టపోయారు. సెన్సెక్స్ 3,939.68 పాయింట్లు క్షీణించింది. అదే సమయంలో, నిఫ్టీ కూడా 1,160 పాయింట్లకు పైగా క్షీణించింది. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజున సంభవించిన క్షీణత తర్వాత ఈ క్షీణతను అతిపెద్ద క్షీణతగా పరిగణిస్తున్నారు ఆర్థిక నిపుణులు. స్టాక్ మార్కెట్ దాదాపు 6 శాతం క్షీణతను నమోదు చేసింది. ఒక్క రోజులోనే పెట్టుబడిదారులు రూ.31 లక్షల కోట్లు నష్టపోయారు.గత 3 దశాబ్దాలకు పైగా, స్టాక్ మార్కెట్లో ఇలాంటి సందర్భాలు చాలా ఉన్నాయి. చైనా వస్తువులపై సుంకాలు విధించడం ద్వారా అమెరికా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరుస్తోందని చైనా సోమవారం ఆరోపించింది. అమెరికా ఈ సుంకాల విధానం అంతర్జాతీయ వాణిజ్య నియమాలను విస్మరించడమే. ఇది ప్రపంచంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. చైనా వస్తువులపై ట్రంప్ 34 శాతం అదనపు సుంకాన్ని ప్రకటించారు. అమెరికాకు ప్రతిస్పందిస్తూ, చైనా కూడా అమెరికన్ వస్తువులపై అదే రేటుతో సుంకం విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ సుంకాల యుద్ధ వాతావరణంలో హాంకాంగ్, షాంఘై స్టాక్ మార్కెట్లు క్షీణతను చూశాయి.. చైనాలో 2015 భయాందోళనలు కారణంగా ఆగస్టు 24, 2015 షేర్ మార్కెట్ క్రాష్ అయ్యింది. సెన్సెక్స్ 1,624 పాయింట్లు (5.94%) క్షీణత నమోదు చేసుకుంది. చైనా యువాన్ పతనం, ప్రపంచ మార్కెట్లలో భయాందోళనలు. బ్రెక్సిట్ భయాందోళనలు, చౌకైన చమురును ఆర్థికంగా దెబ్బతీశాయి. భారతదేశం కూడా ఈ క్షీణతలో చిక్కుకుంది. దాని కారణంగా ఒక్క రోజులోనే 7 లక్షల కోట్ల రూపాయలు నష్టపోయాయి. ఇది ఒక హెచ్చరిక. రెండు వైపులా ప్రపంచ సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రంప్ దెబ్బకు ఒక్కరోజులో నలుగురు భారతీయుల కుబేరుల సంపద 10.3 బిలియన్ డాలర్లు క్షీణించింది. ఈ విషయాన్ని ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ లిస్ట్ వెల్లడించింది.భారతీయుల సంపన్నుల జాబితాలో తొలి నాలుగు స్థానాల్లో ఉన్నారు ప్రముఖ వ్యాపారవేత్తలు. వారిలో ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, సావిత్రి జిందాల్ ఫ్యామిలీ, శివ్ నాడార్. సోమవారం స్టాక్ మార్కెట్ కుప్పకూలాయి. దాని దెబ్బకు ఆయా వ్యాపారవేత్తల సంపద ఒక్క రోజు భారీగా తగ్గింది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ లిస్ట్ స్వయంగా వెల్లడించింది. దాదాపు 10.3 బిలియన్ డాలర్లు సంపద క్షీణించినట్లు వెల్లడించింది.దేశంలో అత్యంత ధనికుడు రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ. ఆయన సంపద విలువ ఒక్కరోజు 3.6 బిలియన్ డాలర్లు తగ్గిపోయింది. ప్రస్తుతం ఆయన సంపద 87.7 బిలియన్ డాలర్లకు పడిపోయింది.ఇక అదానీ గ్రూప్‌ను నడుపుతున్న గౌతమ్ అదానీ సంపదలో 3 బిలియన్ల డాలర్ల తగ్గుదల స్పష్టంగా కనిపించింది. ఆయన నికర విలువ ఇప్పుడు 57.3 బిలియన్లు డాలర్లకు చేరింది.జిందాల్ గ్రూప్ యజమానులైన సావిత్రి జిందాల్ ఫ్యామిలీ 2.2 బిలియన్లు డాలర్లను కోల్పోయింది. ప్రస్తుతం వారి సంపద 33.9 బిలియన్లు పడిపోయింది. ప్రపంచ ధనవంతుల జాబితాలో 45వ స్థానంలో ఉన్నారు ఆమె. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకురాలు శివ్ నాడార్ ఈ జాబితాలోకి చేరిపోయారు. సోమవారం ఒక్కరోజు ఆయన సంపద 1.5 బిలియన్ డాలర్లు నష్టాన్ని చవిచూసింది. దీంతో ఆయన సంపద విలువ ప్రస్తుతానికి 30.9 బిలయన్లు డాలర్లుగా ఉంది.ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలాయి. దీంతో వ్యాపారవేత్తల సంపద ఆవిరైపోయింది. పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికాలో మాంద్యం భయాల కారణంగా పెట్టుబడిదారులు ఆలోచనలోపడ్డారు. సోమవారం రోజు బీఎస్ఈ సెన్సెక్స్ 2,200 పాయింట్లు పడిపోయింది. అటు నిఫ్టీ కూడా 700 పాయింట్లు పైగానే కోల్పోయింది. సెన్సెక్స్ బోర్డులో మదుపరులు అమ్మకాలకు మొగ్గు చూపడంతో అన్ని సూచీలకు సెగ తగిలింది.ప్రపంచ కుబేరుల పరిస్థితికి వద్దాం. 2025లో వారెన్ బఫెట్ సంపద 12.7 బిలియన్ డాలర్లు పెరిగి 155 బిలియన్ డాలర్లకు చేరింది. ఎలాన్ మస్క్ సంపద 130 బిలియన్ డాలర్లు తగ్గి 302 బిలియన్ డాలర్లకు పడిపోయింది. జెఫ్ బెజోస్ సంపద 45.2 బిలియున్ డాలర్లు తగ్గి 193 బిలియున డాలర్లకు చేరుకుంది.మార్క్ జూకర్ బర్గ్ సంపద 28.1 బిలియన్ డాలర్లు తగ్గి 179 బిలియన్ డాలర్లు చేరింది. బెర్నార్డ్ ఆర్నాల్ట్ సంపద 18.6 బిలియన్లు తగ్గి 158 బిలియన్ డాలర్లకు పడిపోయింది. బిల్ గేట్స్ సంపద సైతం 3.38 బిలియన్ డాలర్లు క్షీణించింది. 155 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ లిస్ట్ తెలిపింది.

# ఆక్వా రైతులకు గట్టి ఎదురుదెబ్బ

ఏలూరు, ఏప్రిల్ 8,(

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న కీలక నిర్ణయం వల్ల ఆంధ్రప్రదేశ్ ఆక్వా రైతులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా దిగుమతులపై సుంకాలను 3% నుండి 26% వరకు పెంచడంతో, ఏపీ నుంచి ఎగుమతి అయ్యే వనామీ రొయ్యల ధర ఒక్కసారిగా పడిపోయింది. దీని ప్రభావంతో రూ. లక్ష విలువైన రొయ్యలు ఇప్పుడు లక్షా 26 వేలు ఖర్చవుతుండగా, రవాణా, ప్యాకింగ్ తో కలిపి మొత్తం ఖర్చు 50% పెరిగిపోయింది.ఇక ఎగుమతి దారులు ధరలు కేజీకి రూ. 30 నుంచి 50 వరకు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 100 కౌంట్ రొయ్య ధర రూ. 250 ఉండగా, ఇప్పుడు అది రూ. 210కి పడిపోయింది. ఈ నెల 9వ తేదీ నుంచి అమెరికా సుంకం అమల్లోకి రానుంది. ఏటా ఏపీ నుంచి 17.2 లక్షల టన్నుల వనామీ రొయ్యలు అమెరికాకు ఎగుమతి అవుతుండగా, ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే రోజుకు 2 వేల టన్నులు వెళ్తున్నాయి.రైతుల ఆందోళనల నేపథ్యంలో, సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. రొయ్యలపై సుంకాల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. మత్స్యరంగం ఏపీ జీడీపీలో 11% వాటాతో కీలకంగా ఉందని, ఈ సంక్షోభ సమయంలో రైతులకు అండగా ఉండాలని ఆయన లేఖలో వివరించారు. అధిక సుంకాల వల్ల విదేశీ ఆర్డర్లు రద్దవుతుండటంతో పాటు, గిడ్డంగుల్లో నిల్వ స్థలాలు కూడా లేవని ఆయన వెల్లడించారు.ఇక కేంద్రం ఆక్వా రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ భరోసా ఇచ్చారు. అయితే, రైతులు ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వ్యాపారవర్గాలే ధరలు కుదించే సిండికేట్‌గా మారారని ఆరోపిస్తూ, రైతులకు అండగా పోరాడతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వమే దోచుకుంటుంది...

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ సీఎం జగన్ ప్రశ్నించారు. 100 కౌంట్ రొయ్యల ధర అకస్మాత్తుగా రూ.280 నుంచి దాదాపు రూ.200- రూ.210కి పడిపోయిందని చెప్పారు.చంద్రబాబు నాయుడు ఆక్వారంగం తీవ్ర సంక్షోభంలో ఉంటే నిద్రపోతున్నారా? అమెరికా టారిఫ్‌ల దెబ్బ ఒకటైతే, ఆపేరు చెప్పి మీ పార్టీకి చెందిన వ్యాపారులంతా సిండికేట్ అయి రైతులను దోచుకుతింటుంటే ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు? రోజు రోజుకూ ధరలు పతనం అవుతున్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదు?ప్రభుత్వ స్థాయిలో ఒక రివ్యూ చేసి, గట్టి చర్యలు ఎందుకు తీసుకోవడంలేదు? రైతులంతా గగ్గోలు పెడితే, మీడియా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలదీస్తే కేంద్రానికి ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసం? ఇక ప్రభుత్వం ఉండీ ఏం లాభం? 100 కౌంట్ రొయ్యల ధర అకస్మాత్తుగా రూ.280 నుంచి దాదాపు రూ.200- 210కి పడిపోయింది. ఈ ధరలు ఇంకా తగ్గుతున్నా, క్రాప్ హాలిడే తప్ప వేరే మార్గం లేదని రైతులు కన్నీళ్లు పెడుతున్నా ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ధాన్యం, పత్తి, పొగాకు, మిర్చి, కంది, పెసలు, మినుము, అరటి, టమోటా ఇలా ప్రతి పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోయింది. దళారులు రైతుల కష్టాన్ని దోచుకుతింటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సమస్యలను ప్రస్తావిస్తే మీ ప్రభుత్వం ఎదురుదాడి చేసి తప్పించుకుంటోంది తప్ప ఎక్కడా బాధ్యత తీసుకోవడంలేదు. ఇప్పుడు ఆక్వా విషయంలోనూ అంతే.ఎగుమతుల్లోనూ, అలాగే విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించడంలోనూ రాష్ట్ర ఆక్వారంగం దేశంలోనే నంబర్ వన్. అలాంటి రంగాన్ని మరింతగా ఆదుకోవడానికి ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీని మా హయాంలో ఏర్పాటు చేశాం. ఆక్వా సీడ్, ఫీడ్ ధరలను నియంత్రించడంతోపాటు నాణ్యత పాటించేలా ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చాం. సిండికేట్‌గా మారి దోపిడీచేసే విధానాలకు చెక్ పెడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా రొయ్యలకు ధరలు నిర్ణయించాం.కొవిడ్ సమయంలో దాదాపు ఐదేళ్ల క్రితం 100 కౌంట్‌కు, ఆ రోజుల్లో కనీస ధరగా రూ.210లు నిర్ణయించి రైతులకు బాసటగా నిలిచాం. మూడుసార్లు ఫీడ్ ధరలు తగ్గించాం. ఇప్పుడు ఫిష్ ఆయిల్, సోయాబీన్ సహా ముడిసరుకుల దిగుమతులపై సుంకం దాదాపు 15% నుంచి 5% తగ్గినా ఈ కూటమి ప్రభుత్వంలో ఫీడ్ ధరలు ఒక్కపైసా కూడా తగ్గలేదు. మేం ఏర్పాటు చేసిన నియంత్రణ బోర్డు అందుబాటులో ఉన్నాసరే రేట్లు తగ్గడంలేదు.గతంలో చంద్రబాబు హయాంలో ఆక్వాజోన్ పరిధిలో కేవలం 80-90వేల ఎకరాలు ఉంటే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ జోన్ పరిధిలోకి 4.22 లక్షల ఎకరాలు తీసుకువచ్చాం. ఆక్వా రంగంలో మొత్తం 64వేల విద్యుత్ కనెక్షన్లు ఉంటే అందులో జోన్ పరిధిలో ఉన్న 54వేల కనెక్షన్లకు రూ.1.50కే యూనిట్ కరెంటు అందించాం. దీనికోసం రూ.3,640 కోట్లు సబ్సిడీ కింద ఖర్చుచేశాం. ఆక్వాజోన్స్‌లో ఉన్న ఆర్బీకేల్లో ఫిషరీస్ గ్రాడ్యుయేట్లను ఆక్వా అసిస్టెంట్లుగా నియమించి రైతుకు చేదోడుగా నిలిచి, ఎప్పుడు సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపించాం. ఇప్పుడు ఆర్బీకే వ్యవస్థను నాశనం చేసి, అత్యధికంగా ఆర్జిస్తున్న రంగాన్ని దెబ్బతీస్తున్నారు.చంద్రబాబు.. ఇప్పటికైనా కళ్లు తెరవండి. వెంటనే రొయ్యలకు ధరలు ప్రకటించి, ధరల పతనాన్ని అడ్డుకోండి. అమెరికా టారిఫ్‌ల పేరుతో రైతుల్ని దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి. ఈ టారిఫ్‌లు అన్నవి కేవలం మన దేశానికి మాత్రమే పరిమితమైనవి కావు, ఇక ముందుకూడా ఇవి కొనసాగుతాయి. ఊరికే ఒక లేఖ రాసి చేతులు దులుపుకోవడం కాదు" అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

# వైసీపీలో రెడ్డి ? నాన్ రెడ్డి వార్


విజయవాడ, ఏప్రిల్ 8,(

జగన్ ఎక్కడ మాట్లాడినా అతను నోట్లోంచి వచ్చే మాట నా ఎస్సీలు? నా బీసీలు. ఈ నా ఎస్సీలు నా బీసీలు డైలాగే మొన్నటి ఎన్నికల్లో జగన్ కొంపముంచింది. వైసీపీలో పేరుకి ఎస్సీలు, బీసీలు నామస్మరణ చేస్తారే తప్ప?. నడిపించేదంతా రెడ్లే. ఎవరు అవునన్నా కాదన్నా వైసీపీ రెడ్ల పార్టీయే. ఈ మాట బయట జనం మాట్లాడుకునేదే కాదు పార్టీలో కూడా అందరూ ఇదే మాట్లాడుకుంటూ ఉంటారు. ఇప్పుడు వైసీపీలో రెడ్డి నాన్ రెడ్డి వార్ రోజు రోజుకి ముదురుతోంది. పార్టీలో రెడ్లకు ప్రాధాన్యం తగ్గించకపోతే భవిష్యత్తు కష్టమవుతుందని ఓపెన్ గానే మిగిలిన కులాల వాళ్లు మాట్లాడేసుకుంటున్నారు.2019?.24 మధ్య జగన్ పాలన అంతా రెడ్డి రాజ్యమే నడిచింది. ఓటమి తర్వాత పార్టీలో మిగిలిన కులాలు ఓపెన్ గానే రెడ్డి వ్యతిరేక స్వరం వినిపిస్తున్నాయి.ఏపీ రాజకీయాలను రెండు అగ్రకులాలు శాసిస్తున్నాఅనేది జగమెరిగిన సత్యం. వైసీపీ అంటే రెడ్ల పార్టీ. టిడిపి అంటే కమ్మ వాళ్ల పార్టీ. దీనిలో మరో వాదనే లేదు. 2009లో పి అర్ పి?..2014లో జనసేన వచ్చినప్పుడు మాత్రమే కాపులకు కూడా ఒక పార్టీ ఉంది అని జనం మాట్లాడుకున్నారూ. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాపులు పవన్ కళ్యాణ్ కోసం పూర్తిగా జనసేనతో నిలబడ్డారు. పవన్ కళ్యాణ్ కోసమే మూకుమ్మడిగా టిడిపికి కూడా ఓటు వేశారు. మనం ఎన్ని కబుర్లు చెప్పుకున్న ఏపీ రాజకీయాల్ని కమ్మ, రెడ్డి కులాలే ఈరోజుకి శాసిస్తున్నాయి. తెలుగుదేశం వ్యవహార శైలి వైసీపీకి భిన్నంగా ఉంటుంది. టిడిపి అధినాయకత్వం ఎప్పటికీ కమ్మ కులం చేతిలోనే ఉంటుంది. టిడిపి అధ్యక్షుడిగా ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ,చంద్రబాబు కుటుంబీకులే అవుతారు. అంతేకాక కమ్మ సామాజిక వర్గం ఒక ఓజోన్ లేయర్ లాగా టిడిపిని కాపాడుకుంటూ వస్తుంది. అయితే ఈ భావన ఎక్కడా కనిపించకుండా టిడిపి మొదటినుంచి బీసీలకు, ఇతర కులాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా కలరింగ్ చూపిస్తుంది. అందుకే బీసీ కులస్తుడైన అచ్చం నాయుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా తెర పై పెడతారు. బీసీలకు ఎస్సీలకు పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇస్తున్నట్లే చూపిస్తారు. అంతేకాదు వాళ్ళకి సముచిత గౌరవం కూడా ఉంటుంది. అందువల్ల టిడిపిలో కుల పరమైన అసంతృప్తి సాధ్యమైనంత వరకు రాదు.వైసీపీ విషయానికొస్తే అలా ఉండదు. అది 100% రెడ్ల పార్టీ. ఎవరు ఎలా అనుకున్నా కూడా రెడ్ల కి అన్ని స్థాయిల్లోనూ ప్రాధాన్యం ఇస్తారు.పైకి మాత్రం జగన్మోహన్ రెడ్డి నా ఎస్సీలు, నా బీసీలు అని గట్టిగా అరుస్తుంటాడు. ఆ పార్టీలో ఎస్సీలు, బీసీలు నిర్ణయాత్మక శక్తి కానే కాదు. జగన్ సీఎం గా ఉన్నప్పుడు ఐదుగురు డమ్మీ డిప్యూటీ సీఎం లను పెట్టాడు. ఎస్సీలు ,బీసీలు, ఎస్సీలకు ప్రాధాన్యమిస్తూ డిప్యూటీ సీఎం పదవులు వాళ్ల కేటాయించాడు. కానీ వాళ్లు పూర్తిగా డమ్మీలనే విషయంబయట అందరికీ తెలుసు. అసలు రాజ్యాంగంలోనే లేని డిప్యూటీ సీఎం ఏ కులం వాడికి ఇచ్చినా ఒకటే. ఆ పోస్టుకి ప్రత్యేకంగా పవర్స్ ఉండవు. అది అందరిలాంటి మంత్రి పదమే.ఇక వైసీపీలో రెడ్ల ఆధిపత్యం ఎలా ఉంటుంది అనడానికి ఆ పార్టీలో రీజనల్ ఇన్చార్జిల నియామకమే ఒక ఉదాహరణ. పార్టీకి జగన్ మోహన్ రెడ్డి సెంటర్ పోల్ అయితే నాలుగు స్తంభాలాగా విజయ సాయి రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవహరించేవారు. ఉత్తరాంధ్రాకి ఇన్చార్జిగా జగన్?. విజయ్ సాయి రెడ్డిని నియమించాడు. అలాగే రాయలసీమకి ఇంచార్జిగా సజ్జల ఉండేవాడు. కోస్తా జిల్లాలకు మిధున్ రెడ్డి ఇన్చార్జిగా ఉండేవాడు. అసలు విజయసాయిరెడ్డి అనే వ్యక్తికి ఉత్తరాంధ్రకి సంబంధం ఏమిటో ఎవరికి తెలియదు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్ళు విజయ్ సాయి రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాలకు ముఖ్యమంత్రి లా వ్యవహరించాడు.ప్రతి వ్యాపారంలో, రియల్ ఎస్టేట్లో ఆయన వేలు పెట్టాడు. ఉత్తరాంధ్రని అల్లకల్లోలం చేసి వదిలిపెట్టాడు. అక్కడ వైసీపీ దారుణ ఓటమికి విజయ్ సాయి రెడ్డి ప్రధాన కారణం. ఇక మిధున్ రెడ్డికి కోస్తా జిల్లాలకి ఏ సంబంధము ఎవరికీ అర్థం కాదు. సాయిరెడ్డి అంతా అల్లకల్లోలం చేయకపోయినా మిథున్ రెడ్డికి కోస్తా జిల్లాల పాలిటిక్స్ అసలు అర్థం కాలేదు. కోస్తా జిల్లాల్లో మిధున్ పూర్తిగా వైఫల్యం చెందాడు. ఇక సజ్జల రాయలసీమ వ్యవహారాలను పట్టించుకున్నదే లేదు. ఆయన నెంబర్ 2 లా వ్యవహరించి మొత్తం పార్టీని ముంచాడు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో మిగిలిన రెడ్లు అంతా సామంత రాజుల్లా వ్యవహరించారు. చివరికి ఓటమి తర్వాత కూడా మళ్లీ సాయిరెడ్డి నేను తీసుకెళ్లి ఉత్తరాంధ్రకి ఇంచార్జిగా పెట్టాడు జగన్. ఆ ప్రాంతం నాశనం అయిన?.. తన పార్టీ నాశనం అయిన కూడా సాయిరెడ్డి పై మమకారం పోలేదు జగన్ రెడ్డికి. సాయి రెడ్డి నిష్క్రమణ తర్వాత జ్ఞానోదయం అయ్యింది.చివరికి కాపు కులస్తుడైన కురసాల కన్నబాబుని ఇప్పుడు ఉత్తరాంధ్రకి ఇంచార్జిగా పెట్టారు. ఇది కేవలం ఉత్తరాంధ్రకి సంబంధించిన వ్యవహారమే కాదు పార్టీలో ఇప్పటికీ రెడ్ల హవాయే నడుస్తుందని మిగిలిన కులాల నాయకులు అంతర్గతంగా ఆవేదన వ్యక్తం చేస్తూ ఉంటారు. పేరుకి ఎస్సీలు, బీసీలు అని నినాదాలు చేసినప్పటికీ పెద్ద పోస్టులన్నిటిలోనూ రెడ్లే ఇప్పటికీ వైసీపీలో చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా జగన్ చుట్టూ రెడ్లే ఉండేవారు. ధనంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైయస్ అనిల్ రెడ్డి వీళ్లు జగన్ చుట్టూ దడి కట్టేవారు. బొత్స సత్యనారాయణ, ధర్మాన, కారుమూరి నాగేశ్వరరావు, దాడిశెట్టి రాజా, పేర్ని నాని, గుడివాడ నాని లాంటి వాళ్లకు సెకండ్ ప్రయారిటీ మాత్రమే దక్కేది. జగన్ ఆర్థిక వ్యవహారాలని పూర్తిగా రెడ్లు మాత్రమే హ్యాండిల్ చేసేవాళ్లు. చివరికి లిక్కర్ స్కామ్ లో కూడా రాజ్ కసిరెడ్డి కీలక పాత్ర పోషించాడు.వైసీపీలో రెడ్ల ఆధిపత్యం? ప్రభావం ఎంతగా ఉంటుందంటే మొన్నటి ఎన్నికల్లో రాయలసీమలో 54 అసెంబ్లీ సీట్లు ఎక్కడ ఒక్క బలిజ కి కూడా సీట్ ఇవ్వకుండా ధైర్యంగా, మొండిగా బరిలోకి దిగాడు జగన్. అదేమని అడిగితే బలిజలు ఈసారి మనకు ఎలాగూ ఓటు వేయరు. కనుక వాళ్లకి టికెట్ ఇచ్చి వృధా అని నిర్మొమాటంగా చెప్పేసాడు జగన్. ఇక జగన్ హయాంలో పార్టీలో రెడ్లే ఎక్కువగా సంపాదించారు. వ్యాపారాలు కూడా భారీగానే చేశారు. విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, మిధున్ రెడ్డి, సుబ్బారెడ్డి ఐదేళ్లలో ఒక్కరోజు కూడా వృధా చేయకుండా కుమ్మి పడేశారు. సాయి రెడ్డి విశాఖలో వ్యాపారాలు విస్తరించాడు. సజ్జల?. ఆయన కుమారుడు భార్గవ్ రెడ్డి తెలివిగా పైకి కనబడకుండా మైన్స్, ఎడ్యుకేషన్, స్కూల్స్, టాబ్స్ ఇలాంటి వాటిలో కోట్లు కొట్టేశారు. ఇక లిక్కర్ స్కామ్ మొత్తం మిథున్ రెడ్డి కనుసన్న లోనే జరిగింది. సుబ్బారెడ్డి ఆయన కుమారుడు కాకినాడ సీ పోర్టు, ఎస్సీ జడ్ లో వాటాలు కొట్టేశారు. మిగిలిన కులాల నాయకులకు అవినీతిలో కూడా ఎక్కడ జోక్యం చేసుకోకుండా అడ్డుకున్నారు.ఇప్పుడు అధికారం పోయాక దీనిపై బాగా చర్చ జరుగుతుంది. పార్టీలో రెడ్ల ఆధిపత్యం ఏమాత్రం తగ్గలేదు. మిగిలిన కులాల వాళ్లందర్నీ ప్రెస్ మీట్ లకి, ధర్నాలకి, ఆందోళనలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఇప్పటికీ జగన్ తో క్లోజ్ డోర్ మీటింగ్స్ లో మాట్లాడుకునేది రెడ్లే అని పార్టీలోనే బహిరంగంగా చెప్పుకుంటూ ఉంటారు.ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన కులాల వాళ్ళు పార్టీలో ఉండాలా వెళ్లిపోవాలా అని చర్చించే నాయకులు లేకపోలేదు. టిడిపిలోకి వెళ్తే అక్కడైనా కమ్మ ఆదిపత్యమే కదా?. లోకి వెళ్దాం అంటే అది భవిష్యత్తు లేని పార్టీ?. తిట్టుకుంటూనో తుమ్ముకుంటునో వైసీపీలోనే ఉండాలా? లేక నిత్యం నిరసన గళం వినిపిస్తూ ఉండాలా అనే మీ మాంసలో కొట్టుమిట్టాడుతున్నారు వైసీపీలో మిగిలిన కులాల నేతలు.

# రాజధానికి మరో .4285 కోట్లు

విజయవాడ, ఏప్రిల్ 8

ఏపీ రాజధాని అమరావతికి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రాజధాని నిర్మాణానికి రూ.4285 కోట్ల నిధులు విడుదల చేసింది. రాజధాని నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులు 25 శాతం విడుదల చేసింది. ఈ నిధులకు కేంద్రం వాటా రూ.750 కోట్లు కలిపి మొత్తం రూ.4285 కోట్లు ఇచ్చింది. అమరావతిలో పనులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 25 శాతం నిధులు అడ్వాన్స్‌గా ఇవ్వాలని సీఆర్డీఏ కేంద్రాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా నిధులను విడుదల చేసింది.ప్రధాని మోదీ ఏపీ రాజధాని అమరావతిలో పర్యటనకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ ఏప్రిల్ మూడో వారంలో ఏపీకి రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటన కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. ఈ కార్యక్రమానికి లక్షల్లో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తుంది. వెలగపూడి సచివాలయం సమీపంలో 250 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పనులు ప్రారంభించారు. సామాన్య ప్రజలతో పాటు వీవీఐపీలు, వీఐపీల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభాస్థలికి చేరుకునేందుకు మొత్తం 8 మార్గాలను గుర్తించారు.రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి. అమరావతి నగరాన్ని రోడ్డు, రైలు, వాయు మార్గాల ద్వారా నేరుగా అనుసంధానించేలా, అత్యధునిక పరిజ్ఞానంతో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. అమరావతిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రైల్వేస్టేషన్‌ను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నెక్కల్లు-పెదపరిమి సమీపంలో దేశంలోకెల్లా అతిపెద్ద రైల్వేస్టేషన్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కోసం ఏపీ ప్రభుత్వం రైల్వేశాఖకు సుమారు 1500 ఎకరాలు అప్పగించేందుకు సుముఖత



వ్యక్తం చేసినట్లు సమాచారం.అమరావతి రైల్వేలైన్‌ను రెండు దశలుగా చేపట్టాలని కేంద్ర రైల్వేశాఖ ఇటీవల నిర్ణయించింది. మొత్తం 56.53 కి.మీ. రైల్వేలైన్‌లో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి 27 కి.మీ. లైన్‌ను మొదటి దశగా చేపట్టనున్నారు. ఈ రైల్వే లైన్ కోసం రెండు నెలల్లో టెండర్లను ఆహ్వానించనున్నారు. తొలి దశలోనే దాములూరు-వైకుంఠపురం మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ. మేర రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపడతారు. వచ్చే రెండు నెలల్లోగా భూసేకరణ పూర్తి చేయగలమని రైల్వే శాఖ ధీమా వ్యక్తం చేసింది. తొలిదశ పనుల కోసం సుమారు రూ.800 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. తాడికొండ మండలంలో రైల్వే లైన్ కోసం భూములిచ్చేందుకు కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో అక్కడ భూసేకరణ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.అమరావతి రైల్వేస్టేషన్‌ను ఎయిర్ పోర్టు తరహాలో నగర శివారులో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దేశంలోకెల్లా అతిపెద్ద మోడల్ రైల్వేస్టేషన్‌గా అత్యాధునిక సౌకర్యాలతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా దీనిని నిర్మించాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

## ఫలక్ నామ ఎక్స్ ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

శ్రీకాకుళం

ఫలక్ నామా ఎక్స్ ప్రెస్ కు ప్రమాదం తృటిలో తప్పింది. రైలు బోగీలు విడిపోయాయి. కప్లింగ్ వీడి రైలు రెండు భాగాలుగా విడిపోయింది. 8వ భోగీ వద్ద ప్రమాదం జరగ్గా.. 15 భోగీలు ఇంజనుతో సహా వెల్లిపోయాయి. ఘటన స్థలానికి రైల్వే సిబ్బంది చేరుకుంది. శ్రీకాకుళంలోని పలాస సమీపంలో ఘటన జరిగింది. దాంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురైయారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని సమాచారం.

## అగ్ని ప్రమాదంలో పవన్ కళ్యాణ్ కుమారుడికి గాయాలు

విజయవాడ

సింగపూర్లో జరిగిన అగ్నిప్రమాదంలో డిప్యూటీ సీ పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డాడు. దాంతో పవన్ తన అల్లూరి సీతారామరాజు రాజు జిల్లాలో పర్యటన ముగించుకుని సింగపూర్ బయలుదేరారు. చేతులు, కాళ్లకు గాయాలు కావడంతో పాటు ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో మార్క్ శంకర్ను ఆసుపత్రిలో చేర్పించారు..

## ప్రవీణ్ పగడాల మృతిపై నిజనిర్ధారణ చేయాలి

పెద్దపల్లి ప్రతినిధి:

ప్రవీణ్ పగడాల మృతిపై నిజ నిర్ధారణ చేయాలని పెద్దపల్లి లో శాంతి ర్యాలీ నిర్వహించా రు. పెద్దపల్లి పట్టణంలోని పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు షద్రక్ పాస్టర్ సుదర్శన్ మాట్లాడుతూ ఇటు తెలంగాణ ప్రభుత్వం, అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు ప్రవీణ్ పగడాల మృతిపై సరైన న్యాయం చేయాలన్నారు. పాస్టర్ డేవిడ్ మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మతం కన్నా మానవత్వం ఉన్నవాడని, అనాధ పిల్లలను

అక్కున చేర్చుకొని విద్యను నేర్పించి వివాహాలు చేశాడన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించి, ఉద్యోగస్తులుగా మార్చాడని, వారి కుటుంబ ఆర్థిక అభివృద్ధిని పెంపొందించ డానికి కృషి చేశాడని తెలిపారు. కుల నిర్మూలనకు కృషి చేస్తూ, మనిషిని మతం దృష్టితో చూడకుండా మనిషిని మనిషిలా చూడాలని హితబోధ చేసేవాడన్నారు. ఇండియన్ మిషన్ స్కూల్ నుండి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలి నిర్వహించి అక్కడ కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, క్రిష్టియన్లు పాల్గొన్నారు.

## నిర్దేశిత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి కావాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

,పెద్దపల్లి ప్రతినిధి :

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మన జిల్లాలో చేపట్టిన 7 తహసిల్దార్ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, రాబోయే జనవరి నాటికి నూతన తహసిల్దార్ కార్యాలయాల ప్రారంభోత్సవం కావాలని అన్నారు. మంథని పట్టణంలో 4.5 కోట్లతో చేపట్టిన సమీకృత కార్యాల యాల సముదాయం పనులను రాబోయే ఉగాది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించి పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు.

జిల్లాలోని హెల్త్ సెంటర్స్ మరమ్మత్తు పనులు, సబ్ సెంటర్ భవనాలు, పాఠశాలల మరమ్మత్తు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, రెసిడెన్షియల్ పాఠశాలల ,హాస్టల్స్ మరమ్మత్తు పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించు కుంటూ సమ్మర్ సీజన్ పూర్తయ్యే లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించా రు. ఈ సమావేశంలో పంచాయతీ ఈఈ రాజ్ గిరీష్ బాబు, డి.ఆర్.డి.ఓ. కాలిందిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

మచిలీపట్నం

కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెచ్చినా నల్ల చట్టం వక్ఫ్ బోర్డు సవరణకుబిల్లుకు వ్యతిరేకంగా మచిలీపట్టణం ముస్లిం సమాజం నిరసన చేపట్టింది. వెంటనే బేషరతుగా వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున సుమారు 5000మందితో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో ముస్లిం సోదరులకు తోడుగా మేము వున్నాం అంటూ మద్దతుగా తెలుపుతూ హిందూ సోదరులు, క్రైస్తవ, దళిత సోదరులు పాల్గొన్నారు

వివిధర రాజకీయపార్టీలు మద్దతు తెలుపుతూ ఈ కార్యక్రమం లో పాల్గొని వాళ్ల సహాయాన్ని అందిస్తూ మీకు మద్దతుగా మేముంటాము అని భరోసా ఇచ్చారు

# నెట్‌వర్క్ ఆస్పత్రులో ఆరోగ్య శ్రీ సేవలు బంద్

విజయవాడ, ఏప్రిల్ 8

ఏపీలో ఆరోగ్య శ్రీ సేవలు పూర్తిగా పడకేశాయి. ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.3500కోట్లకు చేరడంతో సేవల్ని నిలిపివేస్తున్నట్టు ఆరోగ్య శ్రీ ఆస్పత్రుల సంఘం ఆశా ప్రకటించింది. ఆరోగ్య శ్రీ బకాయిల విడుదల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 26సార్లు లేఖలు రాసినట్టు ఆస్పత్రుల సంఘం చెబుతోంది.ఏపీలో ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో సేవల్ని నిలిపి వేస్తున్నట్టు ఆస్పత్రుల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం – ఆశా గతనెలలోనే సమ్మె నోటీస్ ఇచ్చింది.కనీసం రూ.1500కోట్లు విడుదల చేస్తే కానీ సేవలు అందించలేమని తేల్చి చెప్పింది. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న బకాయిలతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందించిన సేవలకు రూ. 3500 కోట్ల బకాయిలు పేరుకున్నాయి. ఇప్పటి వరకు 26 సార్లు ప్రభుత్వానికి నిధుల విడుదల కోసం లేఖలు రాసినట్టు ఆస్పత్రుల సంఘం చెబుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శ్రీ స్థానంలో బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా అమలు చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అందించే చికిత్సలకు ధరలు తక్కువగా ఉన్నాయని ఆస్పత్రులు అభ్యంతరం చెబుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 6 నుంచి దశల వారీగా చికిత్సలు నిలిపివేస్తున్నారు.ప్రైవేట్ ఆస్పత్రల్లో ఆరోగ్య శ్రీ ఓపీలు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ సేవల్ని నిలిపివేశారు. దాదాపు మూడు నెలలుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో అరకొరగా సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య శ్రీ సేవల్ని ట్రస్టు ద్వారా కాకుండా బీమా కంపెనీల భాగస్వామ్యంలో అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద అన్ని రకాల చికి త్సలు నిలిపివేస్తామని ఆస్పత్రుల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈవో రవి, అడిషనల్ సీఈవో న్ ప్రసాద్‌బాబు, ఇతర అధికారులు.. ఆషా అధ్యక్షుడు డా. విజయ్ కుమార్, కార్యదర్శి అవినాశ్ ఇతర ప్రతినిధులతో చర్చలు జరుపుతూనే ఉన్నారు.బిల్లులను త్వరితగతిన చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నట్టు ట్రస్టు ప్రతినిధులు ఆస్పత్రుల యాజమాన్యాలకు వివరించారు. తాము ప్రభుత్వానికి ఎన్నో మార్లు విజ్ఞప్తి చేసినా బిల్లుల చెల్లింపుల్లో పురోగతి లేకపోవడంతో విధిలేక సేవలను నిలిపి వేస్తున్నట్టు ఆషా కార్యదర్శి అవినాశ్ వివరించారు. తాము గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆశా తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత విడుదల చేసిన బకాయిలు కంటే నెట్వర్క్ ఆస్పత్రులు అందించిన వైద్య సేవల విలువ ఎక్కువగా ఉందని తెలిపింది. గతేడాది ఏప్రిల్లో చేసిన వైద్య సేవలకు ఇంత వరకూ పూర్తి చెల్లింపులు జరగలేదని పేర్కొంది.

## ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవం పండుగ

కడప ఏప్రిల్ 8,(

ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరగనున్న సీతారాముల కల్యాణోత్సవం పండుగ వాతావరణంలో భక్తులందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్టలో జరిగిన సమీక్షాలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర విభజన అయ్యాక దేవాదాయ శాఖ నుంచి ఒంటిమిట్ట ఏకశిలానగరాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో టీటీడీలో విలీనం చేశారని, అప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని గుర్తు చేశారు.2019లో కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించాలని, అన్నమయ్య నివసించిన ప్రాంతం కనుక ఇక్కడే టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించాలని సీఎం భావించారని గుర్తు చేశారు.ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగకు ముత్యాల తలంబ్రాలు సమర్పించడానికి సీఎం చంద్రబాబు వస్తున్నారని వెల్లడించారు.ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గట్టుగా టీటీడీ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కోరారు. సీఎం వచ్చి వెళ్లేంత వరకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైవే సెక్టార్ లలో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుండి అంబులెన్స్ లను అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు , డ్రోన్ కెమెరాలు పెంచాలని, వేసవి నేపథ్యంలో ఫైర్ సర్వీస్ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు వెలుపలికి సులువుగా వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్



కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఒంటిమిట్ట ఆలయాన్ని ఒక గొప్ప పుణ్య క్షేత్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.కడప జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ, అందరూ కలిసికట్టుగా సమిష్టిగా పనిచేసి సీతారాముల కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కల్యాణ వేదిక ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో కల్యాణ వేదిక వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతులు ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. కడప జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పటిష్ట బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా, వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదం కౌంటర్లు, లైటింగ్, వైద్యశిబిరాలు, మరుగుదొడ్లు, అదనపు పారిశుద్ధ్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమీక్షకు ముందు కల్యాణోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లపై మంత్రులకు జిల్లా కలెక్టర్, టీటీడీ జేఈవో, జిల్లా ఎస్పీ, టీటీడీ సీవీఎస్వోలు నివేదించారు.

## క్షమాపణ చెప్పిన ఎమ్మెల్యే విరూపాక్షి

కర్నూలు

కర్నూలు జిల్లా ఆలూరు వైసిపి ఎమ్మెల్యే విరూపాక్షి అత్యుత్సాహం ప్రదర్శించి అడ్డంగా బుక్కయ్యారు.శ్రీరామనవమి సందర్భంగా విరూపాక్ష స్వగ్రామం చిప్పగరలోని కొండావిధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి రాములోరి కల్యాణం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే హోదాలో విరూపాక్షి ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా విరూపాక్షి చేతికి వేద పండితులు మంగళసూత్రాన్ని ఇవ్వగా... ఎమ్మెల్యే స్వయంగా సీతమ్మ వారి మెడలో కట్టేశారు.అయితే దీనికి సంబంధించిన వీడియోల సోషల్ మీడియా వైరల్ కావడంతో హిందూ సంఘాల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఎమ్మెల్యే విరూపాక్ష వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి .దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ఎమ్మెల్యే విరూపాక్ష స్పందించారు. మీడియా వేదికగా సంజాయిషీ ఇచ్చారు. తెలియక చేసిన తప్పు అని, పండితులు చెప్పిన ప్రకారం తాను చేశానని, ఉద్దేశపూర్వకంగా చేయలేదని చెప్పారు. సామాన్య భక్తుడిగానే గుడికి వచ్చారని, సీతారాముల కల్యాణం జరుగుతుండగా పండితుల సూచన మేరకు మాంగళ్యం సీతమ్మవారి మెడలో వేశానని సంజాయిషి ఇచ్చారు.ఇలా చేయడం తప్పేనని ఎమ్మెల్యే ఒప్పుకుంటూ క్షమాపణ చెబుతున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు.తన వల్ల పొరపాటు జరిగిందని...పొరపాటుకు చింతిస్తున్నానని, ఈ ఘటన ఎవరినైనా బాధ పెట్టి ఉంటే క్షమాపణలు చెబుతున్నానని ఆ వీడియోలో విరూపాక్షి చెప్పుకొచ్చారు. అయినా తాను కావాలని ఈ పని చేయలేదని, తన చేతికి మంగళసూత్రం ఇచ్చిన పండితులు చెబితేనే.. దానిని సీతమ్మ మెడలో వేశానంటూ ఆయన చెప్పుకొచ్చారు.

## ఎమ్మెల్యే ఫొటోలను ప్రొఫైల్ ఫొటోగా వాడుకుని..

### 26 మంది యువతులను పెళ్లి పేరుతో నమ్మించి..

హైదరాబాద్

టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. సోషల్ మీడియా ఉపయోగించుకుని మోసాలకు తెగబడుతున్నారు కొందరు వ్యక్తులు. తాజాగా ఓ వ్యక్తి ఏకంగా ఎమ్మెల్యే ఫొటోలను ప్రొఫైల్ పిక్ గా వాడుకుని యువతులను బురిడీ కొట్టించాడు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 26 మంది యువతులను పెళ్లి పేరుతో నమ్మించి డబ్బులు దండుకున్నాడు. దీనికోసం షాది డాట్ కామ్ ను ఉపయోగించుకున్నాడు. షాది డాట్ కామ్ మోసగాడి కేసులో సంచలన విషయాలు వెలుగుచూశాయి. ఐదు రోజుల కస్టడీ తీసుకుని విచారణ చేస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఫొటోను వాడుకున్నట్లు నిందితుడు జోగాడ వంశీకృష్ణ అలియాస్ హర్ష వెల్లడించాడు. నాలుగు రాష్ట్రాల్లో 26 మంది యువతులను పెళ్లి పేరుతో నమ్మించి డబ్బులు దండుకున్నట్టు విచారణలో తేలింది. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తో పాటు కాకినాడలో ఒకే కాలేజీలో చదివిన వంశీకృష్ణ.. 2016 నుంచి గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఫొటోను తన ప్రొఫైల్ ఫొటోగా వాడినట్లు వంశీ కృష్ణ తెలిపాడు. మోసాల కోసం స్నేహితుల పేర్లతో మూడు సిమ్ కార్డులు వాడినట్లు పోలీసులు గుర్తించారు.

## చిన్నంపల్లెలో ఉద్రిక్తత

అన్నమయ్యఓబులవారిపల్లి మండలం పెద్దవరంపాడు రెవెన్యూ గ్రామంలోని చిన్నంపల్లె లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 2202 లో స్థానికేతరులు జేసిబి తో భూ అక్రమ చేస్తుండగా, గ్రామ పరిధిలో ని దళితులు అడ్డుకున్నారు. సోమవారం రెవిన్యూ అధికారులకు దళితులు అర్జీ ఇవ్వగా,మంగళవారం స్థానికేతరులు జేసిబి తో ప్రభుత్వ భూముల చదును చేయబోయారు.

# పశ్చిమ వైసీపీలో గ్రూపుల గోల

ఏలూరు, ఏప్రిల్ 8,

ఏపీలో ఓటమి తర్వాత వైసీపీలో గ్రూపు రాజకీయాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయంట. ఇప్పటికే చాలా మంది నేతలు పార్టీని వీడి కూటమిలోకి చేరడంతో..అదే బాటలో మరికొంత మంది పయనించేందుకు రెడీగా ఉన్నారంట. తాజాగా ఏలూరు జంపింగ్ పాలిటిక్స్ తెరమీదకు వచ్చాయి.. ఇప్పటికే మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే.అయితే ఆయన కంటే ముందే మేయర్ కార్పొరేటర్లు ఇంకా ఎందరో కీలక నేతలు పార్టీని వీడడడంతో జిల్లాలో ఫ్యాన్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందట. ఇంత జరుగుతున్నా పార్టీ అధిష్టానం మాత్రం ఆందోళన చెందకుండా గతంలో ఆళ్ళనానికి కీలక అనుచరుడుగా ఉన్న మామిళ్ళపల్లి జయప్రకాష్ అలియాస్ జేపీకి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలను కట్టబెట్టింది. జేపీ కూడా ఏలూరులో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.వరకు బాగానే ఉన్నా జేపీ..ఆళ్ళ నాని అనుచరుడు కావడంతో ఇక్కడే అసలు సమస్య మొదలైందట. ఆళ్లనానికి సన్నిహితంగా ఉంది ఎవరు..? తమకు అడ్డుగా ఉన్నవాళ్లు ఎవరు? పార్టీకి అవసరంలేని వారు ఎవరు అంటూ ఒక్కొక్కరిని పార్టీకి దూరం చేస్తున్నారంట వైసీపీలో ఉన్న కొందరు నేతలు. అసలే అధికారం లేక తీవ్ర నిరాశలో ఉన్న క్యాడర్ ఇప్పుడు కొత్త నేతల రాకతో మరింత కుంగిపోతున్నారని కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారట.వైసీపీలో ఈ గ్రూపు రాజకీయాలతో కీలక మహిళ నేత, మాజీ సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి కూడా తీవ్ర సంతృప్తిలో ఉన్నారట. కాంగ్రెస్ పార్టీలో ఆళ్ళ నానితో పాటే ఉంటూ ఆ తర్వాత వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరించిన యాదవ సామాజిక వర్గానికి ప్రతినిధిగా ఉన్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిని ఇటీవల వైసీపీ అధిష్టానం సస్పెండ్ చేసింది.అయితే ఈ సస్పెన్షన్ వెనకున్నది ఎవరు..? ఆమెను పార్టీ అధిష్టానానికి దూరం చేసిందెవరు? అనే ప్రశ్నలు ఇప్పుడు ఏలూరులో పొలిటికల్ చర్చకు దారితీశాయట. ఆమెను పార్టీకి దూరం చేయడానికి కారణం గ్రూపు రాజకీయాలేననే పుకార్లు షికార్లు చేస్తున్నాయి.కొత్త నియోజకవర్గ ఇంచార్జిగా జేపీకి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తనపై కావాలని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని..తనను పార్టీకి దూరం చేసే ప్రయత్నాలు చేశారని కార్యకర్తల దగ్గర శ్రీలక్ష్మి ఆవేదన వెల్లగక్కారట.. పార్టీలో తనకు కీలక పదవి వచ్చే సమయంలోనే ఇవన్నీ జరిగాయని.. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతుంటే సస్పెండ్ చేయడమేంటని శ్రీలక్ష్మి కొంత ఆగ్రహంగా ఉన్నారంట. ఇదిలా ఉంటే శ్రీలక్ష్మిపై యాక్షన్ ఎపిసోడ్ వెనుక ఓ మాజీ మంత్రి ఉన్నారనే చర్చ కూడా లోకల్‌గా నడుస్తోంది.మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు.. తణుకు అసెంబ్లీ నియోజకవర్గానికి గుడ్ బై చెప్పి తిరిగి ఏలూరు వచ్చేందుకు వేసుకుంటున్న ప్రణాళికల్లో భాగంగానే ఆయన సామాజిక వర్గానికి చెందిన పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిని పార్టీకి దూరం చేశారని ఓ వర్గం గట్టిగా నమ్ముతుందట.ఎందుకంటే గతంలో కాంగ్రెస్ పార్టీలో కూడా వీరిద్దరూ పనిచేసిన సందర్భాలు ఉండడం..అప్పుడు ఏం జరిగిందో గాని ఇప్పుడు మాత్రం వారి వల్ల వైసీపీకి నష్టం చేకూరే ప్రమాదం తలెత్తిందన్న చర్చ జరుగుతోందట. కాంగ్రెస్ హయాంలో ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ గా కారుమూరి నాగేశ్వరరావు పనిచేయడం, ఆ తర్వాత పక్కనే ఉన్న దెందులూరు అసెంబ్లీ నియోజవర్గం నుంచి ఆయన పోటీ చేసి ఓడిపోయారు.మరోవైపు నరసాపురం పార్లమెంట్లో తణుకు అసెంబ్లీ నుంచి కూడా ఆయన పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించడం?దాంతో జగన్ క్యాబినెట్లో మంత్రిగా పనిచేశారు. ఇటీవల జరిగిన 2024 ఎన్నికల్లో కారుమూరి నాగేశ్వరరావు మరోసారి పోటీ చేసి టిడిపి అభ్యర్థి ఆరమిల్లి రాధాకృష్ణపై ఓడిపోవడంతో ఇక తణుకులో తన భవిష్యత్తు కష్టమని, ఏలూరుకు తిరిగి వచ్చేందుకు కారుమూరి నాగేశ్వరరావు ప్లాన్ వేసుకుంటున్నారని సమాచారం. అందులో భాగంగానే పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిని పార్టీకి దూరం చేశారంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.అంతేకాదు..ఇటీవల మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఏలూరులో ప్రెస్ మీట్ పెట్టడం ఆ తర్వాత కొంతమంది ముఖ్య నేతలతో సమావేశం కావడంపై ఈ అనుమానాలన్నీ నిజమేనని భావించాల్సి వస్తుందట. ఏది ఏమైనప్పటికీ..అధికారం కోల్పోయిన వైసీపీని ఒక్కొక్కరు వీడిపోతున్న ఇలాంటి సమయంలో శ్రీలక్ష్మి పార్టీ నుంచి సస్పెండ్ కావడంతో జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిందంట.

## జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు? రాత్రి గస్తీ సిబ్బంది అప్రమత్తం..

రాయచోటి, ఏప్రిల్ 8:

జిల్లా ఎస్పీ .వి.విద్యాసాగర్ నాయుడు రాయచోటి పట్టణంలో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాత్రిపూట పోలీసులు నిర్వహిస్తున్న గస్తీని ఆయన స్వయంగా పరిశీలించారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో, రద్దీగా ఉండే ప్రాంతాల్లో, అలాగే శివారు ప్రాంతాల్లోని పోలీస్ పెట్రోలింగ్ బృందాలను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ గస్తీ సిబ్బందితో మాట్లాడి వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే తనిఖీలు చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతలను కాపాడటానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. రాత్రి 10:30 గంటల తర్వాత అనవసరంగా రోడ్లపై ఎవరూ తిరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు.

# మళ్లీ వైసీపీ అదే...గోల

తిరుపతి ఏప్రిల్ 8,

2024 ఎన్నికల టైమ్ లో వైసీపీ ప్రచారంలో చాలా చిత్ర విచిత్రాలు చోటు చేసుకున్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ బొమ్మలు తయారు చేయించి, వాటిని జనంతో కొట్టించేలా, కొట్టి వారు ఆనందించేలా చేశారు. ఆ ముగ్గురి బొమ్మలతో రకరకాల ప్రచారాలు చేశారు. జనం ఇలాంటి జిమ్మిక్కులకు ఆకర్షితులయ్యారా, అసలు అలాంటి ప్రచారాన్ని నమ్మారా అనేది ఎన్నికల ఫలితాలతో తేలిపోయింది. ఫలితాలు తేడాగా వచ్చినా వైసీపీలో మార్పు రాలేదనడానికి తాజా ఉదాహరణలే నిదర్శనం.వైసీపీ మారలేదు, మారాలనుకోవట్లేదు. తాజాగా తిరుపతిలో వైసీపీ వాళ్లు ఓ వీధినాటకం వేశారు. ఆ పార్టీ యువనేత భూమన అభినయ్ రెడ్డి దీనికి కర్త, కర్మ, క్రియ. చంద్రబాబు, లోకేష్, పవన్ పాత్రలను సృష్టించి జూనియర్ ఆర్టిస్టులతో ఓ షో చేశారు. దీనికి వైసీపీ సోషల్ మీడియాలో విపరీత ప్రచారం చేశారు. ఇలాంటివాటిని జనం ఆసక్తిగా చూస్తారేమో కానీ, దీనివల్ల పార్టీకి ఏమేరకు ప్రయోజనం ఉంటుందనేది వైసీపీ నేతలు ఆలోచించుకోవాలి.కూటమి ప్రభుత్వంలో పెరిగిన విద్యుత్ ధరలపై వీధినాటక ప్రదర్శన అనే పేరుతో స్కిట్లు వేశారు. విద్యుత్ దోపిడీకి గుణపాఠం చెబుతామంటూ దాదాపు ఓ 20మంది జూనియర్ ఆర్టిస్ట్ లను తీసుకొచ్చారు. వీరిలో ముగ్గురికి చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ పాత్రలు ఇచ్చారు. మిగతా వారు సామాన్య ప్రజలుగా నటించారు. చివరిగా కూటమి ప్రభుత్వం తమ హామీలు అమలుచేయలేదని, కరెంటు చార్జీలు పెంచి ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ తీర్మానించారు. అంతే కాదు 2029లో వైసీపీదే ఘన విజయం అని ప్రకటించారు. 2029లో వైసీపీ గెలిచి, జగన్ సీఎం అయితే ఎలా ఉంటుందనే విషయాన్ని కూడా చూపించారు.గతంలో కూడా భూమన అభినయ్ రెడ్డి వీధి నాటకాలతో తిరుపతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడం లేదంటూ ఆయన కొంతమంది మహిళలను తీసుకుని ఆర్టీసీ బస్సులు ఎక్కారు. టికెట్ అడిగిన కండక్టర్ కి గతంలో చంద్రబాబు మాట్లాడిన వీడియోలను సెల్ ఫోన్లలో చూపించారు. ఈ నిరసన ప్రదర్శనకు జనం ఆకర్షితులయ్యారే కానీ, దానివల్ల వైసీపీకి కలిగిన ప్రయోజనం ఏంటనేది తేలడంలేదు. మరి జగన్ చెప్పిన సంపూర్ణ మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు హామీల గురించి అభినయ్ రెడ్డి సమాధానం చెప్పగలరా..? ఆ ప్రశ్నలకు మాత్రం బదులు లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంకా ఏడాది పూర్తి కాలేదు. అప్పుడే ఇలా వీధి నాటకాలంటూ వారిని టార్గెట్ చేయడాన్ని ప్రజలు ఏమేరకు హర్షిస్తారో చూడాలి.ఇలాంటి జిమ్మిక్కులతోనే వైసీపీ మోసపోయింది. సిద్ధం సభలకు భారీగా జనం వచ్చారని చెప్పుకున్నారు, సభలకోసం జనం వెళ్లే సమయంలో ఐప్యాక్ టీమ్ కొంతమంది ప్రజల్ని ముందుగానే సిద్ధం చేసి కొంత డ్రామా నడిపిందనే ప్రచారం కూడా ఉంది. సామాన్యుల లాగా వారు జగన్ ని కలవాలని ఆరాటపడటం, వారిని చూసి సడన్ గా జగన్ బస్సుని ఆపడం.. ఇలాంటి వాటిని ప్రజలు ఏమాత్రం నమ్మలేదు. నమ్మలేదనడానికి సాక్ష్యం ఎన్నికల ఫలితాలే. ఇప్పుడు కూడా అలాంటి జిమ్మిక్కులపైనే వైసీపీ ఆధారపడటం విశేషం.

## యువకుడి అవయవ దానం

విశాఖపట్నం

విశాఖలోని ఎంజిఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన 22 ఏళ్ల యువకుడు ఆశిష్ చువాల్సింగ్ అవయవదానం చేయడానికి అయన కుటుంబం అంగీకరించింది. ఒడిశాలో సునాబెడా గ్రామానికి చెందిన ఆశిష్ ప్రమాదవశాత్తు అస్వస్థతకు గురికావడంతో ఈనెల రెండో తేదీన విశాఖలో ఎంజిఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరాడు. వెంటిలేటర్ పై మూడు రోజులు చికిత్స పొందాడు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. బ్రెయిన్ డెడ్ ఐనట్లు వైద్యులు నిర్ధారించారు. వారి కుటుంబ సభ్యులు ఆశిష్ అవయవాలు దానం చేసేందుకు ఒప్పుకున్నారు. ఈ యువకుడు గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, చిన్న ప్రేగు మరియు క్లోమం దానం చేశారు. దీంతో విశాఖపట్నంలోని వివిధ ప్రాంతాల్లో వాటి అవసరం వున్నవారికి పంపించారు. ఆసుపత్రి యాజమాన్యం , సిబ్బంది ఘనంగా తుదివీడ్కోలు పలికి , ఆయన ధాతృత్వం పదిమందికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు.

## పరమ భక్తుడు నరసింహులు

యాదాద్రి

ఒక భక్తుడు ప్రతినెలా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి విరాళం ఇస్తున్నాడు. మునుగోడు నర్సింహులు పటాన్ చెరువు వాస్తవ్యులు. తన తండ్రి దగ్గర నుండి నేటి వరకు తాము సంపాదించిన దాంట్లో స్వామివారికి కొంత భాగం ఇవ్వాలని మా నాన్నగారు నిర్ణయం తీసుకున్నారు కాబట్టి నేను నా తర్వాత నా కొడుకు కూడా మాకు వచ్చిన దాంట్లో నుండి ప్రతినెల స్వామివారికి విరాళంగా ఇస్తామని మా కులదైవమైన లక్ష్మీనరసింహుడికి గత నెలలో 50 వేల రూపాయలు ఈ నెలలో పదివేల రూపాయలు విరాళంగా ఇచ్చామని తెలిపారు దాత మునుగోడు నరసింహులు.

## గ్యాస్ ధర తగ్గించాలని నిరసన

విశాఖపట్నం

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని విశాఖ సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. నగరంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్రం దేశ ప్రజలపై బాదుడు కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఎప్పుడు లేని విధంగా ఒకేసారి 50 గ్యాస్ ధర పెంచిందన్నారు. మరో వైపు ? పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పై 2 రూపాయలు పెంచి ప్రజలపై భారం వేసిందన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ ఛార్జీలు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మళ్లీ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వలన నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజల పై మరింత భారాలు పడనున్నాయన్నారు. వెంటనే పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని లేకపోతే ప్రభుత్వాలకు తగిన బుద్ధి ప్రజలు చెబుతారని హెచ్చరించారు.

## బెల్ట్ షాపులను అరికట్టాలి

నరసాపురం

మద్యం బెల్టు షాపులు తక్షణ అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తిగా నరసింహామూర్తి డిమాండ్ చేశారు ఈరోజు నరసాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్లుగీత కార్మికులు మోకులు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఐదు వేలకు పైగా రాష్ట్రంలో 70 వేలకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయని ఎక్సైజ్ డిపార్ట్మెంట్ చోద్యం చూస్తుందని. రాష్ట్రంలో అక్రమ మద్యం వరదల పారుతుంటే అరికట్టాల్సిన కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. తాటికల్లు అమ్మకాలు లేకుండా మా బ్రతుకులను నాశనం చేస్తున్న బెల్ట్ షాపులను వెంటనే అరికట్టాలని. కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని. వృత్తి చేస్తున్న వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులు రాత్రి పగలు అని తేడా లేకుండా రోడ్డు పక్కనే కుర్చీలు టేబుల్స్ వేసుకుని యదేచ్ఛగా అమ్ముతుంటే అరికట్టే ధైర్యం ప్రభుత్వానికి లేదా అని ముఖ్యమంత్రి ఎక్సైజ్ మంత్రి బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తామని హెచ్చరికలు ఏమయ్యాయి అని. నరసాపురం ఏరియాలో మంచినీరు లేక గ్రామాలు ఎన్నో ఉన్నాయని బెల్టు షాపులు లేని గ్రామం కానీ. మద్యం దొరకని గ్రామం కానీ ఎన్నో ఉన్నాయని అన్నారు .ఈ కార్యక్రమంలో నరసాపురం డివిజన్ కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొక్క చంటి తదితర కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రాంబాబుకు మెమె??ండం అందించారు.

## ఆరోగ్య అవగాహనపై 2 కె రన్

కాకినాడ

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్య జీవనం గడపవచ్చునని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ సూర్య గ్లోబల్, టీమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హాస్పటల్ నుండి నాగమల్లి తోట జంక్షన్ వరకు ఆరోగ్య అవగాహన పై 2 కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ మాట్లాడుతూ ప్రతి మనిషి చిన్న వయసు నుండి ప్రతిరోజూ వ్యాయామం, పోషకాలు కలిగిన సంప్రదాయ ఆహారం తీసుకోవాలని అన్నారు. సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్,హాస్పటల్ చైర్మన్ డాక్టర్ ꣳష్ట్ర.ఖ.ా.వీర్రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే పోషకాలతో కూడిన ఆహారం,వ్యాయామం దినచర్యలో భాగం కావాలని పిలుపునిచ్చారు.ఇంటి పునాది గట్టిగా ఉంటేనే ఇల్లు ఎక్కువ రోజులు దృఢంగా ఉండగలదని అదే రీతిలో ప్రతి మనిషి చిన్న వయసు నుండి అనగా పుట్టిన నాటి నుండి పౌష్టిక ఆహారం తింటూ సమయానికి రక్షణ టీకాలు వేయించుకుంటూ భవితవ్యాన్ని బలపరుచుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డా.అడ్డాల సత్యనారాయణ, డా.చప్పిడి వెంకటేశ్వరరావు,హాస్పటల్ వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు..

## ములుగు జిల్లా వడగండ్ల వాన

ములుగు

ములుగు జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. జిల్లాలోని పలుచోట్ల ఈదురుగాలులతో ములుగు జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవగా గోవిందరావుపేట, మంగపేట, ఏటూరు నాగారం మండలాల్లో తీవ్ర బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు వరి నెల వారగా మామిడి తోటలు చెట్టుకు ఒక కాయ లేకుండా రాలిపోయాయి.భీకర గాలులకుగోవిందరావుపేట మండల కేంద్రంలో రేకుల ఇండ్లు నేలమట్టమయ్యాయి. గాలి బీభత్సానికి పాలు చోట్ల చెట్లు నెలరాలయి. విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగింది. మంగపేట మండలం లో వడగళ్ల వాన కురిసింది.భీకరమైన గాలులకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు.తాడ్వాయి, పసర మద్యలో ఈదురు గాలులతో చెట్లు పడడంతో పోలీసులు జే సి బి యంత్రంతో చెట్లను తొలగించారు.ఏటూరు,కన్నాయి గూడెం ప్రధాన రహదారి పై చెట్లు విరిగి పడడంతో ఏటూర్ నాగారం పోలీస్ లు చెట్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈదురు గాలులతో పాటు వడగండ్ల వానకు జిల్లాలో పలు చోట్ల చెట్లు విరిగి విద్యుత్ స్తంభాల పై పడడంతో విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడింది.

## కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

కామారెడ్డి కల్తీ కల్లు బారిన పడిన బాధితులు కోలుకుంటున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాన్స్ వాడ ఆసుపత్రి లో 58 మంది కి, నిజామాబాద్ జిల్లా ఆసుపత్రిలో 9 మందికి చికిత్స అందిస్తున్నారు.

# తమిళనాడే లక్ష్యంగా కమల దళం

చెన్నై, ఏప్రిల్ 8

దక్షిణాదిలో పాగా వేసేందుకు స్కెచ్ వేస్తోంది బీజేపీ. అందులో భాగంగానే తమిళనాడులో గత కొన్నిరోజులుగా పొలిటికల్ డ్రామాకు తెరతీస్తోంది. తమిళనాడులో పాతమిత్రుడితో కలిసి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది బీజేపీ.తమిళనాడులో ఏడాదిలోపే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారంలో ఉన్న డీఎంకే కాంగ్రెస్ సహా మిత్ర పక్షాలు కలిసి ఈసారి కూడా కూటమిగా బరిలోకి వెళ్ళాలని భావిస్తోంది. ఇక నటుడు విజయ్ సొంత పార్టీని ఏర్పాటు చేసి తాను ఒంటరిగా పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ముందుగా ఏఐడీఎంకేతో కలిసి పోటీ చేసి అధికార భాగస్వామ్యంతో డిప్యూటీ సీఎంగా ఉండేలా ఒప్పందం కుదిరినట్లు వార్తలు వచ్చాయి.. ఏపీలో టీడీపీ-జనసేన ఫార్ములా లోనే విజయ్ కూడా రాజకీయాల్లో తన ప్రయత్నాలను మొదలు పెడతారని జోరుగా చర్చ జరిగింది. అధికార ఆఓఐను గద్దెదించేందుకు పక్కా ప్రణాళికతో వెళ్తోంది.తమిళనాడులో రాజకీయం రసవత్తరంగా మారింది.. అధికార డిఎంకె ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి.. అందుకు గట్టి ఓటు బ్యాంకు కలిగిన పార్టీలతో కలిసి వెళ్తేనే అది సాధ్యమని విశ్లేషకులు చెబుతుంటే.. విపక్షాల వ్యూహాలను డిఎంకె మాత్రం ఏ మాత్రం లెక్క చేయడంలేదు. బీజేపీ ఈసారి దక్షిణాన కొట్టి తీరాలన్న కసితో చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. అలా బీజేపీ వేస్తున్న ఎత్తులకు డీఎంకే ఎత్తుకు పైఎత్తు వేస్తూ.. జనంలో సెంటిమెంట్‌ను రెచ్చగొడుతూ ప్రతిపక్షాలకు ఎక్కడా అందడం లేదు.తమిళనాడులో పాగా వేయాలన్న ప్రయత్నాల్లో ఉన్న భారతీయ జనతా పార్టీ వ్యూహంతో ముందుకు వెళుతోంది. అయితే ఎక్కడో తేడాగా ఉందన్న చర్చ జరుగుతోంది. పొత్తు కోసం ఏఐడీఎంకే నుంచి దూరమైన అందరినీ కలిపేలా బీజేపీ ప్లాన్ చేస్తోందని తెలుస్తోంది. పొత్తులను సెట్ చేయడం.. మాజీ ముఖ్యమంత్రులు ఓ పన్నీర్ సెల్వం, పళనిస్వామి, శశికళను కలిపి బీజేపీ చేస్తున్న కూటమి ప్రయత్నాలకు ఏఐడీఎంకే షరతులు పెడుతోంది. అలా పెట్టె షరతుల్లో కొన్ని విషయాల్లో తగ్గుతున్నా మరి కొన్ని అంశాల్లో బీజేపీ ఏమాత్రం తగ్గడం లేదు.తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షమైన ఏడీఎంకే సహా మరి కొన్ని పార్టీలను కలిపి కూటమిగా ఏర్పాటు చేసి అధికారంలోకి రావాలని బీజేపీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఐదేళ్ల వరకు రాష్ట్రంలో డీఎంకేతో సమానంగా బలమైన పార్టీగా ఉన్న ఏఐడీఎంకేలో చీలికతో కాస్త బలహీన పడింది. గతంలో జయలలిత జైలుకెళ్లిన సందర్భంలో నమ్మినబంటుగా ఉన్న ఓ పన్నీరు సెల్వం పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే జయలలిత నచ్చలి శశికళ కూడా పార్టీకి దూరమైంది. మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి పార్టీని లీడ్ చేస్తున్నారు. మునుపటిల పార్టీకి బాగుండాలంటే ఈ ముగ్గురు కలవాల్సిన అవసరం ఉందని భావించిన బీజేపీ అందర్నీ కలిపే ప్రయత్నం మొదలుపెట్టింది.ఇటీవల పొత్తుల విషయంపై చర్చించేందుకు ఏఐడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి పలని స్వామి ఢిల్లీ వెళ్లి అమిత్ షా సహా పలువురు ముఖ్యనేతలను కలిశారు. అయితే ఆ సమయంలో బీజేపీకి ఏఐడీఎంకే తరపున పళని స్వామి కొన్ని షరతలు పెట్టినట్టు తెలుస్తోంది. అందులో ముఖ్యమైనది తమిళనాడు బీజేపీ చీఫ్ గా ఉన్న అన్నమలైను ఆ బాధ్యతల నుంచి పక్కన పెట్టాలని విధించినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇటీవల అన్నమలై పార్టీ చీఫ్ పదవికి రాజీనామా చేశారు. అలాగే ఏఐడీఎంకే పార్టీలోకి పన్నీరు సెల్వం మళ్లీ తీసుకొచ్చే ప్రతిపాదనను కూడా ఆయన విభేదించినట్లు తెలుస్తోంది. తమిళనాడులో జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో పొత్తుల విషయమై మాట్లాడేందుకు మాజీ ముఖ్యమంత్రులు ఈపీఎస్-ఓపిఎస్ ఇద్దరికీ వేరువేరుగా మోదీ అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయింది. ఓపిఎస్‌కూ కూడా అపాయింట్‌మెంట్ దక్కడం పట్ల ఈపిఎస్ కినుక వహించినట్టు తెలుస్తోంది. అందుకే ప్రధానిని కలిసి ఆలోచనను విరమించుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత కొద్దిసేపటికి ప్రధాని షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు ప్రకటన వచ్చింది. ఎలాంటి రాజకీయ సమావేశాలు భేటీలు లేవని ఓపిఎస్ అపాయింట్‌మెంట్ కూడా రద్దు చేసినట్టు తెలుస్తోంది.ఇటీవల తమిళనాడు చీఫ్ పదవికి రాజీనామా చేసిన అన్నమలై కూడా ఒకంత అసంతృప్తితో ఉన్నారు. మీడియాతో మాట్లాడిన సందర్భంలో అధ్యక్ష పదవి అనేది నాకు ఉల్లిపాయతో సమానం అంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఓపిఎస్- టిటివి దినకర్, శశికళ పళని స్వామి అందరిని కలపాలని బీజేపీ ప్రయత్నాలకు ఈపీఎస్ సుముఖంగా లేరన్నది తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. వీటన్నింటిపై బ్యాక్ గ్రౌండ్‌లో అన్ని వర్క్‌వుట్ చేసుకున్నాక పొత్తులపై ముందుకు వెళ్లాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే మోదీ పర్యటనలు షెడ్యూల్ మార్పులు చేసి పొలిటికల్ మీటింగ్స్ అన్ని రద్దు చేసినట్లు తెలుస్తోంది. వచ్చే రెండు మూడు రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడు నియామకం అయ్యాక అన్ని పరిస్థితులను చక్కదిద్దిన తర్వాత పొత్తుల విషయంలో క్లారిటీ ఇవ్వాలని భావిస్తోంది భారతీయ జనతా పార్టీ.

## విద్యుత్ షాక్ తో మృతి చెందిన రైతు నంబూరి ప్రసాద్ అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

### శోక సంద్రంలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఎమ్మెల్యే , మాజీ మంత్రి.

పుట్టపర్తి :08

విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన రైతు నంబూరి ప్రసాద్ అంత్యక్రియలకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. పుట్టపర్తి మండలం రాజువారి పల్లి గ్రామానికి చెందిన రైతు నంబూరి ప్రసాద్ పొలానికి నీరు



పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందారు ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి మంగళవారం ఆ గ్రామానికి విచ్చేసి ప్రసాద్ అంత్యక్రియలకు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ వీరాభిమాని అయిన మృతి తో తీవ్రంగా చలించిపోయిన ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు ఆ కుటుంబాన్ని పరామర్శించారు .మృతుడు ప్రసాద్ భౌతికాయానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. చిన్న వయసులోనే ప్రసాద్ మృతి అత్యంత బాధాకరమని ,ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రసాద్ కుటుంబానికి అన్ని విధాలుగా తెలుగుదేశం పార్టీ తో పాటు పల్లె కుటుంబం ఎల్లప్పుడు అండగా ఉంటుందని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రసాద్ అంత్యక్రియలకు వందల మంది తరలివచ్చారు. అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు ఈ విషాద వార్తతో దుఃఖసాగరంలో మునిగిపోయారు.మృతుడు ప్రసాద్ తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు అందించారని తెలిపారు . గ్రామంలో చిన్న వయసులోనే అత్యంత మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని ,అయన లేని లోటు తీర్చలేనిదన్నారు. దుఃఖ సాగరంలో ఉన్న ఆ కుటుంబానికి దేవుడు మనో ధైర్యాన్ని ఇవ్వాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరుకున్నారు. ఈ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే మాజీ మంత్రి వెంట పుట్టపర్తి మండల టిడిపి కన్వీనర్ విజయ్ కుమార్ మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య ,స్థానిక సర్పంచ్ టిడిపి నాయకులు సుభాష్ జగదీష్ ,,టీడీపీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోకాపేట్ లో అక్రమ కట్టడాల కూల్చివేతలు

రంగారెడ్డి కోకాపేటలో అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేసారు. కోకాపేట సర్వే నెంబర్ 100 లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరిగాయి. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసారు. కబ్జా చేసిన స్థలంలో వ్యాపార సముదాయాల నిర్మాణం జరిగింది. దాంతో గండిపేట రెవెన్యూ అధికారులు మంగళవారం తెల్లవారుజామునే రంగంలోకి దిగి కూల్చివేతలు ప్రారంభించారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగాయి.

## బీఆర్ఎస్ సభకు అడ్డంకులు పెడుతున్న ప్రభుత్వం

శంషాబాద్‌వరంగల్ వేదికగా ఈనెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను తలుచుకుని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వణుకు మొదలైందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. వరంగల్ సభను అడ్డుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటినుండే అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించిన ఆమె.... ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా సరే 10 లక్షల మందితో వరంగల్ సభను నిర్వహిస్తామని ప్రకటించారు. మరోవైపు రంగారెడ్డి జిల్లా నుండి లక్షన్నర మంది గులాబీ సైనికులను వరంగల్ సభకు తరలిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రకటించారు.ఏప్రిల్ 27న వరంగల్ లో తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో హైదరాబాద్ శివారులోని శంషాబాద్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సబితా ఇంద్రారెడ్డి.... ఏడాది కాంగ్రెస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని, కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. వరంగల్ వేదికగా తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా గులాబీ సైనికులు తరలిరానున్నారని, దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వెన్నులో వణుకు మొదలైందని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన సరే వరంగల్ సభ ను జయప్రదం చేస్తామని ప్రకటించారు.

# నిర్లక్ష్యం అతివేగంగా డ్రైవింగ్ చేసిన లారీ డ్రైవర్ ఘటనలో హోం గార్డ్ మృతి

## మియాపూర్ పరిధిలో సంఘటన

హైదరాబాద్

రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసే వారికోసం స్పెషల్ డ్రైవ్ చేస్తున్న పోలీసులపైకి లారీ దూసుకొచ్చింది. విధినిర్వహణలో ఉన్న పోలీసులపై డ్రైవర్ లారీరని ఎక్కించాడు. ఈ సంఘటనలో ఇద్దరు పోలీసులకు హోం గార్డుకి గాయాలు అయ్యాయి. మియాపూర్ లో ఘటన జరిగింది. క్షతగాత్రులను ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ హోంగార్డు మృతి చెందాడు. ఇద్దరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మే 6 నుంచి ఆర్టీసీ సమ్మె సైరన్

హైదరాబాద్, ఏప్రిల్ 8,

తెలంగాణ ఆర్టీసీ సమ్మె సైరన్ మోగనుంది. మే 6వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మె చేయాలని ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్, లేబర్ కమిషనర్ కు ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. మే 7వ తేదీ మొదటి డ్యూటీ నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు నోటీసుల్లో తెలిపారు. కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు.సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ సంఘాలు ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేశాయి. 2023 జనవరి 27న తొలిసారి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసులు ఇచ్చింది. యాజమాన్యం, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మరోసారి సమ్మె నోటీసులు ఇచ్చాయి కార్మిక సంఘాలు. జేఏసీగా ఏర్పడిన కార్మిక సంఘాలన్నీ 21 డిమాండ్లతో సమ్మె నోటీసులు ఇచ్చాయి.మరో నెల రోజుల్లో తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్ల పరిష్కారంపై గత రెండు మూడు నెలలుగా కార్మిక సంఘాలు కోరుతున్నా.. ఆర్టీసీ యాజమాన్యం నుంచి కానీ ప్రభుత్వం నుంచి కానీ సానుకూల స్పందన రాకపోవడంతో వచ్చే నెల 6వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెలో పాల్గొనాలని జేఏసీ తీర్మానం చేసింది. ఈ క్రమంలోనే ఆర్టీసీ ఎండీకి సమ్మె నోటీసులు ఇచ్చారు.21 డిమాండ్లలో ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ప్రక్రియ ప్రారంభించలేదు. టీజీఎస్ఆర్టీసీలో దాదాపు 16 వేల మంది కార్మికులు రిటైర్ అయినప్పటికీ కొత్త నియామకాలు చేపట్టలేదని జేఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీంతో పని భారమంతా ప్రస్తుతం ఉన్న కార్మికులపైనే పడుతున్నదని ఈయూ, టీఎంయూ నాయకులు తెలిపారు. దీంతో రోజుకు 14 నుంచి 16 గంటలపాటు పనిచేయాల్సి వస్తుందన్నారు. అధిక పనిభారాన్ని తట్టుకోలేక కార్మికులు ఒత్తిడికి లోనవుతున్నారని చెప్పారు. 2017 వేతన సవరణకు సంబంధించిన అలవెన్సులను ఇప్పటి వరకు పెంచలేదని, వాటిని ఉద్యోగ విరమణ సమయంలో చెల్లిస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు.మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులకు నెల నెల జీతాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.వేతన సవరణ జరిగినా అరియర్స్ ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బకాయిలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆర్టీసీ కార్మికులపై పని భారం పెరిగిపోయిందన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

# జనసేన నాయకుడు ఉమ పై దాడి చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకుంటాం..

## ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్ దాడిలో గాయపడిన తోలేటి ఉమాను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. జనసేన నాయకుడు ఉమ పై దాడి చేసిన మండల అధ్యక్షుడుపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం. ఎవరు తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాంమని అన్నారు. జనసేన నాయకుడిపై దాడి చేసిన మండల అధ్యక్షుడు పై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యేలును అయినవిల్లి మండల జనసేన నాయకులు నిలదీసారు. పార్టీ నాయకుడిపై దాడి చేసిన మండల అధ్యక్షుడిని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలంటూ ఎమ్మెల్యేను నిలదీసారు.పోలిశెట్టి రాజేష్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే అయిన వెల్లిన జనసేన నేతలంతా పార్టీని వీడేందుకు సిద్ధం అంటున్నారు.

## సంగంబండ రిజర్వాయర్ లో మొసలి హల్ చల్

నారాయణపేటనారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లో ఓ మొసలి కలకలం రేపింది. మంగళవారం మొసలి డ్యాం నుండి బయటికి రావడంతో ఆందోళనకు గురైన గ్రామస్తులు మొసలిని బంధించ ఆరు.

# మళ్లా ఆగిన కేబినెట్ విస్తరణ...

హైదరాబాద్, ఏప్రిల్ 8



రేపోమాపో తెలంగాణ కేబినెట్ విస్తరణ విస్తరణ జరగబోతోందన్న ప్రచారం ఊపందుకున్న వేళ? అదంతా ఉత్తిదేనన్న కొత్త ప్రచారం తెరమీదకొచ్చింది.నిజానికి పదిరోజుల ముందే.. మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం ఫైనల్ అయిపోయిందనే ముచ్చట రాజకీయవర్గాల్లో బలంగా వినిపించింది. రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యులతో సమావేశమైన రాహుల్గాంధీ అందరి అభిప్రాయాలు తీసుకున్నారనీ, ఎప్రిల్ 3న మంత్రి వర్గ విస్తరణ ఉంటుందనీ.. హస్తం నేతలే లీకులిచ్చారు. కానీ, ఆ తేదీ దాటిపోయినా? కేబినెట్ విస్తరణపై హైకమాండ్ నుంచి ఎలాంటి నిర్ణయమూ రాలేదు.. ప్రస్తుతం తెలంగాణ మంత్రిమండలిలో మరో ఆరుగురికి అవకాశం ఉంది. కానీ, ఆశావహుల సంఖ్య మాత్రం అరవై ఆరుకు మించి ఉండొచ్చు. పార్టీ పెద్దలు ఎంత ప్రయత్నించినా? జిల్లా ,సామాజిక సమీకరణలు ఎంత బేరీజు వేసుకున్నా? అంతమందిని ఈ ఆరుపదవుల్లో సర్దేయడం అంత వీజీ కాదు. అందుకే, విస్తరణ విషయంలో కాంగ్రెస్ పెద్దలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా కేబినెట్లో స్థానం కోసం కోసం రెడ్డి సామాజిక వర్గం నుంచి ఎక్కువగా పోటీ ఉంది. పరిస్థితి చూస్తుంటే.. ఆరు పదవుల్లో ఒకటి మాత్రమే రెడ్డి నేతకు ఇచ్చే అవకాశం ఉందట. దీంతో, ఎటూ తేల్చుకోలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ హైకమాండ్ ఉందట. నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి, నిజామాబాద్ నుంచి సుదర్శన్రెడ్డి, హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల నుంచి మల్రెడ్డి రంగారెడ్డిలు.. బలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో వీరిలో ఎవరికి ఇచ్చినా మిగితావారి అసంతృప్తిని కంట్రోల్ చేయడం కష్టసాధ్యమైన విషయం. అందుకే విస్తరణవైపు జాగ్రత్తగా అడుగులు వేస్తోంది కాంగ్రెస్ హైకమాండ్.కేబినెట్లో సామాజిక సమతుల్యత అనే అంశం.. ఇప్పుడు కీలకంగా మారింది. బీసీ,ఎస్సీ, ఎస్టీ సాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు? ఎవరికివారుగా హైకమాండ్కు లేఖలు రాస్తుండటం? మంత్రివర్గ విస్తరణను మరింత సంక్లిష్టంగా మారుస్తోంది. వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్లపేర్లు బీసీ సామాజిక వర్గంనుంచి పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతుండగా.. మాదిగ, లంబాడా ఎమ్మెల్యేలు తమకు కూడా అవకాశం ఇవ్వాలంటూ.. మూకుమ్మడిగా కాంగ్రెస్ హైకమాండ్కు లేఖలు రాశారు. ప్రాంతాలవారీగా విడిపోయిన నేతలు? తమకు అవకాశం ఇవ్వాలంటూ ఢిల్లీవెళ్లి మరీ విజ్ఞాపనలు అందజేస్తున్నారు. ఇప్పటివరకూ హైదరాబాద్, రంగారెడ్డి నేతలకు కేబినెట్లో చోటు ఇవ్వలేదనీ.. ఈదఫా అవకాశం కల్పించాలనీ? ఖర్గేను కలిసి మరీ విజ్ఞప్తి చేశారు ఆ ప్రాంత ఎమ్మెల్యేలు. ఓవైపు లేఖలు.. మరోవైపు విజ్ఞప్తులు? ఇంకోవైపు సామాజిక లెక్కలు.. అంతకంతకూ పెరిగిపోతున్న ఆశావహులు? వెరసి కాంగ్రెస్ హైకమాండ్కు ఏం చేయాలో పాలుపోవడం లేదన్న ముచ్చట వినిపిస్తోంది. అందుకే, కేబినెట్ విస్తరణను మరోసారి వాయిదా వేసినట్టు ప్రచారం జరుగుతోంది.మంత్రివర్గ విస్తరణపై జరుగుతున్న హడావుడి అంతా ఒకెత్తయితే.. సీనియర్ నేత జానారెడ్డి హైకమాండ్కు రాసిన లేఖ మరో ఎత్తు అన్నట్టుగా మారింది. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాకు ఛాన్సివ్వాలని ఖర్గేకు, కేసీ వేణుగోపాల్కు రాసిన లేఖలో విజ్ఞప్తి చేసిన ఈ సీనియర్ నేత.. నల్గొండ జిల్లాకు మూడో మంత్రి పదవి విషయంలో ఏవిధంగానూ స్పందించకపోవడం ఆసక్తిరేపుతోంది. దీంతో, ఆ జిల్లానుంచి భారీ స్థాయిలో ఉన్న ఆశావహుల్లో ఆందోళన మొదలైందట. ఇప్పటికే ఆ జిల్లా నుంచి రాజగోపాల్రెడ్డి, అద్దంకి దయాకర్, పద్మావతి, శంకర్ నాయక్, బాలూనాయక్.. ఈ రేసులో ఉన్నారు. విస్తరణలో ఒక రెడ్డినేతకు అవకాశం ఇస్తామంటూ ఇటీవల రాష్ట్రనేతలకు చెప్పిన హైకమాండ్ పెద్దలు.. ఎవరికివ్వాలో తేల్చిచెప్పాలని అడిగారట. రాజగోపాల్రెడ్డికి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేయగా? కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మళ్లీ మాట్లాడుదామంటూ.. మీటింగ్ను ముగించారంట పెద్దలు ఉమ్మడి వరంగల్ నుంచి దొంతి మాధవ రెడ్డి , ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్నున్నారు. సుదర్శన్ రెడ్డి కోసం సీఎం రేవంత్రెడ్డి పట్టుబడుతుండగా , దొంతి మాధవరెడ్డి కోసం ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారట. ఇలా ఎవరికివారు చేస్తున్న ప్రయత్నాలతో? హైకమాండ్ కన్ఫ్యూజన్లో పడిపోయినట్టు తెలుస్తోంది. వేసుకున్న లెక్కలేవీ వర్కవుట్ కాకపోవడంతో.. ఎప్పటికప్పుడు నేడే విడుదల అనడం తప్ప? కేబినెట్ విస్తరణ మాత్రం కార్యరూపం దాల్చేలా కనిపించడం లేదు. మరి ఈ ఎపిసోడ్ను ఏఐసీసీ పెద్దలు ఎన్నాళ్లు సాగదీస్తారన్నదే ఇప్పుడు? పొలిటికల్ సస్పెన్స్గా మారింది.

# పెద్ది...పై భారీ ఆశలు

హైదరాబాద్, ఏప్రిల్ 8,

సినిమా ఇండస్ట్రీలోకి వారసులుగా వచ్చి రాణించడం అనేది చాలా పెద్ద టాస్క్ అనే చెప్పాలి. ఎందుకంటే అంతకు ముందు ఉన్న స్టార్ డమ్ ని మోస్తూ ఇప్పుడున్న ప్రేక్షకులకు నచ్చే విధంగా సినిమాలను చేయడం అనేది చాలా పెద్ద బాధ్యత?దానిని సక్సెస్ ఫుల్ గా కొనసాగిస్తే పర్లేదు. కానీ ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కూడా వాళ్ల కెరియర్ తో పాటు చాలా సంవత్సరాల నుంచి వస్తున్న ఆ ఫ్యామిలీ పేరు కూడా చెడిపోతుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు?సినిమా ఇండస్ట్రీలో ప్రతి హీరోకి ఒక స్టైల్ అయితే ఉంటుంది. ఇక దాంతోనే ప్రేక్షకులను అలరిస్తూ ఆకట్టుకుంటూ వాళ్ళను తమ అభిమానులుగా మార్చుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నం చేస్తూ ఉంటారు. నిజానికి సినిమా సక్సెస్ అయ్యింది అంటే అందులో హీరో గొప్పతనం ఎంతగా ఉంటుందో దర్శకుడు యొక్క గొప్పతనం కూడా అంతే ఉంటుంది? ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి సోలోగా ఇండస్ట్రీకి వచ్చి తన డాన్స్ తో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకొని ఇండియన్ సినిమా ఇండస్ట్రీలోనే మెగాస్టార్ గా తనకంటూ ఒక గొప్ప గుర్తింపు సంపాదించుకున్నాడు? ఇక చిరంజీవి నట వారసుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రామ్ చరణ్ సైతం తనదైన రీతిలో సత్తా చాటుకోవడానికి అహర్నిశలు ప్రయత్నం చేస్తూ ముందుకు సాగుతున్నాడు. ఇప్పటివరకు ఆయన సాధించిన విజయాలు ఒకెత్తయితే ఇకమీదట సాధించబోయే విజయాలు మరొక ఎత్తుగా మారబోతున్నాయి. ఆయన ఎంటైర్ కెరీయర్ లో ఇప్పటివరకు రెండు భారీ బ్లాక్ బస్టర్ ఇండస్ట్రీ హిట్లను సాధించాడు. చాలా తక్కువ కెరియర్ లోనే రెండు ఇండస్ట్రీ హిట్స్ అందుకోవడం అంటే మామూలు విషయం కాదు. ఆయన ఇండస్ట్రీకి వచ్చి కేవలం 17 సంవత్సరాలు మాత్రమే అవుతుంది. అంతలోనే రెండు ఇండస్ట్రీ హిట్స్ సాధించాడు అంటే మామూలు విషయం అయితే కాదు.రెండోవ సినిమాతోనే ఇండస్ట్రీ హిట్ సాధించిన ఘనత కూడా తనకే దక్కుతుంది. మరి ఇప్పుడు ఆయన బుచ్చిబాబు డైరెక్షన్ లో చేస్తున్న 'పెద్ది' సినిమా మీద ప్రేక్షకుల అంచనాలు తారా స్థాయికి చేరిపోయాయి. రీసెంట్ గా వచ్చిన గ్లింప్స్ తో రామ్ చరణ్ తన మార్కును చూపిస్తూ మరోసారి యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసే విధంగా ఒక మాస్ అవతారంలో కనిపించబోతున్నాడనే విషయం అయితే చాలా స్పష్టంగా తెలుస్తోంది.ఎప్పుడైతే ఈ గ్లింప్స్ వచ్చిందో అప్పటి నుంచి ఇండస్ట్రీ మొత్తం ఈ సినిమా గురించి చర్చించుకుంటున్నారు. మరి ఏది ఏమైనా కూడా ఈ సినిమాకి రామ్ చరణ్ పెట్టిన ఎఫర్ట్స్ కూడా చాలా బాగా ప్లస్ అవ్వబోతున్నాయనేది కూడా అర్థమవుతుంది. రామ్ చరణ్ లాంటి నటుడు తన పరిపూర్ణమైన నటనను చూపించాలంటే అతనికి అంతే డెప్త్ తో ఉన్న క్యారెక్టర్ అయితే పడాలి. ఇక 'రంగస్థలం' సినిమాలో అలాంటి క్యారెక్టర్ పడింది కాబట్టే అతనిలోని నటన ఎలివేట్ అయిందిఇక దాంతో పాటుగా త్రిబుల్ ఆర్ సినిమాలో కూడా సీతారామరాజు పాత్రని పోషించి తనకంటూ ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకున్నాడు. మరి ఆ రెండు సినిమాల తర్వాత ఈ సినిమాలో కూడా తననట విశ్వరూపాన్ని చూపించబోతున్నాడు అనేది చాలా స్పష్టంగా తెలుస్తోంది? ఇదంతా చూసిన సినిమా మేధావులు సైతం 'పెద్ది' రామ్ చరణ్ కి పర్ఫెక్ట్ మూవీ అవ్వబోతుంది అంటూ వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు

# భారత్ గా భారంగా ఓబేసిటీ

ముంబై, ఏప్రిల్ 8,

ఊబకాయం ప్రస్తుతం అతిపెద్ద సమస్యగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయుల సంఖ్య పెరుగుతోంది. దీంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అయితే ఇందుకు వైద్యులు అనేక కారణాలు చెబుతున్నారు. భారత దేశంలో 2050 నాటికి భారతదేశంలో అధిక బరువుగల వారి సంఖ్య ఏకంగా 45 కోట్లకు చేరే అవకాశం ఉంది. ఈ సమస్య 15?24 ఏళ్ల యువతలోనూ, 5?14 ఏళ్ల పిల్లల్లోనూ వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం చైనా, అమెరికా తర్వాత భారత్ ఊబకాయ సమస్యలో మూడో స్థానంలో ఉంది. 2021 గణాంకాల ప్రకారం దేశంలో 17.6 కోట్ల మంది అధిక బరువుతో ఉన్నారు. రాబోయే కొన్నేళ్లలో అమెరికాను అధిగమించి, ప్రపంచంలో ఊబకాయుల సంఖ్యలో భారత్ రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని లాన్సెట్ జర్నల్ తెలిపింది.తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సమస్య వేగంగా విస్తరిస్తోంది. హైదరాబాద్ లోని ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువ మంది స్థూలకాయంతో బాధపడుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితి మన దగ్గర ప్రమాద సంకేతాలు మోగిస్తోందని అర్థం చేసుకోవాలి. జీవన శైలి, వ్యాయామం లేకపోవడం, వేళాపాల లేకుండా తినడం వంటి కారణాలు ఊబకాయానికి కారణం అంటున్నారు.

ఆహారంలో జాగ్రత్తలు ? మైండ్ఫుల్ ఈటింగ్ కీలకం

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఊబకాయానికి ప్రధాన పరిష్కారం 'మైండ్ఫుల్ ఈటింగ్'. దీని కోసం కొన్ని సూత్రాలు పాటించాలి. ఆకలి వేసినప్పుడు మాత్రమే తినాలి. సమయం అయిందని అనవసరంగా ఆహారం తీసుకోవడం బరువు పెరగడానికి దారితీస్తుంది. ఒంటరితనం, బాధ లేదా కాలక్షేపం కోసం అతిగా తినడం మానాలి. భోజన సమయంలో టీవీ, మొబైల్ వంటి పరధ్యానాలు లేకుండా, ఏం తింటున్నామో, ఎంత తింటున్నామో శ్రద్ధగా గమనించాలి. ఆహారం రుచిని ఆస్వాదిస్తూ నెమ్మదిగా తినాలి. క్యాలరీలపై అవగాహన ఉంచాలి. ఒక పూట ఎక్కువ తీసుకుంటే, తర్వాతి పూట తగ్గించాలి. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలి, తగిన నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటివి ఊబకాయాన్ని అరికట్టడంలో సహాయపడతాయి.

యువత, పిల్లల్లో ఊబకాయం..

'వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్' ప్రకారం, ప్రాసెస్డ్ మరియు ప్యాక్ చేసిన ఆహారాలు యువత, పిల్లల్లో ఊబకాయానికి ప్రధాన కారణం. అదనంగా, మొబైల్ ఫోన్లు, టీవీలకు అతిగా అలవాటు పడడం, ఆటస్థలాల్లో శారీరక ఆటలు తగ్గిపోవడం కూడా ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి.

ఊబకాయం అంటే ఏమిటి?

శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోతే దాన్ని ఊబకాయం అంటారు. దీన్ని బాడీ మాస్ ఇండెక్స్ (ఆఓఐ) ద్వారా కొలుస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం..

18.5 కన్నా తక్కువ: తక్కువ బరువు

18.5?24.9: సాధారణ బరువు

25?29.9: అధిక బరువు

30 కన్నా ఎక్కువ: ఊబకాయం

ఊబకాయానికి కారణాలు

జన్యుపరమైన అంశాలు

అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు

శారీరక శ్రమ లేకపోవడం

వాతావరణ కారణాలు

కొన్ని ఔషధాల వాడకం

ఊబకాయం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు

అధిక బరువు ఉన్నవారికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది:

టైప్?2 మధుమేహం

అధిక రక్తపోటు

గుండె జబ్బులు

ఫ్యాటీ లివర్

మానసిక ఆరోగ్య సమస్యలు

మహిళల్లో గర్భధారణ సమస్యలు

# రజతోత్సవ సభకు అడగడుగునా అడ్డంకులు

వరంగల్, ఏప్రిల్ 8,

గులాబీ పార్టీ పెట్టి 25 ఏళ్లు అయింది. పార్టీ రజతోత్సవ సభను లక్షలాది మందితో నభూతో నభవిష్యత్ అన్న రీతిలో గ్రాండ్గా నిర్వహించాలనుకుంది బీఆర్ఎస్ అధిష్టానం.. ఐతే వరంగల్ గడ్డపై ప్లాన్ చేసిన భారీ బహిరంగసభపై నీలినీడలు కమ్ముకున్నాయి..

ప్రభుత్వం వరంగల్లో తాజాగా తీసుకొచ్చిన పోలీస్ యాక్ట్ గులాబీ ఉత్సాహంపై నీళ్లు చల్లిందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి..24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెడుతోన్న బీఆర్ఎస్ రజతోత్సవాలకు బిగ్ ప్లాన్ చేసుకుంది.. ఏప్రిల్ 27న వరంగల్ గడ్డపై భారీ భహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు పార్టీ అధినేత కేసీఆర్.హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో 10 లక్షల మందితో రజతోత్సవ మహాసభ నిర్వహించేలా ఏర్పాట్లు మొదలుపెట్టింది ఆ పార్టీ.. మొన్నటి సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ నిర్వహిస్తున్న మొట్ట మొదటి భారీ బహిరంగ సభ కావడంతో దీనిని విజయవంతం చేసేందుకు గులాబీ శ్రేణులు రెడీ అవుతున్నాయి. భారీ బహిరంగ సభ నిర్వహణకు పార్టీ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్ పోలీస్ కమిషనరేట్లో లిఖితపూర్వకంగా అనుమతి కోరారు.. ఇంతలోనే బీఆర్ఎస్ పార్టీకి వరంగల్ పోలీసులు షాక్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది.ఃఖీూ రజతోత్సవ బహిరంగ సభ జరగనున్న వరంగల్ పోలీస్ కమిషరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్-30 అమల్లోకి తెచ్చారు పోలీసు అధికారులు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నెల రోజులపాటు ర్యాలీలు, సభలు, ఊరేగింపులను నిషేధిస్తున్నట్టు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు ఇచ్చారు.ఈ ఉత్తర్వులు ఈ నెల 6 నుంచి మే 5వరకు నెల రోజుల పాటు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. దీంతో బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహణకు ఆటంకం ఏర్పడింది.. అటు సభ ఏర్పాట్లు, ఇటు జన సమీకరణపై దృష్టిసారించిన గులాబీ లీడర్లు పోలీస్ యాక్ట్తో అయోమయంలో పడ్డారంట.. రజతోత్సవ సభకు సమయం తక్కువగా ఉండడంతో వాట్ నెక్స్ట్ అనే విషయమై గులాబీ బాస్ కేసీఆర్ పార్టీ శ్రేణులతో సమాలోచనలు చేస్తున్నారంట.తమ పార్టీ సిల్వర్ జూబ్లీని అడ్డుకోవాలనే దురుద్దేశ్యంతోనే పోలీస్ యాక్ట్ తీసుకొచ్చారని గుస్సా అవుతున్న బీఆర్ఎస్ న్యాయపోరాటానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.. బహిరంగ సభకు అనుమతి కోరుతూ 10 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నామని, కానీ సభను అడ్డుకోవాలన్న కుట్రతోనే పోలీస్ యాక్ట్ తీసుకొచ్చారని అంటున్న బీఆర్ఎస్ ఇదే విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లనుందని సమాచారం..వరంగల్ బహిరంగ సభకు కోర్టు నుంచి కూడా సానుకూలత రాకపోతే వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి బయట సభ నిర్వహణపై అన్వేషణ మొదలుపెట్టిందట బీఆర్ఎస్.. అంతేకాదు కరీంనగర్లో సిల్వర్ జూబ్లీ సభ నిర్వహిస్తే ఎలా ఉంటుందన్న కోణంలో సమాలోచనలు చేస్తున్నారట గులాబీ బాస్ కేసీఆర్.అంతే కాకుండా హైదరాబాద్ శివారు ప్రాంతమైన ఘట్ కేసర్లో సభ నిర్వహించే అంశాన్ని సైతం పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఏప్రిల్ 27కు మరో 20 రోజుల సమయం మాత్రమే ఉండటంతో త్వరితగతిన కోర్టును ఆశ్రయించి ఓ నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారట. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డుంకులు సృష్టించినా పార్టీ సిల్వర్ జూబ్లీ సభను భారీ సక్సెస్ చేసి చూపించాలనే పట్టుదలతో ఉన్నారట బీఆర్ఎస్ నేతలు

# బీజేపీ బాస్ గా డీకే అరుణ..?

హైదరాబాద్, ఏప్రిల్ 8,

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష రేసులో ఇప్పటి వరకు చాలా పేర్లు వినిపించాయి. అందులో ప్రధానంగా ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్, రాం చరందర్ రావు, మురళీధర్ రావు, రఘునంధన్ రావు పేర్లు ఉన్నాయి. కొంతకాలంగా మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పేరు కూడా వినిపిస్తుంది. అయితే బీజేపీ జాతీయ నాయకత్వం డీకే అరుణ పేరును చాలా సీరియస్ గా పరిశీలిస్తుందంట.దేశాన్ని యూనిట్ గా తీసుకుంటే వాటిలో కొన్ని రాష్ట్రాలకు మహిళా అధ్యక్షురాళ్లను సైతం పెట్టాలన్నది బీజేపీ జాతీయ నాయకత్వం ఆలోచనలో ఉందట. దానికి రాష్ట్రంలో ఉన్న ఈక్వేషన్స్ కూడా తోడు కావడంతో డీకే అరుణ రాష్ట్ర అధ్యక్ష రేసులో ముందున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న నేతలతో పాటు పార్టీ శ్రేణులు కూడా వివిధ గ్రూపులుగా విడిపోయారంట. తమకే అధ్యక్ష పదవి ఇవ్వాలని నాయకులు అంటుండగా.. తమ నాయకుడు అయితేనే పార్టీని సమర్ధవంతంగా నడపగలడని పార్టీ శ్రేణులు వాదించుకుంటున్నారంట . డీకే అరుణ పేరును తెరపైకి తీసుకుని రావడం ద్వారా ఒక మహిళా నేతకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్టు ఉంటుందని జాతీయ నాయకత్వం వద్ద చర్చ ఉందట.దీనికి తోడు డీకే అరుణకు ఇప్పటికే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా అధిష్టానం దృష్టిలో మంచి మార్కులు కొట్టేయడంతో ఆమె పేరు బలంగా వినిపిస్తుందంట. డీకే అరుణకు రాష్ట్ర బాధ్యతలు అప్పగిస్తే మిగతా నేతలు ఎవరూ వ్యతిరేకించరన్న చర్చ సైతం రాష్ట్ర కార్యాలయంలో సాగుతోందంట.డీకే అరుణకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అంశంలో పార్టీ అంతర్గత అంశాలతో పాటు రాష్ట్ర రాజకీయాలు కూడా ఆమెకు కలిసి వస్తున్నాయట. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడం, అక్కడ నుంచి కాంగ్రెస్ కు చెక్ పెట్టి మహబూబ్ నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలవడం డీకే అరుణకు కలిసి వస్తుందట. కాంగ్రెస్ హోల్డ్ లో ఉన్న రెడ్డి సామాజిక వర్గాన్ని సైతం దగ్గర చేసుకునేందుకు డీకే అరుణకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించే ఆలోచనలను పరిశీలిస్తున్నారట.అనుకుంటే ఫ్లోర్ లీడర్ గా ఉన్న మహేశ్వర్ రెడ్డిని పక్కన పెట్టి బీజేపీలో ఉన్న బీసీ ఎమ్మెల్యేగా ఉన్న పాయల్ శంకర్ ను నియమించే అవకాశాలు ఉన్నట్టు చర్చ సాగుతోంది. డీకే అరుణకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఇవ్వడం ద్వారా మహిళలను సైతం ఆకట్టుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్టు చర్చ సాగుతోంది. మరి జాతీయ నాయకత్వం డీకే అరుణను అధ్యక్షురాలిగా నియమించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# తెలంగాణ జీఎస్టీ వృద్ధి 0%కు పడిపోవడంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శన

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో జీఎస్టీ (ఊు) వృద్ధి రేటు గణనీయంగా తగ్గడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

2025 మార్చి నాటికి జీఎస్టీ వృద్ధి రేటు 0%గా నమోదైందని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం కేవలం 5.1% వృద్ధి మాత్రమే సాధించినట్లు అధికారిక గణాంకాల ఆధారంగా ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా సగటు జీఎస్టీ వృద్ధి రేటు 10% ఉండగా, తెలంగాణ రాష్ట్రం దేశీయ వృద్ధి రేటుతో పోలిస్తే చాలా వెనకబడి ఉందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా, శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, "జీఎస్టీ వృద్ధి 12.3%గా ఉందని శాసనసభలో ప్రకటించడం శోచనీయం" అని హరీశ్ రావు అన్నారు. అయితే, అధికారిక గణాంకాలను పరిశీలిస్తే, భట్టి గారి వాదనలు పూర్తిగా అవాస్తవమైనవిగా తేలిపోయాయని వారు స్పష్టం చేశారు.

బడ్జెట్ సమావేశాల్లో నేను ఈ విషయాన్ని ప్రస్తావించి, రాష్ట్ర జీఎస్టీ వృద్ధి రేటు 5.5%కు పరిమితమవుతుందని హెచ్చరించాను. మా సలహాలు,హెచ్చరికలను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ప్రస్తుతం అధికారికంగా తెలంగాణ వృద్ధి రేటు కేవలం 5.1% మాత్రమేనని ధృవీకరించబడిందని చెప్పారు. తెలంగాణలో ఇంత తక్కువ జీఎస్టీ వృద్ధి ఇప్పటివరకు ఎన్నడూ నమోదు కాలేదు, కోవిడ్-19 లాక్డౌన్ కాలంలో తప్ప. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని ఆయన అన్నారు.

రాష్ట్ర వృద్ధి రేటు క్రమంగా తగ్గడానికి గత 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు కారణమని హరీశ్ రావు గారు పేర్కొన్నారు. "క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అమలులో లోపాలు, రైతు భరోసా ద్వారా పంట పెట్టుబడి సహాయం అందించకపోవడం, రైతు భరోసా పథకం కింద రూ.12,000 కోట్ల నిధులు విడుదల చేయకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు సామర్థ్యం తగ్గిపోయింది. అలాగే, హైడ్రా, మూసీ ప్రాజెక్టుల వంటి తప్పుడు విధానాలతో భయాందోళనలు సృష్టించి పెట్టుబడులు రాకుండా చేయడం, ఫార్మా సిటీ, మెట్రో రైలు ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతింది" అని ఆయన వివరించారు.ప్రజల చేతిలో డబ్బు లేకపోతే వినియోగం ఎలా పెరుగుతుంది? ఆర్థిక మంత్రి శాసనసభను మాత్రమే కాదు, తెలంగాణలోని ప్రతి పౌరుడిని మోసం చేశారు. ఇది సిగ్గుచేటు అని హరీశ్ రావు గారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి, మోసపూరిత అంకెల గారడీతో మోసం చేయకుండా, వాస్తవాల ఆధారంగా పాలన అందించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు అని హరీశ్ రావు గారు హితవు పలికారు.

# మినాక్షి ఎంట్రీతో మారుతున్న సెంట్రల్ వర్సిటీ సీన్..

హైదరాబాద్, ఏప్రిల్ 8,

తెలంగాణలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారం రోజురోజుకి వివాదాస్పదమవుతోంది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టారన్న వార్తలపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సెంట్రల్ వర్సిటీ విద్యార్థుల నుంచి మొదలుకొని ప్రతిపక్షాలు, పర్యావరణవేత్తలు, సినీ రంగ ప్రముఖుల వరకు అంతా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.అంతేకాదు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల ఆందోళనతో పాటు విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లడంతో వ్యవహారం కాస్త సీరియస్ అయ్యింది. దీంతో రేవంత్ సర్కార్ మంత్రుల కమిటీని వేసి దిద్దుబాటు చర్యలు చేపట్టినా అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయిందని.. ఈ విషయంలో పరిస్థితి చేయిదాటిపోయిందనే వార్తలు పొలిటికల్ సర్కిల్స్ లో విన్పించాయట. సున్నితమైన వ్యవహారాన్ని సీఎం రేవంత్ స్మూత్ గా డీల్ చేయలేదంటూ వచ్చిన విమర్శల నేపథ్యంలో హైకమాండ్ దూతగా.. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఎంట్రీ ఇచ్చారనేది పార్టీ ఇన్‌సైడ్ టాక్.తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ భూముల వివాదంపై సీరియస్ గా దృష్టి సారించారట. హైకమాండ్ దూతగా నేరుగా సచివాలయానికి వెళ్లి మంత్రులతో సమీక్ష నిర్వహించారు మీనాక్షి. ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీతో సమావేశమై కంచె గచ్చిబౌలి భూముల వివాదంపై ఆరా తీశారట.భూముల యాజమాన్య హక్కుల నుంచి మొదలు వివాదం వరకు అన్ని విషయాలను మంత్రులను అడిగి తెలుసుకున్నారట. ఇక కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థతో, ఆ తరువాత ప్రజా సంఘాలతో వరుస సమావేశాలు నిర్వహించిన మీనాక్షీ నటరాజన్ దీనిపై అధిష్టానానికి నివేదిక ఇచ్చేందుకు సిద్దమయ్యారట.ఇంతవరకు బాగానే ఉన్నా..మీనాక్షీ నటరాజన్ వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను ఆందోళనకు గురిచేస్తోందట. గాంధీ భవన్ కు పరిమితం కావాల్సిన మీనాక్షి.. ఏకంగా అధికారిక సచివాలయానికి రావడంపై సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. భూముల వ్యవహారంపై ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీతో అధికారికంగా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించాల్సి ఉంటుంది.కానీ కేవలం పార్టీ ఇంచార్జ్‌గా ఉన్న మీనాక్షీ నటరాజన్ మంత్రుల కమిటీతో సమీక్ష నిర్వహించడం? అదీ అధికారిక సచివాలయంలో జరగడం ఏంటని అంతా అవాక్కవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఢిల్లీ పెద్దల ఆదేశాలతోనే మీనాక్షీ ఇలా చేశారా.. లేదంటే తనంతకు తానే ఈ నిర్ణయం తీసుకున్నారా అని మంత్రులు ఆరా తీస్తున్నారంట. అసలు సచివాలయంలో మీటింగ్ వెనుక ఏం జరిగింది.. దానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారంట మంత్రులు.పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌గా ఉన్న మీనాక్షీ నటరాజన్.. సచివాలయానికి వచ్చి మరీ అధికారిక సమీక్ష నిర్వహించారంటే తమ ప్రభుత్వ సమర్ధతపై అధిష్టానానికి నమ్మకం లేదా అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారట మంత్రులు. అందులోను భూముల వ్యవహారాన్ని సరైన పద్దతిలో తాము డీల్ చేయలేకపోయామా



అన్న డైలమాలోనూ పడ్డారట అమాత్యులు.అయితే మీనాక్షీ నటరాజన్..అధికారిక కార్యక్రమాల్లో కలగజేసుకోవడం.. భూముల వ్యవహారానికే పరిమితం అవుతారా.. లేదంటే ఇకపై అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో ఆమె తలదూరుస్తారా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారట మంత్రులు. ఇలా పార్టీ ఇంచార్జ్ సచివాలయానికి వచ్చి అధికారిక సమీక్ష నిర్వహించడంతో ఇప్పటికే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని ఆందోళన చెందుతున్న ప్రభుత్వ పెద్దలు, మంత్రులు.. ఇలాగే కంటిన్యూ అయితే మాత్రం కష్టమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారంట.మొత్తానికి భూముల వ్యవహారంలో అధిష్టాన దూతగా మీనాక్షి నటరాజన్ ఎంట్రీతో రాబోయే రోజుల్లో ఏం జరగబోతుందన్న చర్చ పార్టీ వర్గాల్లోనే ప్రభుత్వంలోనూ చర్చ నడుస్తోంది. పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ గాంధీ భవన్ కు పరిమితం కాకుండా సెక్రటరియేట్ వరకు వచ్చారంటే ప్రభుత్వ సమర్థతపై నమ్మకంలేకనా? లేదంటే తమ పాలనపై ఢిల్లీ పెద్దలకు అనుమానమా అనే ఆందోళన మంత్రుల్లో కనిపిస్తోందంట.. మరి ఈ విషయం ఎటు నుంచి ఎటు వెళ్తుందో చూడాలి..

రాహూల్ ఆరా

మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు కూడా కంచ గచ్చిబౌలి భూముల రచ్చను రాహుల్ గాంధీకి చేరవేశారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేయగా.. హరీశ్‌రావు నేరుగా రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. ఈ పరిణామాలతో కంచ గచ్చిబౌలి భూవివాదం ఢిల్లీ ఏఐసీసీ భవనాన్ని టచ్ చేసింది.అసలు తెలంగాణలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు నేరుగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారట. హెచ్‌సీయూతో రాహుల్‌కు ప్రత్యేక అనుబంధం ఉండటంతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫోన్ చేసి విషయంపై ఆరా తీశారట. రాహుల్ గాంధీ ఆదేశాలతో మీనాక్షి వెంటనే హైదరాబాద్‌కు వచ్చి మంత్రుల దగ్గర ఆ వివరాలు సేకరించారు.తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వాస్తవానికి ఏప్రిల్ 16న హైదరాబాద్ వచ్చేందుకు షెడ్యూల్ ప్రిపేర్ చేసుకున్నారు. కానీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో ఆగమేఘాల మీద మీనాక్షి శుక్రవారం రాత్రే మధ్యప్రదేశ్ నుంచి రైల్లో బయలుదేరి హైదరాబాద్ వచ్చారు. శనివారం మీనాక్షి నటరాజన్ మౌనవ్రతం ఉన్నా.. తెలంగాణ సచివాలయంలో మంత్రులతో సమావేశమయ్యారు. హెచ్‌సీయూ భూముల విషయంలో ఏం జరుగుతోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలేంటి? హెచ్‌సీయూ విద్యార్థుల వాదన ఏంటి? ఇలా అన్ని వివరాలను సేకరించారు మీనాక్షి నజరాజన్.

# దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్

హైదరాబాద్, ఏప్రిల్ 8, (న్యూస్ పల్స్)

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ఉద్యాన పంటలను దృష్టిలో ఉంచుకుని, అలాగే భవిష్యత్తులో పండ్ల ఎగుమతి, దిగుమతులకు తగ్గట్లు.. అత్యాధునిక సౌకర్యాలతో, అంతర్జాతీయ స్థాయిలో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. హైదరాబాద్ శివార్లలోని కొహెడలో రూ.1,901.17 కోట్లతో 199.12 ఎకరాల్లో అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్ నిర్మించడానికి ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. మార్కెటింగ్‌శాఖ డీటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)ను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం అనంతరం పనులు మొదలుకానున్నాయి.1986లో హైదరాబాద్‌లోని కొత్తపేటలో 22 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేశారు. రద్దీ సమస్య దృష్ట్యా దాన్ని 2021లో కొహెడకు తరలించారు. తాత్కాలిక షెడ్లను నిర్మించగా వర్షాలు, గాలికి కూలిపోయాయి. దీంతో మార్కెట్‌ను బాటసింగారం హెచ్‌ఎండీఏ లాజిస్టిక్ పార్కులోకి మార్చారు. ఇప్పుడు కొహెడలో ఏకంగా 199 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నడుంబిగించింది. ప్రస్తుతం ఢిల్లీలో 100 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ ఉంది. కొహెడలో మార్కెట్ నిర్మాణం పూర్తి అయితే.. ఢిల్లీని మించి దేశంలోనే అతి పెద్ద ఫ్రూట్ మార్కెట్‌గా హైదరాబాద్ నిలుస్తుంది.199 ఎకరాల్లో ఎలాంటి సౌకర్యాలంటే..48.71 ఎకరాల్లో పండ్ల వ్యాపారానికి అవసరమైన మౌలిక వసతులను నిర్మిస్తారు. రోడ్ల కోసం 56.05 ఎకరాలు కేటాయించారు. టోల్‌గేట్, నాలా, గ్రామరోడ్డు వంటివాటికి 17.27 ఎకరాలు, పార్కింగ్ స్థలానికి 16.59 ఎకరాలు కేటాయిస్తారు. పూలు, డ్రైఫ్రూట్స్, పాడి, చేపలు, పౌల్ట్రీ, మాంసం, ఫ్రోజెన్, ప్యాక్డ్ బాటిల్ ఫుడ్స్ వంటి ఉత్పత్తులకు 10.98, కోల్డ్‌స్టోరేజీలకు 9.50 ఎకరాలు కేటాయించనున్నారు. వీటితో పాటు.. పండ్ల రిటైల్ జోన్, సామగ్రి నిల్వ, ప్రాథమిక శుద్ధి, వివిధ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పరిపాలన భవనం, ప్రయోగశాలలు, విశ్రాంతిగృహాలు, అగ్నిమాపక, పోలీసు స్టేషన్, ఆరోగ్యకేంద్రం, దుకాణాల సముదాయం, ఘనవ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి నిర్మాణాలు చేపడతారు.వంద అడుగుల ఎత్తులో 19,375 చదరపు అడుగుల స్థలంలో నిర్మించే టవర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందులో 4 అంతస్తులను వ్యాపార సంస్థలకు కేటాయిస్తారు. ఆరు హై-స్పీడ్ ప్యాసింజర్ లిఫ్టులు, హెలిప్యాడ్‌లు ఉంటాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య, ఎగుమతి సంస్థలకు లీజుపై స్థలాలను కేటాయించనున్నారు. రూ.350 కోట్లను భూసేకరణకు వెచ్చిస్తున్నారు. రూ.1,694.74 కోట్లతో నిర్మాణ పనులు, ఐటీ సౌకర్యాలు కల్పిస్తారు

# ఉపాధి హామీ బకాయి వేతనాలు రెండు కోట్ల చెల్లించాలి?.

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్

పరవాడ

గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు మండలంలో రెండు కోట్ల రూపాయలు చెల్లించాలి. పథకాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ మండలం రావాడ పంచాయతీ రేఖ వాన పాలెం గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని పథకాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని , ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పని ప్రదేశంలో నిరసన కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం గని శెట్టి మాట్లాడుతూ రూ 600 రోజుకి వేతనం చెల్లించాలని పే స్లిప్పులు ఇవ్వాలని గని శెట్టి డిమాండ్ చేశారు. చేసిన పనులకు మండలంలో రెండు కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించక పోవడంతో కూలీల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కూలిలకు సకాలంలో బిల్లులు చెల్లించడం లెదన్నారు గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్లో నిదులకు కోత విదించి మేటిరియల్ చార్జీలు పెంచేసారని తెలిపారు దింతో ముందుగా కాంట్రాక్టర్లుకు బిల్లులు ముందు చెల్లించి కూలీలను తర్వాత చెల్లిస్తున్నారని తెలిపారు, 40 శాతం సమ్మర్ ఎలవెన్సులు అధికంగా చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంటు, మంచినీరు, ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తట్టా, పారా, గునపాపం టెంట్లు వంటి వాటికి కోత పెట్టారని తెలిపారు. రవాణా చార్జీలు కూడా ఎత్తివేయడం దుర్మార్గం అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కార్మికులు అడ్డుకోవాలని గని శెట్టి పిలుపునిచ్చారు. కేటాయిస్తున్న నిధులు కూడా 2019- 20 లో 71 వేల కోట్లు కేటాయించగా 2024 కి వచ్చేసరికి పెంచకపోగా రూ 68వేల కోట్లకు తగ్గించారు. ఉపాధి హామీ కార్మికులు ఐక్యంగా పోరాడి పథకాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షకీలా బేగం, అని మునిసా, భారతి, సోమలమ్మ, లక్ష్మి, ఆలీ, మదీనా, రమణి మునిసా తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వరంగల్ సభను విజయవంతం చేయాలి

హైదరాబాద్

పండుగ వాతావరణంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్ లో గ్రేటర్ హైదరాబాద్ స్థాయి పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు అలు సురభి వాణి దేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, పలు నియోజకవర్గ ఇంచార్జి లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని డివిజన్ లలో పార్టీ పతాకాలను ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అదేరోజు వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నట్లు చెప్పారు. బహిరంగ సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు రేపటి నుండి నియోజకవర్గ స్థాయి సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20 వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ జనరల్ బాడీ నిర్వహించడం జరుగుతుందని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి గా కేసీఆర్ నాయకత్వంలో ఆదర్శవంతమైన పాలనతో అభివృద్ధి లో దేశానికే తెలంగాణ ను రోల్ మోడల్ గా నిలిపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. వరంగల్ లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో హాజరై కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు.

# ఉత్తర తెలంగాణకు మరిన్ని మౌలిక సౌకర్యాలు

అదిలాబాద్, ఏప్రిల్ 8, (న్యూస్ పల్స్)

హైదరాబాద్ నగరం నుండి ఉత్తర తెలంగాణ జిల్లాలకు రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూసేకరణ సమస్యలు ఇంకా వీడడం లేదు. ఈ కీలకమైన ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా ప్రైవేటు ఆస్తుల సేకరణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ.. రక్షణ శాఖ భూముల బదలాయింపు ప్రక్రియలో జరుగుతున్న జాప్యం ప్రాజెక్టు పురోగతికి అడ్డంకిగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుండి సూత్రప్రాయంగా ఆమోదం లభించినప్పటికీ.. భూమిని హెచ్‌ఎండీఏకు అప్పగించే విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈ భూసేకరణ ప్రక్రియ పూర్తిగా పూర్తయితేనే టెండర్లు పిలిచేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)కు అవకాశం లభిస్తుంది.ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫాం వరకు 5.4 కిలోమీటర్ల పొడవైన ఒక ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట అవుటర్ రింగ్ రోడ్డు ఇంటర్‌ఛేంజ్ వరకు 18.10 కిలోమీటర్ల మేర మరో భారీ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ఏడాది క్రితమే శంకుస్థాపన చేసింది. శామీర్‌పేట కారిడార్ ప్రాజెక్టు కోసం సుమారు 197 ఎకరాల భూమిని సేకరించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు.అత్యధికంగా, అంటే 113.48 ఎకరాల భూమి రక్షణ శాఖ నుండి సేకరించాల్సి ఉంది. రక్షణ శాఖ నుండి తీసుకునే భూమికి సమానమైన విలువ కలిగిన భూమిని మరో ప్రాంతంలో ప్రభుత్వం వారికి కేటాయించవలసి ఉంటుంది. ఇప్పటికే హెచ్‌ఎండీఏ పలు ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను రక్షణ శాఖకు ప్రతిపాదించింది. ఈ భూమి గుర్తింపు మరియు బదిలీ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యం కారణంగా ప్రాజెక్టు యొక్క మిగిలిన పనులు కూడా నెమ్మదిగా సాగుతున్నాయి.అంతేకాకుండా.. రక్షణ శాఖకు చెందిన భూముల్లో ఒకచోట 5 లక్షల గ్యాలన్ల సామర్థ్యం కలిగిన తాగునీటి సరఫరా రిజర్వాయర్ .. మరొక చోట 2.5 లక్షల గ్యాలన్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌తో పాటు కొన్ని భవనాలు కూడా ఉన్నాయి. ఈ రిజర్వాయర్‌లకు, భవనాలకు ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలం కేటాయించి అక్కడ కొత్త రిజర్వాయర్‌లు.. భవనాలు నిర్మించి రక్షణ శాఖకు అప్పగించవలసి ఉంటుంది. ఈ సంక్లిష్టమైన ప్రక్రియ మొత్తం పూర్తయితేనే రక్షణ శాఖ నుండి ఈ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉందని ఒక ఉన్నతాధికారి తెలిపారు. ఈ ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు నిర్మాణ పనులతో పాటు భూసేకరణ కోసం మొత్తం సుమారు రూ. 3619 కోట్లు ఖర్చు చేయనున్నారు.ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం వరకు నిర్మించనున్న 5.4 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ కోసం హెచ్‌ఎండీఏ ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్లను ఎలక్ట్రానిక్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పిలిచారు. ఈ నెల 15వ తేదీన ఈ టెండర్లను తెరవనున్నారు. మొదట.. సాంకేతిక అర్హతలు కలిగిన సంస్థల బిడ్‌లను పరిశీలిస్తారు.ఆ తర్వాత అర్హత సాధించిన సంస్థల ధరల బిడ్‌లను తెరుస్తారు. అత్యల్ప ధరకు కోట్ చేసిన సంస్థ ఎల్1గా నిలిచి ఈ ప్రాజెక్టు పనులను దక్కించుకుంటుంది. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే.. 44వ జాతీయ రహదారిలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు ఎంతో సులభతరం కానున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 652 కోట్లు .. భూసేకరణతో కలిపి మొత్తం రూ. 1550 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధంను అడ్డుకున్న పోలీసులు

## వంటగ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గం

## పేదలపై భారం మోపితే మోడీకి మూడినట్లే

## సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి





కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ దేశంలో బిజెపి ప్రభుత్వం పేద మధ్యతరగతి సామాన్య ప్రజలపై భారం మోపడానికి వంటగ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని, వారిపై భారంమోపిన దేశ ప్రధాని మోడీకి ఇక మూడినట్లేనని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని కమాన్ చౌరస్తా వద్ద సిపిఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడానికి ప్రయత్నించిన సిపిఐ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, సీపీఐ నేతలకు కొంతసేపు తోపులాట జరగగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు తలకు గాయమై రక్తస్రావంకాగా, కొంతమంది నాయకులకు దెబ్బలు తగిలాయి. ఆందోళనతో భారీగా ఇరువైపులా ట్రాపిక్ నిలిచిపోయింది.. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చమరు ధరలను తగ్గించకుండా ఆయిల్ కంపెనీలకు వత్తాసు పలుకుతుందని, అర్ధరాత్రి వంటగ్యాస్ 50 రూపాయలు పెంచి పెదాలపై భారం మోపి , పెట్రోల్,డీజిల్ పై రెండు రూపాయలు పెంచి వీటిని ఆయా కంపెనీలే భరించాలని కేంద్ర మంత్రి ప్రకటించడం దుర్మార్గమని, ఏదో ఒక రోజు మళ్లీ పెట్రోల్,డీజిల్ ధరలు పెంచదనే గ్యారంటీ లేదని అనుమానం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, నరేంద్ర మోడీ ప్రధానిగా పదకొండు సంవత్సరాలు గడిచిపోయిందని పదకొండు సంవత్సరాలలో పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజలపై పెను భారం మోపడానికి అనేకసార్లు పెట్రోలు,డీజీలు,వంటగ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పేదల జీవన ప్రమాణాలను దెబ్బతీసే విధంగా మోడీ పాలన కొనసాగుతుందని, పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు లాభం చేకూర్చే విధంగా మోడీ ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయని అలాంటి విధానాలకు మోడీ స్వస్తి పలకాలని,తక్షణమే వంటగ్యాస్ ధరలను తగ్గించాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించక తప్పదని హెచ్చరించారు. వంటగ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ నాయకులు శాంతియుతంగా కమాన్ చౌరస్తా వద్ద ఆందోళన నిర్వహించడానికి అక్కడకు చేరుకున్న సీపీఐ నాయకులపై,కార్యకర్తలపై కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు అతి ఉత్సాహం ప్రదర్శించి, దురుసుగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదని, ముఖం కనబడకుండా మాస్కులు వేసుకొని ఆర్ఎస్ఎస్,బిజెపి కి తొత్తులుగా కొంతమంది వ్యవహరిస్తూ నాయకులపై,కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించడాన్ని సీపీఐ ఖండిస్తుందన్నారు. పేద ప్రజలకు అండగా సీపీఐ నిరంతరం ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తుందని, పోలీసులు ఈ విషయాన్ని గుర్తుంచుకొని వ్యవహరించాలని వెంకటస్వామి అన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్,నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పైడిపల్లి రాజు,కిన్నెర మల్లవ్వ,సాయవేణి రాయమల్లు,బ్రామండ్ల పెల్లి యుగంధర్,న్యాలపట్ల రాజు,బోనగిరి మహేందర్, మచ్చ రమేష్,నాయకులు కొట్టే అంజలి,చెంచల మురళి,తంగెళ్ళ సంపత్,చారి,రాజు,కూన రవి,నల్లగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపు సందర్శించిన జిల్లా విద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరుగుతున్న ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన మహిళలకు అందుతున్న సేవలు సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రోత్సహించి నిన్న జరిగిన నార్మల్ డెలివరీ కేసు ఆరోగ్యం గురించి తెలుసుకొని ఆమెకు అందుతున్న వైద్య సేవలను అడిగి అక్కడి నార్మల్ డెలివరీ కి సహకరించిన వైద్య సిబ్బందిని అభినందించడం జరిగింది.

తదనంతరం ఆశా డే రివ్యూ మీటింగ్ లో పాల్గొని రివ్యూ చేయడం జరిగింది. ఆరోగ్య కేంద్రం యొక్క హాజరు పట్టిక మరియు రికార్డులను తనిఖీ చేసి ఫార్మసీ స్టోర్స్ లో మందుల నిల్వలను మరియు పేషెంట్లకు పంపిణీ చేస్తున్న మందులను పరిశీలించడం జరిగింది. ఎన్ సి డి క్లినిక్ లోని అధిక రక్తపోటు మరియు



డయాబెటిస్ రోగుల వివరాలను వారికి అందుతున్న మందుల వివరాల నమోదును పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఓ ఎం సి హెచ్ డాక్టర్ సన జవేరియా, డాక్టర్ మనోహర్, పి హెచ్ ఎన్ విమల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 25న ఎస్ఎఫ్ఐ ఐదో రాష్ట్ర మహాసభలు ప్రారంభం

## గోడప్రతిని ఆవిష్కరించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి 27 వరకు ఖమ్మం కేంద్రంలో జరుగనున్న 5వ రాష్ట్ర మహాసభల గోడప్రతిని ఆవిష్కరణ ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాశ్, టౌన్ అధ్యక్షులు ఇసాక్ మాట్లాడుతూ ఈనెల 25 నుండి జరగబోయే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాల్సిందిగా విద్యార్థులను, మేధావులను కోరారు. రెండు సంవత్సరాల ఉద్యమ అనుభవాలను నెమరువేరుస్తూ భవిష్యత్తు కార్యాచరణ ఈ మహాసభలలో రూపొందించుకోబోతున్నామని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేసే దిశగా భవిష్యత్తు కార్యాచరణ నిర్వహించబోతున్నామని అన్నారు. ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ప్రతినిధులు 1000 మంది రానున్నారని, మహాసభలకు హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీజ, నాయకులు రాకేష్, చరణ్, అంజి, రాకేష్, వినయ్, రఘు, దుర్గ , రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ అధ్యాపకుల ఉద్యోగ భద్రత కల్పించాలి

## - సుల్తాన్పూర్ జేఎన్టీయూ అధ్యాపకులు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 08: రాష్ట్రంలో 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకి బేసిక్ డిఏ, హెచ్ఆర్ఏ మరియు3 శాతం ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జేఎన్టీయూ సుల్తాన్పూర్ కళాశాల అధ్యాపకులు తరగతులు బహిష్కరించి, నిరసన తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 21 వల్ల కాంటాక్ట్ అధ్యాపకుల జీవితాలు ఆగమ్య గోచరంగా ఉండటంవల్ల జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.



# రాజకీయాలకు అతీతంగా పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి: కేంద్ర మంత్రి సంజయ్





కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):రాజకీయాలకు అతీతంగా కొడిమ్యాల మండలంసహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేద్దామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తరువాత ప్రజల అభ్యున్నతే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం కొడిమ్యాల మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం నుండి అంగడి బజార్ వరకు 65 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్డును కేంద్ర బండి సంజయ్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో కలిసి భూమిపూజ చేసారు. అలాగే కొడిమ్యాల మండల కేంద్రంలో 3 కోట్ల 50 లక్షల రూపాయల కేంద్ర నిధులతో వివిధ రోడ్లు, అభివృద్ధి పనులను, 23 లక్షల 50 వేల రూపాయల ఎంపీ లాడ్స్ నిధులు, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు. అలాగే 2 కోట్ల 59 లక్షల రూపాయలతో పంచాయతీలలో నిర్మించిన సీసీ రోడ్లను, ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన కిచెన్ షెడ్, కమ్యూనిటీ హాల్స్, పీఏసీఎస్ భవనాల అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం, బొడిగె శోభతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేస్తున్నాం. అందులో భాగంగా రూ.3.5 కోట్ల కేంద్ర నిధులతో కొడిమ్యాల మండంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు కలిసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా ఉ ంటదో చూపిస్తాం. ముఖ్యంగా చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం. అందుకోసం రాబోయే రోజుల్లో కేంద్రం నుండి అధిక నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు రేకులపెల్లి రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బండ నరసింహ రెడ్డిలు పాల్గొన్నారు.

# ఆపదలో ఆపద్భాందవులు ఈ కరివెద కుటుంబం

## పేద, బడుగు, బలహీనర్గాలు కాలంచేస్తే ముందుంటారు



కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):పేద, బడుగు, బలహీనర్గాలకు చెందిన కుటుంబాలకు ఆపద వచ్చింది అంటే ఆపద్బాంధవులు పేదలు కాలం చేస్తే సాయం అందించాలనే సంకల్పమే వారిది గొప్పది. గ్రామ అభివృద్ధి తోపాటు అన్ని వర్గాలు ఎల్లప్పుడూ సమన్వయంతో ఉండాలనే ఉద్దేశ్యంతోనే సామాజిక సేవలో ముందుంటున్నారు.మానవత్వం పరిమళించే మంచి హృదయానికి స్వాగతం అనే సాహిత్యానికి ఈ కరివెద కుటుంబమే నిదర్శనం.

కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ స్వర్గీయ కరివెద నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి కరివెద మణెమ్మ ఆధ్వర్యంలో వారి పెద్ద కుమారుడు ఎన్ఆర్ఐ కరివెద వెంకటరమణారెడ్డి, చిన్నకుమారుడు కరివెద వేణుమాధవరెడ్డిలు ఆపదలో అదుకుంటూ గ్రామ ప్రజల మన్ననలను పొందుతూ ముందుకుసాగుతున్నారు. గ్రామంలో పేద బడుగు బలహీన వర్గాలు శివైక్యం చెందితే ఈ మణెమ్మ కుమారులు ముందుండి కార్యక్రమాల్లో పాల్గొంటూ వారికి పెద్దదిక్కుగా నిలుస్తున్నారు.

అయితే గ్రామంలో బుచ్చాల ఓదెలు కడునిరుపేద కుటుంబం ఓదెలు కుమారుడు నాగరాజు గుండెపోటుతో మరణించాడు. ఈ విషయం తెలుసుకొని కరివెద వేణుమాధవరెడ్డి ఓదెలు కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి 25కిలోల బియ్యం తోపాటు నగదు 2500/- రూపాయలు వారికి అందేశారు.గ్రామంలో ఆపదలో ఆదుకుంటూ, గ్రామానికి పెద్దదిక్కుగా నిలుస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.గ్రామ ప్రజల ఆ భగవంతుడి ఆశీర్వచనాలు వారి కుటుంబానికి అందాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# జీపీ పాఠశాలల విద్యార్థులు శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి :జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ విద్యా సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అల్ఫోర్స్ విద్యాసంస్థ సహకారంతో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒలంపియాడ్ లో శిక్షణ ఇప్పించారు. ఈ పరీక్ష రాసి మెరిట్ సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానోత్సవ కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం జరిగింది. ఒలంపియాడ్ లో మెరిట్ సాధించిన 16 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చే విధంగా ప్రైవేటు యాజమాన్యాలతో గతంలో ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం అన్ని రంగాల్లోనూ రాణించాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా అల్ఫోర్స్ విద్యాసంస్థ 400 మంది ప్రభుత్వ విద్యార్థులకు ఒలంపియాడ్ లో శిక్షణను ఇచ్చిందని తెలిపారు. వీరిలో 80 మంది మెరిట్ సాధించగా 16 మందికి మెడల్స్ వచ్చాయని తెలిపారు. మెరిట్ సాధించిన 80 మంది విద్యార్థులకు ఈనెల 24 నుండి మరో దఫా శిక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం సంతృప్తినిస్తోందని అన్నారు. అవకాశం, వేదిక ఇస్తే ప్రభుత్వ పాఠశాలల్లోని ఎంతోమంది పిల్లలు విజయం సాధిస్తారని నిరూపితమైందని అన్నారు. ఈ వేసవిలో చేపట్టబోయే మరిన్ని శిక్షణ కార్యక్రమాలకు విద్యార్థులు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించి శిక్షణకు పంపించాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో టాలెంట్ ఉందని అన్నారు.



వారికి అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థి దశ నుండే వివిధ పోటీ పరీక్షలకు హాజరవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత విద్యపై అవగాహన వస్తుందని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులకు ఎప్పుడూ చేయూతనిస్తామని అన్నారు. రానున్న ఐదేళ్లలో మరిన్ని శిక్షణలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి అవకాశాలు వచ్చేలా చూస్తామని తెలిపారు. ఒలంపియార్డులో మెరిట్ సాధించిన 80 మందికి ఈనెల 23 నుండి వచ్చే నెల 11 వరకు మరో శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. శిక్షణకు అయ్యే ఖర్చు అంతా తామే భరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, భవిత కేంద్రాల కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని 90 సార్లు మార్చి పరిరక్షణ యాత్రలా?

## బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు క్రిష్ణారెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):రాజ్యాంగాన్ని 90 సార్లు సవరించిన కాంగ్రెస్ పార్టీ జై భీమ్ జై సంవిదాన్ అంటూ ర్యాలీలు నిర్వహించడం నూరు ఎలుకలు తిన్న పిల్లి హాజ్ యాత్ర చేసిన చందంగా ఉందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి విమర్శించారు. మంగళవారం బోయిన్ పల్లి మండలం కేంద్రంలోని సామాజిక భవనంలో పార్టీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురాం ఆధ్వర్యంలో నిర్వహించిన బిజెపి ముఖ్య కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ భారత రాజ్యాంగాన్ని గౌరవించిన చరిత్ర లేదని, స్వార్థ రాజకీయాల కోసం దేశంలో ఎమర్జెన్సీ విధించి పౌరుల ప్రాథమిక హక్కులను రద్దు చేసిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉన్నదని తన అభిప్రాయాలతో విభేదించిన వాళ్లను జైళ్లలో బంధించి పత్రికా స్వేచ్ఛను సెన్సార్ చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని పర్యటనలు నిర్వహించడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గ్రహిస్తే మంచిదని హితబోధ చేశారు.స్థానిక సంస్థలైన, గ్రామపంచాయతీలకు మండల జిల్లా పరిషత్ లకు మున్సిపాలిటీలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికల నిర్వహించాలని రాజ్యాంగంలో రాసి ఉందని చెప్పారు. గ్రామపంచాయతీ పాలకవర్గాల సమయం ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా రాజ్యాంగాన్ని ఎందుకు ఉల్లంఘిస్తున్నదో కాంగ్రెస్ పార్టీ ఈ సందర్భంగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల అనుచితంగా వ్యవహరించిన నెహ్రూను క్యాబినెట్ లో న్యాయశాఖ మంత్రిగా కొనసాగకుండా ఇబ్బందులకు గురిచేసి మంత్రిగా రాజీనామా చేసే పరిస్థితులు ఎందుకు కల్పించారో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు వివరించాలన్నారు.1952, 1954, రెండు ఎన్నికలలో కూడా భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి గా కీర్తించబడ్డ బాబాసాహెబ్ అంబేద్కర్ పై ఇంటర్ పాస్ కానటువంటి వ్యక్తిని నిలబెట్టడమే కాక డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నియోజకవర్గంలో అంబేద్కర్ను ఓడించాలని జవహర్లాల్ నెహ్రూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భారతరత్న బిరుదులు ఇచ్చుకున్నటువంటి కాంగ్రెస్ ప్రధానులు జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీలు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లాంటి మహా పురుషునికి భారతరత్న ఇవ్వకపోవడం యావత్ భారత ప్రజలను అవమానించడమేనన్నారు. పల్లె నుంచి ఢిల్లీ దాకా కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతున్నాడంతో నేడు కాంగ్రెస్ పార్టీకి మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్, భారత రాజ్యాంగం గుర్తుకు రావడం ఆపదమొక్కులు తప్ప మరొకటి కాదని ఆయన ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహ చారి, మాజి మండల అధ్యక్షులు గుడి రవిందర్ రెడ్డి, ఎస్సి మోర్చ మాజి మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, ఓబీసీ మోర్చ మాజి మండల అధ్యక్షులు బొంగోని అశోక్ గౌడ్, అనెమల్ల మోహన్ బాబు, నాయకులు స్వామికుమార్, కిరణ్ రజూరి, మిర్యాల శరత్ చంద్ర రెడ్డి, కందారపు వెంకటేశ్, జువెంతుల శ్రీనివాస్ రెడ్డి, బూత్ అధ్యక్షులు సారంపల్లి రాజు, భోగోజి గంగాధర్ చారి, బ్రహ్మప్రసాద్, రామనుజం, రజినీకాంత్, సాయికుమార్, రంజిత్, రాజేశం, నాగరాజు, జగిరి వేణు, వినయ్, చంద్రయ్య, వెంకటేశ్, తిరుపతి, వంశీ, మధులు పాల్గొన్నారు.

# 27 రజతోత్సవ సభను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే గంగుల





కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించబోయే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేయడానికి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహాకా సమావేశాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగింది. మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో కమలాకర్ మాట్లాడుతూ . ఈ సందర్భంగా పార్టీని స్థాపించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వరంగల్ జిల్లాలో లక్షలాదిమందితో ఈనెల 27వ తేది ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ నేపథ్యంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కు కరీంనగర్ అంటే ఎనలేని ప్రేమ, అభిమానం ఉందనీ, కరీంనగర్ ప్రజలకు కేసీఆర్ అంటే అంతే అభిమానంతో ఉన్నారని గుర్తుచేశారు.. 2001లో సింహగర్జన పేరుతో కెసిఆర్ మొదటి సమావేశాన్ని కరీంనగర్ లోనే ఏర్పాటు చేసి టిఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని చెప్పారు.తదనంతరం తెలంగాణ ఉద్యమం చేపట్టి తెలంగాణ సాధించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పదేళ్లలో గణనీయంగా అభివృద్ధి చెందిందని, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అబద్దాల హామీలనిచ్చి గద్దెనెక్కిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడిచిన ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వ పాలన కుంటిపడిందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రెండు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.ఆ రెండు పార్టీలు దొందు దొందే అని విమర్శించారు.సమావేశం అనంతరం నాయకులు కార్యకర్తలు కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించి పదివేల మందికి తగ్గకుండా బహిరంగ సభకు హాజరవుతామని ఎమ్మెల్యే గంగులకు హామిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బిఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, రూరల్ మండల అధ్యక్షులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్,కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మెన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలత- మహేష్, కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు జమీలుద్దీన్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు సాబీర్ భాష, దుర్శెడ్ ప్యాక్స్ చైర్మన్ తోట తిరుపతి, వైస్ చైర్మన్ నర్సయ్య, బిఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, బిఆర్ఎస్ మైనార్టీ నగర శాఖ అధ్యక్షులు మీర్ షౌకత్ ఆలీ, యువత ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, యువత మైనార్టీ ప్రధాన కార్యదర్శి నవాజ్ హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి







పొద్దుటూరు, ఏప్రిల్ 8(భారత శక్తి) : ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసి అన్ని రకాల మెరుగైన వైద్యసేవలను ప్రజలకు చేరువ చేస్తామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.మంగళవారం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో హెచ్ డిసి కో చైర్మన్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అద్యక్షతన ఏర్పాటైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి హెచ్ డిసి చైర్మన్, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం దిశగా ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ముందుకెళుతోందన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో పేషంట్లకు మెరుగైన వైద్యం అందించడంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు బాగా శ్రమిస్తున్నారనే. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, ఐఎమ్ఏ అధికారులు ఆసుపత్రి అభివృద్ధికి తమవంతు ప్రత్యేక సహకారం అందించడం అభినందనీయం అన్నారు. స్థానిక నాయకులతో పాటు పలువురు సేవా దృక్పథం ఉన్న వారు ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు సాయం చేయడం జరుగుతోందని ఈ విషయం అభినందనీయం అన్నారు. ఈ ఆసుపత్రిలో వైద్యం తీసుకుని వెళ్లిన వారు కూడా ఆసుపత్రి అభివృద్ధికి తమవంతు సాయం అందించిన వారు కూడా చాలామంది ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న పి4 విధానాన్ని మన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కూడా ఫాలో అయితే మంచి ఫలితాలను సాధించగలమన్నారు. ఆసుపత్రిలో పరికరాలు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచడం జరుగుతుందన్నారు. వివిధ విభాగాలలో కొరత ఉన్న సిబ్బందిని భర్తీ చేస్తామన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా నేనున్నానంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వారు చొరవ తీసుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ దిశగానే జిల్లా అధికార యంత్రాంగం, ఆసుపత్రి సిబ్బంది, ఐఎమ్ఏ అధికారులు కృషి చేస్తున్నందుకు భినందనలు అన్నారు. ఆసుపత్రికి కావలసిన సరిపడా మందులు, అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు జిల్లా కలెక్టర్ అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఆయన ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి అవసరం ఉందన్నారు. రాహులకు అందించే ఆహారం ఆరోగ్యకరంగా, రుచికరంగా అందించేలా శ్రద్ధ వహించాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మెరుగు పరుస్తామని అన్నారు.తల్లి కడుపులో పడ్డప్పటి నుండి బిడ్డ పుట్టి బాగా చదివి ప్రయోజకులు అయ్యేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందిస్తోందన్నారు. వైద్యం, విద్య పైన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలను రోగులకు అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సహాయ సహకారాలు, సంక్షేమ ఫలాలను అందిస్తుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఆనంద్ బాబు, ఏపీఎమ్ఎస్ఐడిసి డిఈ నాగవెంకటేశ్వర్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. హిమదేవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు, స్థానిక యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఏప్రిల్8:హన్మకొండ నగరంలోని బాలసముద్రంలో మల్లికాంబ మానసిక దివ్యాంగుల మనోవికాస కేంద్రంలోని హన్మకొండ, రాంనగర్ కు చెందిన భూక్యా శకుంతల ద్వితీయ కుమారుడు భూక్యా కృష్ణతేజ గత ఏడాది మరణించడంతో వారి పుట్టినరోజును పురస్కరించుకుని వారి జ్ఞాపకార్థం తో కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 'అన్నం' అంటే ఆహారం, 'దానం' అంటే ఇవ్వడం లేదా దానం చేయడం అని అన్నదానాన్ని వివిధ రకాల దానంలో 'మహాదానం' అని అంటారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నదానానికి మించి ఏది లేదని, అన్నదానం చేస్తే భవిష్యత్తులో శుభ ఫలితాలు కలుగుతాయని అన్నారు.



అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని ఎందుకంటే ఒకపూట భోజనం పెట్టి ఆకలితో ఉన్న వారి కడుపు నింపవచ్చని ఇలా మానసిక దివ్యాంగుల కడుపు నింపడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు , బంధు మిత్రులు, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సంపన్నులతో సమానంగా పేదలకు సన్నబియ్యం పథకం



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 08: సంపన్నులతో సమానంగా పేదలకు సన్న బియ్యంను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్నదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పెద్ద గుజ్జార్ తాండా లో బానోత్ సోఫీ, వినోద్ ఇంట్లో కలెక్టర్ తో పాటు పలువురు అధికారులు భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సన్నబియ్యం పథకం క్రింద పేద కుటుంబాలకు కూడా పంపిణీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం సన్న బియ్యం పేదలకు అందించాలనే ఉద్దేశ్యంతో అర్హత గల ప్రతీ ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. సన్న బియ్యం అన్నం ఎలా ఉంది, కుటుంబంలోని వ్యక్తుల సంఖ్య, ప్రతీ నెల ఎన్ని కిలోలు వస్తున్నవి అని అడిగి తెలుసుకున్నారు. బానోత్ వినోద్ మాట్లాడుతూ, ప్రతి నెల 30 కిలోలు వస్తున్నవని, గతంలో దొడ్డు బియ్యం వస్తే ఎవరం కూడా తినేవాళ్ళం కాదని, సన్నబియ్యంతో కుటుంబంలోని ప్రతీ ఒక్కరం తింటున్నాం అని తెలిపారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ , ఇతర అధికారులు భోజనం చేశారు. అనంతరం కుటుంబ ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువు, వ్యవసాయ పనులు, రాబడి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తనకు బోర్ వెల్ మంజూరుకు సమస్య ఏర్పడిందని సమస్య పరిష్కరించాలని బానోత్ వినోద్ కలెక్టర్ ను కోరారు. సమస్య పరిష్కరించాలని ఆర్డీఓ ను కలెక్టర్ సూచించారు. మండలంలో రేషన్ కార్డుల సర్వే పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా పంచాయతీ అధికారి మురళీ, ఎంపీడీఓ రాజేశ్వర్, తహసీల్దార్ రేణుక చౌహాన్, మండల పరిషత్ అధికారి, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 08: జిల్లా కేంద్రంలో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఆర్డీఓ వీణ, తహసీల్దార్ జనార్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, నాయబ్ తహసీల్దార్ అనీల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కవిత యాక్షన్ మైమరిపిస్తోందా..?

## యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజీమ్



కరీంనగర్, ఏప్రిల్ 8(భారత శక్తి):రాష్ట్రంలో ఎప్పుడైనా ఏదైనా అంశం చర్చకు వస్తే చాలు అధికార పార్టీ దానిపై సానుకూలంగా స్పందించినట్లు ప్రకటించి, వెంటనే ఆపై యాక్షన్‌లోకి బీ ఆర్ ఎస్ ఎమ్మెల్సీ కవిత దిగుతోందనిపించేలా ప్రదర్శనలు ప్రారంభిస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ విమర్శించారు. ప్రత్యేకించి కల్వకుంట్ల కవిత తీరుపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.అసెంబ్లీలో మహాత్మాగాంధీ విగ్రహం పెడతారన్న వార్తల నేపథ్యంలో దీక్షలు చేసి, చివరికి అది కవిత వల్లే సాధ్యమైందని ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. కేంద్రంలో మహిళా సాధికారత బిల్లుపై కేంద్రం సానుకూలంగా స్పందించగానే ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కవిత దీక్షలు నిర్వహించారని చెప్పారు.అనంతరం ఆ బిల్లు వచ్చినదే తన ప్రయత్నాల ఫలితమని చెబుతున్నారని ఎద్దేవా చేశారు.ఇలాంటి ప్రతి అంశం వెనుక పథకం ఉందని ఆరోపించారు .అంబేద్కర్ విగ్రహం అంశం అయినా సరే, బీసీ ఓటర్లకు పువ్వులు పెట్టేందుకు కార్యకర్తలను వినియోగిస్తూ, కవితను నమ్మాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అంత సులభంగా నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు.జాగృతి సంస్థ ఏళ్లుగా కష్టపడ్డ బీసీ నేతలు కవిత వెనక నిలబడేందుకు వెనుకంజ వేస్తున్నారని, ఒక్క ఇద్దరు మినహా ఎవరూ కనిపించకపోవడం గమనించదగ్గ విషయమన్నారు.



# ఆ క్రికెట్ రూల్ మారాలి: హనుమ విహారి పోస్టు వైరల్

తెలుగు క్రికెటర్ హనుమ విహారి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. క్రికెట్ రూల్స్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందనేది ఆ పోస్టు సారాంశం. ఇంతకీ హనుమ విహారి ఏం పోస్టు పెట్టారు? ఎందుకు డిబేట్‌గా మారనుందనేది తెలుసుకుందాం.

వాంఖడే వేదికగా ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (%వీ× జం =జదీ%) జట్ల మధ్య మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ముంబయిపై ఆర్సీబీ 12 పరుగులతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. కోహ్లీ (67), రజత్ పటీదార్ (64), జితేశ్ శర్మ (40లి), దేవదత్ పడిక్కల్ (37) రాణించారు. 150లోపే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ ఇన్నింగ్స్‌ను రజత్‌తో కలిసి జితేశ్ ముందుకుతీసుకెళ్లాడు. కేవలం 19 బంతుల్లోనే 40 పరుగులు చేశాడు. ఆర్సీబీ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌ను ముంబయి బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా (%జీుంజూతీత్ దీబఎతీుష్ట్ర%) వేశాడు. ఈ ఓవర్‌లో జితేశ్ ఐదో బంతికి సిక్స్ కొట్టాడు. ఇక చివరి బంతిని యార్కర్ సంధించాడు. ఎల్బీ కోసం అప్పీలు చేయగా.. అంపైర్ ఔట్ ఇచ్చాడు. ఆ వెంటనే బ్యాటర్లు పరుగు తీశారు. డీఆర్‌ఎస్ తీసుకోగా.. సమీక్షలో నాటౌట్‌గా తేలింది. అయితే, అప్పటికే బంతి డెడ్‌బాల్‌గా ప్రకటించడంతో.. పరుగు తీసినా దానిని కౌంట్ చేయలేదు. ఇప్పుడు దానిపైనే హనుమ విహారి స్పందించాడు. నాటౌట్ ఇచ్చినప్పుడు అప్పటికే పరుగు తీస్తే దానిని లెకులోకి పరిగణించాలని వ్యాఖ్యానించాడు.

"క్రికెట్‌లో ఓ రూల్‌ను మార్చాల్సిన అవసరం ఉంది. ఆర్సీబీ ఇన్నింగ్స్ చివరి బంతికి జితేశ్ శర్మ(%జీత్‌వంష్ట్ర రాష్ట్రుతీఝ%) ఔట్ ప్రకటించారు. అతడు రివ్యూ తీసుకున్నాడు. అంపైర్ తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. ఆఫ్‌స్టంప్ ఆవల బంతి పడటంతో సమీక్షలో ఔట్ ఇవ్వలేదు. అయితే, ఇక్కడ సమస్య ఏంటంటే.. బ్యాటర్లు తీసిన రన్‌ను కౌంట్ చేయలేదు. ఒకవేళ అంపైర్ నాటౌట్ ఇచ్చి ఉంటే అప్పుడు పరుగును లెక్కలోకి తీసుకొనేవారు. ఇప్పుడీ మ్యాచ్‌లో ప్రభావం చూపించలేదు. అదే రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క బంతికి రెండు పరుగులు అవసరమైనప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురైఉంటే ఏం చేసేవారు. అందుకే, ఈ నిబంధనల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది"




# టమాటాలు అమ్ముకునేవారికే మీకన్నా ఎక్కువ తెలుసు: బాసిత్ అలీ

అన్ని ఫార్మాట్లలో వరుస వైఫల్యాలతో పాకిస్థాన్ క్రికెట్ టీమ్ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. టీ20 వరల్డ్ కప్ 2024 ఛాంపియన్స్ ట్రోఫీ 2025 (%×జజ జష్ట్రుఎజూఅశీఅం ుతీశీజూష్ట్రుం%)లో పేలవ ప్రదర్శన చేసింది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లోనూ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసత్ అలీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, సెలక్షన్ కమిటీ మీద నిప్పులు చెరిగాడు. ప్రతిష్ఠాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి కేవలం ఒకే ఒక ఫ్రంట్ లైన్ స్పిన్నర్‌తో ఎలా బరిలోకి దిగారని ప్రశ్నించాడు. అలాగే ప్రస్తుత కోచ్ ఆకిబ్ జావేద్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశాడు.

'సెలక్షన్ కమిటీ రాజీనామా చేయాలి. వారికి టీమ్ కూర్పు తెలియదు. ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇప్పటి వరకు వరుస వైఫల్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. టమాటాలు అమ్ముకునే వారికే మీ కన్నా ఎక్కువ పరిజ్ఞానం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడిన టీమ్‌లో స్పిన్నర్లను ఎందుకు తీసుకోలేదని చివరికి వారు కూడా ప్రశ్నిస్తున్నారు' అని బాసత్ అలీ చురకలంటించాడు.

ఇదిలా ఉండగా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ వరుస ఓటముల నేపథ్యంలో పీసీబీ ఛైర్మన్‌గా తన పదవి నుంచి వైదొలగుతున్నట్లు వస్తున్న వార్తలను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సోమవారం ఖండించింది. ఇందులో నిజం లేదని తెలిపింది.


# మిచెల్ మార్ష్, పూరన్ ధనాధన్.. కోల్‌కతా ముందు కొండంత లక్ష్యం

కోల్‌కతా: ఐపీఎల్ 2025లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ భారీ స్కోరు సాధించింది. ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. సూపర్ ఫామ్‌లో ఉన్న మిచెల్ మార్ష్ (81బీ 48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులు) ఈ సీజన్‌లో నాలుగో అర్ధ శతకం నమోదు చేశాడు. వన్‌డౌన్ బ్యాటర్ నికోలస్ పూరన్ (87లిబీ 36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఐదెన్ మార్‌క్రమ్ (47బీ 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) దూకుడుగా ఆడి త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. కోల్‌కతా బౌలర్లలో హర్షిత్ రాణా 2, ఆండ్రీ రస్సెల్ ఒక వికెట్ పడగొట్టారు.

వైభవ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మూడే పరుగులు రాగా.. ఆ తర్వాత మార్‌క్రమ్, మార్ష్ దూకుడు మొదలెట్టారు. స్పెన్సర్ జాన్సన్‌ను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదారు. జాన్సన్ వేసిన మొదటి రెండు ఓవర్లలో 30 పరుగులు రాబట్టారు. హర్షిత్ రాణా బౌలింగ్‌లో లఖ్‌నవూ ఓపెనర్లు చెరో సిక్స్ బాదారు. నరైన్ బౌలింగ్‌లో మార్ష్ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. ఈ క్రమంలో 10 ఓవర్లకు స్కోరు 95/0గా నమోదైంది. హాఫ్ సెంచరీకి చేరువైన మార్‌క్రమ్‌ను హర్షిత్ రాణా ఔట్ చేసి కోల్‌కతాకు ఉపశమనాన్ని అందించాడు.

# టమాటాలు అమ్ముకునేవారికే మీకన్నా ఎక్కువ తెలుసు: బాసిత్ అలీ

అన్ని ఫార్మాట్లలో వరుస వైఫల్యాలతో పాకిస్థాన్ క్రికెట్ టీమ్ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. టీ20 వరల్డ్ కప్ 2024 ఛాంపియన్స్ ట్రోఫీ 2025 (లో పేలవ ప్రదర్శన చేసింది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లోనూ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసత్ అలీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, సెలక్షన్ కమిటీ మీద నిప్పులు చెరిగాడు. ప్రతిష్ఠాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి కేవలం ఒకే ఒక ఫ్రంట్ లైన్ స్పిన్నర్‌తో ఎలా బరిలోకి దిగారని ప్రశ్నించాడు. అలాగే ప్రస్తుత కోచ్ ఆకిబ్ జావేద్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశాడు.



'సెలక్షన్ కమిటీ రాజీనామా చేయాలి. వారికి టీమ్ కూర్పు తెలియదు. ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇప్పటి వరకు వరుస వైఫల్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. టమాటాలు అమ్ముకునే వారికే మీ కన్నా ఎక్కువ పరిజ్ఞానం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడిన టీమ్‌లో స్పిన్నర్లను ఎందుకు తీసుకోలేదని చివరికి వారు కూడా ప్రశ్నిస్తున్నారు' అని బాసత్ అలీ చురకలంటించాడు.

ఇదిలా ఉండగా.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ వరుస ఓటముల నేపథ్యంలో పీసీబీ ఛైర్మన్‌గా తన పదవి నుంచి వైదొలగుతున్నట్లు వస్తున్న వార్తలను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సోమవారం ఖండించింది. ఇందులో నిజం లేదని తెలిపింది.

# చివరిసారిగా.. నేను అప్పుడు ఏడ్చేశా: శ్రేయస్ అయ్యర్

'చివరిసారిగా ఎప్పుడు బాధ పడ్డారు?' ఈ ప్రశ్నకు భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ( భావోద్వేగానికి గురయ్యాడు. ప్రస్తుతం ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ సారథిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇవాళ ముల్లాన్‌పూర్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో పంజాబ్ తలపడనుంది. ఈక్రమంలో 'కాండిడ్ విత్ కింగ్స్' చిట్‌చాట్‌లో శ్రేయస్ ఆసక్తికర విశేషాలు పంచుకొన్నాడు.



"దుబాయ్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తొలి ప్రాక్టీస్ సెషన్ జరిగింది. చివరిసారిగా నేను ఏడ్చిన రోజు కూడా అదే. నేను సాధన చేస్తున్నప్పుడు బ్యాట్‌కు కనెక్ట్ కావడం లేదు. నాపై నాకే కోపం వచ్చింది. అప్పుడే ఏడవడం ప్రారంభించా. సాధారణంగా నాకు అంత త్వరగా ఏడుపు రాదు. కానీ, అప్పుడు బాధపడటంతో నేనే షాక్‌కు గురయ్యా. ఎందుకు ఇలా బాధపడుతున్నానని అనిపించింది. ఎలా ఆడాలని అనుకున్నానో.. అదే ప్రణాళికతో టోర్నీలో ముందుకుసాగాలని నిర్ణయించుకున్నా. తొలుత నేను సాధన చేసిన పిచ్ కూడా డిఫరెంట్‌గా ఉంది. ఓకే.. పరిస్థితులను త్వరగా అలవర్చుకోవాలని అప్పుడే అనుకున్నా. మ్యాచ్‌ను బట్టి ఆటతీరు మార్చుకోవాలని సర్దిచెప్పుకొన్నా. మొదటిరోజు ప్రాక్టీస్ సెషన్ సమయం ముగిసినా సరే అదనంగా ఇంకొంచెంసేపు సాధన చేయాలనుకున్నా. కానీ, నాకు అలాంటి అవకాశం రాలేదు. అప్పుడు మాత్రం కోపం వచ్చింది" అని శ్రేయస్ తెలిపాడు.

భారత్ తరపున టాప్ స్కోరర్

ఛాంపియన్స్ ట్రోఫీ ఆసాంతం సెకండ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శ్రేయస్ అయ్యర్ రెండు అర్ధశతకాలతో 243 పరుగులు చేశాడు. భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా రచిన్ రవీంద్ర (263 పరుగులు) టాప్ స్కోరర్. ప్రస్తుతం ఐపీఎల్ 18వ సీజన్‌లోనూ శ్రేయస్ మూడు మ్యాచుల్లో 159 పరుగులు చేశాడు. గత ఐపీఎల్ మెగా వేలంలో అతడిని పంజాబ్ రూ.26.75 కోట్లకు తీసుకున్న సంగతి తెలిసిందే.

# భారత్‌పై అరంగేట్రం.. కంకషన్ ఎఫెక్ట్‌తో 27 ఏళ్లకే క్రికెట్‌కు గుడ్‌బై

ఆస్ట్రేలియా యువ ఆటగాడు విల్ పుకోవిస్కీ ( సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 2021లో భారత్ పైనే టెస్టులో అరంగేట్రం చేసిన విల్ అనూహ్యంగా ఆటకు వీడ్కోలు చెప్పడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, దీని వెనక కారణముంది. గతేడాది మ్యాచ్ ఆడుతున్నప్పుడు తలకు గాయమైంది. ఎలాంటి హాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఇప్పుడు ఆ ఘటన కారణంగానే క్రికెట్‌ను వదిలేయాల్సిన పరిస్థితి వచ్చింది.



ఇకనుంచి క్రికెట్ ఆడలేను: విల్

"మెరుగైన పరిస్థితుల్లో తిరిగి వస్తే బాగుండని అంతా కోరుకున్నారు. అయితే, నేను మళ్లీ క్రికెట్ ఆడటం లేదు. నాకు ఇది క్లిష్టమైన సమయం. ఈ సందర్భంగా సింపుల్‌గా ఓ మాట చెబుతున్నా. ఇక నుంచి నేనెప్పుడూ ఏ స్థాయి క్రికెట్‌లోనూ ఆడలేను. నా చివరి మ్యాచ్‌లో సెంచరీ తర్వాత వ్యక్తిగతంగా చాలా విషయాలు ఇబ్బందిపెట్టాయి. వాటి నుంచి బయటపడేందుకు చాలా శ్రమించా. మైదానంలోకి దిగుతానని ఆశించా. క్రికెటర్‌గా మాత్రం సాధ్యం కాదు. అయితే, ఆటతో మాత్రం అనుబంధం కొనసాగిస్తా. మెల్‌బోర్న్ క్రికెట్ క్లబ్‌లో కోచ్‌గా సేవలు అందిస్తా. దానికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఎంసీసీ నుంచి నాకు లభించే మద్దతు అద్భుతంగా ఉంటుంది. నా క్రికెట్ ప్రయాణం ఇక్కడే మొదలైంది. నాకు 12 ఏళ్లు ఉన్నప్పటినుంచి ఆటడం ప్రారంభించా. ఇప్పుడు కోచ్‌గా కొత్త బాధ్యతల కోసం సన్నద్ధమవుతున్నా" అని విల్ వెల్లడించాడు.

మెడికల్ ప్యానల్ రికమండేషన్..

షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో టాస్మానియా – విక్టోరియా జట్ల మధ్య 2024 మార్చిలో మ్యాచ్ జరిగింది. విల్ పుకోవిస్కీ టాస్మానియాకు ప్రాతినిధ్యం వహించాడు. రిలే మెరిడిత్ వేసిన బంతి విల్ హెల్మెట్‌ను బలంగా తాకడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. క

FONT SIZE



# 1000 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్.. 22,500 ఎగువకు నిఫ్టీ

ముంబయి: ట్రంప్ టారిఫ్ దెబ్బతో గత సెషన్‌లో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు మంగళవారం పుంజుకున్నాయి. సుంకాల విషయంలో ప్రపంచ దేశాలతో అమెరికా చర్చలకు సిద్ధమన్న సంకేతాలతో ఆసియాతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. ఈసారి ఆర్‌బీఐ నుంచి మరో 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లకు పైగా రాణించగా.. నిఫ్టీ కూడా 22,600 ఎగువకు చేరింది. ఆఖర్లో అమ్మకాల కారణంగా లాభాలు కాస్త తగ్గుముఖం పట్టాయి.

ఉదయం సెన్సెక్స్ 74,013.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,137.90) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 74,859.39 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1089.18 పాయింట్ల లాభంతో 74,227.08 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 374.25 పాయింట్ల లాభంతో 22,535.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.86.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 100, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్సులు కూడా 2 శాతం మేర లాభాల్లో ముగిశాయి.

ఇక, ఆసియా-పసిఫిక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. జపాన్ నిక్కీ 5.68 శాతానికి పైగా లాభపడగా.. హాంగ్‌కాంగ్, షాంఘై మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సింగపూర్, తైవాన్, జకర్తా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభ అయ్యాయి. డోజోన్స్ ఫ్యూచర్స్ 2 శాతం మేర లాభాల్లో ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3020 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

కారణాలు ఇవీ..

సుంకాలపై చర్చకు కొన్ని దేశాలు ముందుకొచ్చాయని ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. ట్రంప్ కూడా కాస్త వెనక్కి తగ్గుతారనే అంచనాలున్నాయి. దీనివల్ల వాణిజ్య యుద్ధ ఆందోళనలు తగ్గుతాయనే సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను బలపర్చాయి.

చైనా, వియత్నాం తదితర దేశాలతో పోల్చితే ట్రంప్ సుంకాల వల్ల కలిగే నష్టం మనదేశానికి తక్కువనే అంచనాలు మదుపర్ల ఆందోళనలకు కాస్త ఊరటనిచ్చాయి.

అటు ముడిచమురు ధర తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్ల ర్యాలీకి ఓ కారణంగా మారింది. కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి.

ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బుధవారం (ఏప్రిల్ 9న) నిర్ణయాలు వెలువడనున్నాయి. 25 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా దేశీయంగా వృద్ధికి ఊతం లభిస్తుందని మదుపర్లు భావిస్తున్నారు.

అమెరికాలో 10 ఏళ్ల బాండ్ల రాబడులు కూడా ఫిబ్రవరితో పోలిస్తే 4.5 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. 2 ఏళ్ల బాండ్ల రాబడులు సైతం 3.715 శాతానికి పడిపోయాయి. అమెరికా డాలర్ ఇండెక్స్ 102.92కి తగ్గడం వంటివి భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు పాజిటివ్‌గా మారాయి.



# ఇది ఆర్థిక అణు యుద్ధం: ట్రంప్‌నకు నిపుణుల హెచ్చరిక

అమెరికాఅధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల ప్రభావంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు.. ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని జేపీ మోర్గాన్ సీఈవో జెమి డిమోన్ అభిప్రాయపడ్డారు. ఆయన వాటాదారులకు విడుదల చేసిన వార్షిక లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. భారత్ వంటి దేశాలను తన దారిలోకి తెచ్చుకొనేకంటే.. వాటితో సన్నిహిత సంబంధాలను పెంచుకోవడమే మంచిదని ఆయన సూచించారు.

''ఇటీవల కాలంలో విధించిన టారిఫ్‌లు ద్రవ్యోల్బణాన్ని పెంచొచ్చు. అందువల్ల ఆర్థికమాంద్యానికి దారితీసే అవకాశాలున్నాయి. ఆర్థికవ్యవస్థ చెప్పుకోదగ్గ స్థాయిలో కుదుపులకు లోనవుతుంది. ఇందులో పన్ను సంస్కరణలు, డీ రెగ్యులేషన్లకు దారితీయడం వంటివి సానుకూల అంశాలైతే.. పన్ను, వాణిజ్యయుద్ధం, ఏమాత్రం తగ్గుముఖం పట్టని ద్రవ్యోల్బణం, ఆర్థిక లోటు, ఆస్తుల విలువలు గణనీయంగా పెరగడం, అస్థిరత వంటివి ప్రతికూలాంశాలు. పన్నుల పెంపు వల్ల దిగుమతి చేసుకొనే వస్తువులే కాదు.. దేశీయంగా తయారైన వాటి ధరలు కూడా పెరుగుతాయి. ఇవి స్వల్పకాలంలో కనపడతాయి. ముఖ్యంగా దేశీయ ఉత్పత్తుల ఇన్‌పుట్ ధరలు, డిమాండ్ రెండూ పెరుగుతాయి" అని వెల్లడించారు.

ఇక భారత్ వంటి నాన్ అలైన్ దేశాల విషయంలో అమెరికానే స్నేహహస్తం చాచి సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలన్నారు. "కీలక వాణిజ్య భాగస్వాములతో లోతైన సంబంధాలు కలిగిఉండడం ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరంగా మంచిది. అమెరికా కూటమిలో భాగస్వాములు కాకుండా ఉన్న నాన్ అలైన్ దేశాలైన భారత్, బ్రెజిల్ వంటి వాటితో సన్నిహితంగా ఉండాలి. వారికి వాణిజ్యం, పెట్టుబడుల్లో అమెరికా స్నేహహస్తం అందించాలి" అని పేర్కొన్నారు.

'ఆర్థిక అణు శీతాకాలం' : బిల్ అక్మెన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు అతిపెద్ద మద్దతుదారుగా నిలిచిన సంపన్నుడు బిల్ అక్మెన్ కూడా టారిఫ్‌లను తప్పుపట్టారు. దీనిని ఎకనామిక్ న్యూక్లియర్ వింటర్‌గా అభివర్ణించారు. సాధారణంగా అణుయుద్ధం తర్వాత నెలకొనే పరిస్థితులను న్యూక్లియర్ వింటర్‌గా పేర్కొంటారు.

# మనదేశంలోకి దిగుమతుల వెల్లువ?




దిల్లీ: మన దేశం నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 26% సుంకం విధించిన అమెరికా.. చైనా ఉత్పత్తులపై 34%, వియత్నాంపై 46%, థాయ్‌లాండ్‌పై 36% విధించింది. ఈ పరిస్థితుల్లో ఆయా దేశాల నుంచి అమెరికాకు వెళ్లాల్సిన ఉత్పత్తులు, మన దేశానికి దిగుమతి కాకుండా చూసేందుకు, నిఘా నిమిత్తం కేంద్రం ఒక అంతర్ మంత్రిత్వ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో వాణిజ్య, రెవెన్యూ విభాగాలతో పాటు పరిశ్రమల, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగ అధికారులూ ఉంటారు. దిగుమతుల్లో హెచ్చుతగ్గులు సాధారణ స్థితిలోనే ఉండేలా ఆకాశ, సముద్ర మార్గాలపై నిఘా వేయడం వీరి బాధ్యత.

ఏ వస్తువులు రావొచ్చంటే: అమెరికా బదులు భారత్‌కు మళ్లే దిగుమతుల జాబితాలో వినియోగదారు వస్తువులు, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఉక్కు వంటివి ఉండొచ్చు.

ఇదొక అవకాశం కూడా: దేశీయ పరిశ్రమ తనకు కావాల్సిన వస్తువులను అందుబాటు ధరల్లో సేకరించడానికి ఈ పరిణామం ఉపయోగపడగలదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఎగుమతులకు ఈ దేశాల్లో అవకాశాలు: అమెరికా మనపై 26% సుంకాలు విధించిన నేపథ్యంలో.. మన ఎగుమతిదార్లకు కొత్త మార్కెట్లు అన్వేషించేందుకు, విక్రయాలకు ప్రభుత్వం సాయం అందించనుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వీరికి అందుబాటు రేట్లలో రుణాల మంజూరు, ఐరోపా సమాఖ్య, ఒమన్, న్యూజిలాండ్, బ్రిటన్ వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై వేగంగా చర్చించడం వంటి చర్యలు చేపట్టనుంది.

అమెరికా మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా ఆస్ట్రేలియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండొనేషియా, ఇటలీ, జపాన్, నెదర్లాండ్స్, రష్యా, సింగపూర్, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, తుర్కియే, యూఏఈ, బ్రిటన్, వియత్నాం దేశాలను గుర్తించింది.




# ఎల్‌జీ. నుంచి స్మార్ట్ మానిటర్స్.. లైవ్‌టీవీ, ఓటీటీ యాప్స్‌తో

దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఎల్‌జీ.. దేశీయంగా రెండు కొత్త స్మార్ట్ మానిటర్లను విడుదల చేసింది. 27 అంగుళాలు, 31.5 అంగుళాల సైజుల్లో, 4%ఖ% యూహెచ్‌డీ డిస్‌ప్లేతో ఈ మానిటర్లు లభిస్తాయి. వీటిని పీసీలానూ వాడుకోవచ్చు.. పీసీకి కనెక్ట్ చేయకుండా ఓటీటీ, టీవీ ఛానెళ్లనూ వీక్షించొచ్చు. ఇంతకీ ఈ స్మార్ట్ ధరెంత, ఫీచర్లు ఇప్పుడు చూద్దాం..

ఎల్‌జీ 27 అంగుళాల మానిటర్ ఐపీఎస్ స్క్రీన్ 350 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. దీని బరువు 4.1 కిలోలు. ఇక 31.5 అంగుళాల మానిటర్ వీఏ ప్యానెల్‌తో వస్తోంది. ఇది 250 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. రెండు మోడళ్లూ 16:9 రేషియోకు సపోర్ట్ చేస్తాయి. హెచ్‌డీఆర్ 10 సర్టిఫికేషన్‌తో వస్తున్నాయి. 60%ఎ% రిఫ్రెష్ రేటు ఉంది. మూడు వైపులా అంచుల్లేని డిజైన్‌తో పాటు హైట్ ఎడ్జస్ట్‌మెంట్ ఆప్షన్ ఉంది.

ఈ మానిటర్లు వెబ్ఓఎస్23పై పనిచేస్తాయి. అంటే పీసీకి కనెక్ట్ చేయకపోయినా ఈ మానిటర్‌ను వాడుకోవచ్చు. ఇందులో ఇన్‌బిల్ట్ యాప్స్ ఉంటాయి. నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో, డిస్నీ, యూట్యూబ్, యాపిల్ టీవీ వంటి ఓటీటీ యాప్స్ ఉంటాయి. ఎల్‌జీ ఛానెల్స్ ద్వారా నూరు ఛానెళ్లను ఉచితంగా వీక్షించొచ్చు. మల్టీమీడియాను వినియోగించుకునేందుకు ఈ రెండింట్లోనూ 5%ఔ% స్పీకర్లు ఉంటాయి. వైఫై, బ్లూటూత్, యూఎస్‌బీ టైప్- ఏ పోర్ట్స్, యూఎస్‌బీ టైప్-సి పోర్ట్స్, హెచ్‌డీఎంఐ పోర్ట్స్ ఉన్నాయి. 27 అంగుళాల మానిటర్ ధరను ఎల్‌జీ రూ.32 వేలుగా నిర్ణయించింది. ప్రస్తుతం రూ.27,499 వద్ద లభిస్తోంది. 32 అంగుళాల మానిటర్ ధరను రూ.38వేలుగా నిర్ణయించింది. ప్రస్తుతం దీని ధర రూ.30,999గా చూపిస్తోంది. ఎల్‌జీ, అమెజాన్ వెబ్‌సైట్ల కొనుగోలు చేయొచ్చు.

# స్థిరాస్తిలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు తగ్గాయి

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత స్థిరాస్తి రంగంలో ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడులు 3% తగ్గి 3.7 బిలియన్ డాలర్ల (దాదాపు



రూ.32,000 కోట్ల)కు పరిమితమయ్యాయని స్థిరాస్తి కన్సల్టెంట్ అనరాక్ అనుబంధ సంస్థ అనరాక్ క్యాపిటల్ తెలిపింది. కార్యాలయ భవనాల నిర్మాణానికి ఈ పెట్టుబడులు తగ్గడం ప్రభావం చూపింది. 2023-24లో పీఈ పెట్టుబడులు 3.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2020-21లో 6.4 బిలియన్ డాలర్లుగా ఉన్న పీఈ పెట్టుబడులు.. 2021-22లో 4.3 బిలియన్ డాలర్లకు తగ్గాయి. 2022-23లో 4.4 బి.డాలర్లకు మెరుగుపడగా, 2023-24 నుంచి తగ్గుతున్నాయి.

2024-25 మొత్తం పీఈ పెట్టుబడుల్లో విదేశీ పెట్టుబడిదార్ల వాటా 84% కాగా, దేశీయ పెట్టుబడిదార్ల వాటా 16 శాతంగా ఉంది. ఆఫీసు కాంప్లెక్స్‌ల్లో పెట్టుబడులు 2023-24లో 2.2 బి.డాలర్ల నుంచి 2024-25లో 806 మి.డాలర్లకు తగ్గాయి.

గృహ, ఆఫీసు ఆస్తుల్లో పీఈ పెట్టుబడులు తగ్గగా, వేర్‌హౌసింగ్ ఆస్తులపై పెరిగాయి. మొత్తం పీఈ పెట్టుబడుల్లో హైబ్రిడ్ లావాదేవీల వాటా 42 శాతానికి చేరింది. ఈక్విటీ, డెట్ పెట్టుబడులు వరుసగా 37%, 21 శాతానికి తగ్గాయి.

గత అయిదేళ్లలో పీఈ పెట్టుబడులు స్థిరంగా తగ్గాయి. 2020-21లో 6.4 బి.డాలర్ల నుంచి 43% తగ్గి 2024-25లో 3.7 బి.డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, భౌగోళిక ఒడుదొడుకుల కారణంగా విదేశీ పెట్టుబడిదార్ల కార్యకలాపాలు తగ్గాయని అనరాక్ క్యాపిటల్ ఎండీ, సీఈఓ శోభిత్ అగర్వాల్ పేర్కొన్నారు.



# అట్లీతో అల్లు అర్జున్.. ఇట్స్ అఫీషియల్

అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్ వచ్చింది. స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ సినిమా చేయనున్నట్లు అధికారికంగా వెల్లడైంది. సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థపై ఇది రానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఆయనకు విషెస్ చెప్పింది.

'పుష్ప' సినిమాతో నేషనల్ అవార్డు అందుకొని ట్రెండ్ సెట్ చేశారు అల్లు అర్జున్. దీని రెండో భాగం భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో బన్నీ తర్వాత ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. హిట్ దర్శకుడు అట్లీతో ఓ సినిమా చేయనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడిదే విషయాన్ని ఖరారు చేస్తూ సన్ పిక్చర్స్ పోస్ట్ పెట్టింది. ఈ ప్రాజెక్ట్ వివరాలు పంచుకుంటూ ఓ వీడియో విడుదల చేసింది.

హాలీవుడ్ తరహాలో విజువల్స్..

ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు వీడియోలో చూపించారు. అభిమానుల ఊహలకు అందని రీతిలో ఈ సినిమా ఉండనుందని తెలిపారు. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీని కోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించారు. హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ నిపుణులు మాట్లాడుతూ.. ఇప్పటివరకూ ఇలాంటి స్క్రిప్ట్ ఇప్పటివరకూ చూడలేదన్నారు. అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన విజువల్స్ ఇందులో చూపించారు.



# మహేశ్-రాజమౌళి తర్వాత భారీ బడ్జెట్‌తో అల్లు అర్జున్- అట్లీ మూవీ?

%హైదరాబాద్: 'పుష్ప2' తర్వాత స్టార్ హీరో అల్లు అర్జున్) చేయబోయే సినిమాపై స్పష్టత వచ్చింది. తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో బన్ని నటించనున్నట్లు ఆయన పుట్టినరోజు సందర్భంగా అధికారిక ప్రకటన వచ్చింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆసక్తికర వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ పంచుకుంది.

ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి..

అంతర్జాతీయ స్థాయిలో భారీ బడ్జెట్‌తో ఈ మూవీని తీర్చిదిద్దుతున్నట్లు తాజా వీడియో చూస్తే అర్థమవుతోంది. ఈ కథకు భారీగా వీఎఫ్ఎక్స్ సన్నివేశాలకు అవసరం ఉండటంతో ఇందుకు సంబంధించిన పనులను ఇటీవల మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే అల్లు అర్జున్, అట్లీ ఇద్దరూ అమెరికా వెళ్లారు. అక్కడి లాస్ ఏంజెల్స్‌లోని వివిధ వీఎఫ్ఎక్స్ స్టూడియోలకు వెళ్లి కథ, దాని పరిధి, వీఎఫ్ఎక్స్ ఏ మేర అవసరం తదితర విషయాలను ఈ సందర్భంగా అక్కడి నిపుణులతో చర్చించారు. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో అల్లు అర్జున్ ఫేస్‌ను రీక్రియేట్ చేశారు. కొన్ని సన్నివేశాలకు సంబంధించిన టెస్ట్ షూట్ కూడా జరిగింది. ఈ ఏడాది చివరి నాటికి చ%బూాా%22 సెట్స్‌పైకి వెళ్లనుందని చిత్ర బృందం తెలిపింది. ఈలోగా అల్లు అర్జున్ మేకోవర్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తి చేయనున్నారు.


మహేశ్-రాజమౌళి మూవీ తర్వాత..

'పుష్ప'తో జాతీయ స్థాయిలో మాస్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న అల్లు అర్జున్ ఈసారి వైవిధ్యమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఎమోషన్స్ మేళవించి కథను రక్తి కట్టించడంలో అట్లీ సిద్ధహస్తుడు. ఈ సినిమాలో కూడా భావోద్వేగాలు, మాస్ యాక్షన్‌కు తోడు భారీ వీఎఫ్ఎక్స్ సన్నివేశాలు ఉంటాయట. 'పుష్ప2' ప్రపంచ వ్యాప్తంగా రూ.1800 కోట్లకు పైగా రాబట్టింది. దీంతో 22పైన భారీ అంచనాలు ఉన్నాయి. వాటిని అందుకోవాలంటే 'పుష్ప' రేంజ్‌కు ఏమాత్రం తగ్గకూడదు. అందుకు తగినట్లుగానే రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈమూవీని తీర్చిదిద్దుతున్నట్లు కోలీవుడ్ టాక్. ఇందులో అల్లు అర్జున్ పారితోషికం రూ.175కోట్లతో పాటు లాభాల్లో 15శాతమట. అట్లీ రూ.100 కోట్లు ఛార్జ్ చేస్తున్నారట. ఇక అత్యధికంగా రూ.250 కోట్లు వీఎఫ్ఎక్స్ కోసమే సన్ పిక్చర్స్ ఖర్చు చేస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చ%బూవీదీ%29 బడ్జెట్ రూ.1000 కోట్లు అని సినీ వర్గాల అంచనా. అంటే ఈ మూవీ తర్వాత అల్లు అర్జున్-అట్లీదే అత్యంత ఖరీదైన ప్రాజెక్ట్.

# ఎంత బిజీగా ఉంటే అంత ప్రశాంతంగా ఉంటా: రకుల్

తన 16 ఏళ్ల కెరీర్‌పై రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. జీవితంలో ఎన్ని ఒడుదొడుకులు ఉన్నా ముందుకు సాగాలన్నారు. టాలీవుడ్, బాలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ నటి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు."ఈ ఇండస్ట్రీలో జయాపజయాలు సహజం. అవి జీవితంలోనూ భాగమే. కెరీర్‌లో స్థిరపడే కొద్దీ మార్పులు వస్తాయి. ఎన్ని కష్టాలు వచ్చినా తిరిగి రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగాలి. మనపై మనకు నమ్మకం ఉంటే ఏదైనా సాధ్యమవుతుంది. నా విషయానికొస్తే.. నేను ఎంత బిజీగా ఉంటే అంత ప్రశాంతంగా ఉంటాను. వరుస షూటింగ్ షెడ్యూల్స్ ఉన్నప్పుడు ఒత్తిడిగా అనిపించదు. షూటింగ్స్ లేనప్పుడు విరామ సమయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతాను. ప్రతిరోజూ వర్క్‌కు వెళ్లడం, కెమెరాను ఎదుర్కోవడం నా జీవితంలో భాగమయ్యాయి. ఈ దినచర్యే నన్ను ఉన్నత స్థానానికి తీసుకువెళ్తుంది. ఎప్పటికీ ఇదే కొనసాగాలని కోరుకుంటున్నా" అని రకుల్ అన్నారు.కన్నడ చిత్రం 'గిల్లీ'తో తెరంగేట్రం చేసిన రకుల్ దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ అవకాశాలు అందుకుంటున్నారు. ఇటీవలే 'మేరే హస్బెండ్ కీ బీవీ'తో పలకరించారు. ఈ సినిమాకు ఆమె భర్త జాకీ భగ్నానీ నిర్మాతగా వ్యవహరించారు.

# 'రామాయణ' సినిమాలో హనుమంతుడి పాత్ర.. స్పందించిన నటుడు




: బాలీవుడ్ నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ రామాయణాన్ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ (దర్శకత్వంలో 'రామాయణ'గా ఇది రానుంది. ఇందులో ఇండస్ట్రీలోని అగ్ర నటీనటులు భాగం కానున్నారు. బాలీవుడ్ నటుడు సన్నీదేవోల్ ఇందులో హనుమంతుడిగా కనిపించనున్నారు. తాజాగా ఈ పాత్ర గురించి ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

"మనం ఈరోజు ఇలా ఉన్నామంటే దానికి కారణం భగవంతుడే. నేను దేవుడిని నమ్ముతాను. 'రామాయణ'లో హనుమంతుడిగా మీ ముందుకురానున్నాను. ఒక నటుడిగా నాకు ఇది సవాలుతో కూడిన పాత్ర. జాగ్రత్తలు వహించాలి. ఇలాంటి పాత్రలను నేను ఇష్టపడతాను. ఎందుకంటే ఇవి సరదాగా ఉంటాయి. నేను ఇంకా ఈ షూటింగ్‌లో పాల్గొనలేదు. కచ్చితంగా ప్రజలంతా దీన్ని చూసి ఆశ్చర్యపోతారు. అంత గొప్పగా దీన్ని రూపొందిస్తున్నారు" అని అన్నారు. ఇటీవల కూడా ఓ కార్యక్రమంలో ఈ ప్రాజెక్ట్ గురించి సన్నీదేవోల్ మాట్లాడారు. "అవతార్', 'ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' తరహాలో రామాయణ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చాలా పెద్ద ప్రాజెక్ట్‌గా ఇది తెరకెక్కుతుంది. అద్భుతమైన విజువల్స్‌తో ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్తారు. వీఎఫ్ఎక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుంది. అందరూ దీన్ని ఇష్టపడతారు' అని చెప్పారు.

ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ సీతగా సాయి పల్లవి రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ కనిపించనున్నారు. కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ నటించనున్నట్లు తెలుస్తోంది. ఇక దీని వీఎఫ్ఎక్స్ కోసం నితేశ్ తివారీ టీమ్ ఆస్కార్ విన్నింగ్ కంపెనీ డీఎన్ఈజీ తో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ చిత్రం మొదటిభాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకురానున్నాయి.

# 'మంజుమ్మల్ బాయ్స్' రికార్డును బీట్ చేసిన 'ఎల్2 ఎంపురాన్'..



మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం 'ఎల్ 2: ఎంపురాన్'. మార్చి 27న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా రికార్డులు సృష్టిస్తోంది. మలయాళంలో అత్యధిక వసూళ్లు సాధించిన 'మంజుమ్మల్ బాయ్స్' ( రికార్డును తాజాగా 'ఎల్2' బీట్ చేసింది.

గతేడాది విడుదలై మలయాళ ఇండస్ట్రీలో ఒక్కసారిగా ట్రెండ్ క్రియేట్ చేసింది 'మంజుమ్మల్ బాయ్స్'. ప్రపంచవ్యాప్తంగా రూ.241 కోట్లు (గ్రాస్) వసూళ్లు చేసింది. తాజాగా ఈ రికార్డును ఎల్2 అధిగమించింది. కేవలం తొమ్మిది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.250 కోట్లు వసూలు చేసి మలయాళం సినీ చరిత్రలో ఎక్కువ వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. మరోవైపు దేశవ్యాప్తంగానూ ఎంపురాన్ (రూ.106 కోట్లు) సత్తా చూపిస్తోంది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో మూడో స్థానంలోకి వచ్చింది. ఈ లిస్ట్‌లో ఛావా (రూ.800 కోట్లు) మొదటి స్థానంలో ఉండగా.. వెంకటేశ్ సంక్రాంతికి వస్తున్నాం (రూ.255 కోట్లు) రెండో స్థానంలో నిలిచింది.

భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో మలయాళం చిత్రంగానూ 'ఎల్ 2' నిలిచింది. ఈ జాబితాలో టాప్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ 'ఆడుజీవితం' (రూ.167 కోట్లు), రెండులో '2018' (రూ.110 కోట్లు) ఉన్నాయి. దీనితర్వాత ఎల్ 2: ఎంపురాన్ (రూ. 106 కోట్లు) మూడో ప్లేస్‌లో నిలిచింది. మరికొన్ని రోజుల్లోనే ఇది రెండో ప్లేస్‌లోకి వెళ్లే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# నాకు ఇండస్ట్రీలో గర్ల్‌ఫ్రెండ్ లేదు: కార్తిక్ ఆర్యన్



సినీ ఇండస్ట్రీలో తనను సపోర్ట్ చేయడానికి ఎవరూ లేరన్నారు బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్ కొన్ని రోజులుగా ఈ హీరో నటి శ్రీలీలతో (ప్రేమలో ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. తనకు ఇండస్ట్రీలో గర్ల్‌ఫ్రెండ్ లేదని స్పష్టంచేశారు. దీంతో ఈ కామెంట్స్ వైరల్‌గా మారాయి.

తన సినిమా కోసం కార్తిక్ రూ.50 కోట్లు పారితోషికం తీసుకున్నట్లు వస్తోన్న వార్తలపై కూడా స్పందించారు. "పరిశ్రమలో ఇంత పారితోషికం తీసుకొనే నటుడిని నేను ఒక్కడినేనా.. ఇంకా చాలామంది ఉన్నారు. వారి గురించి ఎవరూ రాయరు. నా గురించి మాత్రమే అందరూ ఇలాంటి వార్తలు రాస్తుంటారు. ఎందుకంటే.. ఇక్కడ నన్ను సపోర్ట్ చేయడానికి ఎవరూ లేరు. నాకు సినీ నేపథ్యం లేదు. నా సోదరులు, స్నేహితులు, గర్ల్‌ఫ్రెండ్ ఎవరూ ఇండస్ట్రీలో లేరు. అందుకే ఇలాంటి కథనాలు రాస్తున్నారు. వీటిని నిరూపించుకోవాల్సిన అవసరం నాకు లేదు. నిరాధారమైన వాటిని సృష్టించడానికి కొందరు ప్రజలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అలాంటి వార్తలను ఇష్టపడని వారి గురించి వాళ్లు ఎక్కువ రూమర్స్ సృష్టిస్తుంటారు" అని తెలిపారు.

ఇక అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తిక్ ఆర్యన్ ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయిక. దీని చిత్రీకరణ సమయంలోనే కార్తిక్ - శ్రీలీల మధ్య పరిచయం ఏర్పడిందని.. ప్రస్తుతం వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. దీనిపై వీరిద్దరూ ఎక్కడా స్పందించలేదు.

# బరువు తగ్గాలనుకుంటున్నారా..? రోజు ఈ చిట్కాలు పాటించండి..!

ఊబకాయం(ఒబెసిటీ).. ఈ జనరేషన్‌లో చాలా మందిని వేధిస్తున్న సమస్య. చాలామంది కంప్యూటర్ల ముందు గంటలు గంటలు కూర్చొని పనిచేయడంతో సమస్య వేధిస్తోంది. పొట్ట చుట్టూ అనవసర కొవ్వు పేరుకుపోవడం వల్ల.. అధికంగా బరువు పెరుగుతున్నారు. దీంతో ఒబెసిటీ సమస్య వస్తోంది.. పలు సందర్భాల్లో భావోద్వేగ స్థాయిలో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఊబకాయం పెరగడంతో శరీరం వికారంగా కనిపిస్తుంది. ఈ ఊబకాయంతో అనేక వ్యాధులకు కూడా కారణం అవుతాయి.

అధిక బరువు పెరగడంతో అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బరువు తగ్గడం కోసం ఎన్నో వ్యాయామాలు, డైట్‌ల గురించి చెప్పినా ఒక్కోసారి పని వల్ల, మరికొన్ని సార్లు బద్ధకంతో ఎందరో బరువు తగ్గించుకోలేకపోతున్నారు. ప్రతి రాత్రి కొన్ని చిట్కాలు పాటించడం, ఆహారంలో స్వల్ప మార్పులు చేయడం ద్వారా సులభంగా బరువును తగ్గించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.



పుష్కలంగా నీరు తాగాలి

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీళ్లు తాగడం చాలా ముఖ్యం. బరువును నియంత్రించడంలో నీరు ప్రభావవంతంగా ఉంటుంది. బరువును అదుపులో ఉంచుకోవడానికి.. నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా కడుపు నిండిన అనుభూతిని కలిగించడంతో పాటు అనవసరమైన కేలరీలను తీసుకోకుండా ఉండేందుకు సహాయపడుతుంది. నీరు ఎక్కువగా తాగడంతో శరీరంలోని టాక్సిన్స్ కూడా బయటకు వెళ్లిపోతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజుకు 8 గ్లాసుల నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి.

పడుకునే ముందు తేలికపాటి వ్యాయామం చేయాలి

మీరు మీ పెరుగుతున్న బరువును నియంత్రించాలనుకుంటే.. క్రమం తప్పకుండా పడుకునే ముందు.. పది నుంచి పదిహేను నిమిషాల పాటు తేలికపాటి వ్యాయామం చేయాలి. బరువు తగ్గడానికి ఇది చాలా ప్రభావవంతమైన మార్గం.

# చిన్నపిల్లల్లో శ్వాసకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఎలాంటి ఆహారం ఇవ్వాలి..?

శిశువు జబ్బు పడినప్పుడు, పెరుగుదలలో లోపం రాకుండా జాగ్రత్తపడటం తల్లిదండ్రుల కర్తవ్యం. అంటువ్యాధులకు ఆహార లోపాలు తోడైతే పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కుంటుపడుతుంది. అనారోగ్య సమయంలో పసిబిడ్డల ఆకలి బాగా తగ్గిపోతుంది. వాంతులు అవుతాయి. దీనివల్ల తీసుకునే ఆహార పరిమాణమూ తగ్గిపోతుంది.

అతిసార వ్యాధి, మశూచి వచ్చినప్పుడైతే, తీసుకున్న ఆహారంలో కొంత మాత్రమే ఒంటికి పడుతుంది. ఇప్పటికీ కొందరు 'లంఖణం పరమౌషధం' అన్న మాటనే నమ్ముతారు. పిల్లలకు ఆహారం ఇవ్వకుండా కడుపు మాడ్చుతారు. నిజానికి ఆరోగ్యవంతులతో పోలిస్తే, అనారోగ్యపీడితుల ఆహార అవసరాలే ఎక్కువగా ఉంటాయి.

వ్యాధిని ఎదిరించడానికి మందులతోపాటు బలవర్ధకమైన ఆహారం అవసరం. అందువల్ల, అనారోగ్య సమయంలో పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం తినిపించడం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. అందులోనూ, కోలుకుంటున్న దశలో బాగా ఆకలి వేస్తుంది. కాబట్టి, అంతకుముందు కన్నా ఎక్కువ ఆహారాన్ని ఇవ్వడానికి ప్రయత్నించాలి.

ఇష్టమైన పదార్థాలను మెత్తగా చేసి, కొద్దికొద్దిగా ఎక్కువసార్లు పెట్టాలి. అందులోనూ తల్లిపాలు చాలా ముఖ్యం. ఈ



సమయంలో బిడ్డలు ద్రవ పదార్థాలపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. బిడ్డ వ్యాధికి పూర్వం ఉన్న బరువుకు తిరిగి చేరుకోగలిగితే, అనారోగ్యం నుండి పూర్తిగా కోలుకున్నట్టే.

పిల్లలను తరచూ ఇబ్బందిపెట్టే రుగ్మతలు దగ్గు, జలుబు. వీటిని అశ్రద్ధ చేస్తే న్యుమోనియా అనే ఊపిరితిత్తుల వ్యాధికి దారితీయవచ్చు. తల్లిపాలతో న్యుమోనియాను అరికట్టవచ్చు. విటమిన్-ఎ ఎక్కువగా ఉండే పసుపుపచ్చ ఫలాలు, ఆకుకూరలు కూడా శ్వాసకోశ వ్యాధుల నుంచి రక్షిస్తాయి.

దగ్గు, జలుబు ఉన్నప్పుడు తల్లిపాలు తాగడం పిల్లలకు కష్టం కావచ్చు. అలా అని ఆపకూడదు. అమ్మ పాలు రోగనిరోధక శక్తిని ఇవ్వడమే కాదు, పోషకాహార లోపాలనూ నివారిస్తాయి. పిల్లల ముక్కును తరచూ శుభ్రం చేయడం వల్ల పాలు తాగడం సులభం అవుతుంది.

అయినా ఇబ్బందిగా ఉంటే, శుభ్రమైన కప్పులోకి పాలు పిండి చెంచాతో తాగించాలి. తరచూ ద్రవ పదార్థాలు ఇవ్వడం వల్ల శ్వాస నాళాలలోని స్రవాలు చిక్కబడవు. దగ్గినప్పుడు సులభంగా బయటికి వచ్చేస్తాయి.

# మెల్లగా ఆహారం తినండి.. శరీరం బరువు తగ్గించుకోండి..!

దృఢమైన చక్కని ఆకృతిలో శరీరాన్ని సొంతం చేసువాలంటే.. డైటింగ్, వర్కవుట్స్.. రెండూ ముఖ్యమైనవే అని భావిస్తాం. ఉపవాసం, కష్టతరమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేకుండానే శరీరం బరువును తగ్గించుకోవడంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. నెమ్మదిగా తినండి అంటే చాలా మందికి కోపంగా ఉంటుంది. శరీరం బరువు తగ్గించుకోవడానికి ముందుగా ఆహారాన్ని బాగా నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ఆహారాన్ని బాగా నమలడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో ఆహారాన్ని మెల్లగా తింటారు. అంతేకాదు కడుపారా తిన్న సంతృప్తి కూడా కలుగుతుంది. ఫలితంగా ఎక్కువగా తినకుండా ఉంటారు. ఎంత తింటున్నారు అనేది కూడా చాలా ముఖ్యం. డైటింగ్ చేయనప్పటికీ చిన్న ప్లేట్‌లో తినడం వల్ల ఎక్కువగా తిన్నామన్న భావన కలిగి తినే మోతాదు తగ్గిపోతుంది. భోజనం చేయడానికి ముందు ఎక్కువగా నీళ్లు తాగాలి. దీంతో మీరు తక్కువ తినగానే పొట్ట నిండుగా అనిపిస్తుంది. మెల్లగా ఆహారం తీసుకోవడం వల్ల మన శరీరం బరువు తగ్గించుకోవడంతోపాటు అనేక ప్రయోజనాలు ఉంటాయి. అవేంటంటే..

మంచి పోషక శోషణ:

నెమ్మదిగా తినడం వల్ల మంచి జీర్ణక్రియ సాధించవచ్చు. శరీరం ద్వారా పోషకాలను గ్రహించడం కూడా గరిష్ఠంగా ఉంటుంది.




ఒత్తిడి స్థాయిలు తగ్గుతాయి:

నమలడం, ఆహార సంతృప్తి పెరుగడం ద్వారా ప్రశాంతమైన, సంతోషకరమైన మనసును పొందడానికి దారితీస్తుంది. ఇది తక్కువ స్థాయి ఒత్తిడిని సాధించడానికి నేరుగా దోహదం చేస్తుంది.

మెరుగైన జీర్ణక్రియ:

నెమ్మదిగా తినడం వల్ల మరింత నమలడం అవసరం అవుతుంది. ఇది జీర్ణక్రియ ప్రక్రియను మెరుగుపరచడానికి తద్వారా శరీరం బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది.

సంతృప్తి ప్రేరేపణ:

నెమ్మదిగా తినడం వల్ల ఆహారాన్ని పూర్తి స్థాయిలో ఆస్వాదించడానికి వీలుంటుంది. తినడం ఎల్లప్పుడూ సరిపోకపోవచ్చు. అయితే దాని రుచి, వాసన, ఆకృతిని గుర్తించి అభినందిస్తున్నప్పుడు తినడం మరింత సంతృప్తి చెందడానికి సహాయపడుతుంది.

నమలడాన్ని ప్రోత్సహిస్తుంది:

నెమ్మదిగా తినేటప్పుడు దంతాలతో నమలడం మెరుగుపడుతుంది. ఇది క్యాలరీల వినియోగాన్ని నియంత్రించడానికి, తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా శరీరం బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది.

అదేవిధంగా, ఒత్తిడి, ఉద్వేగంగా ఉన్నప్పుడు ఎక్కువగా తినేస్తారు. ఒత్తిడికిలోనైన సమయాల్లో ఎక్కువగా విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్.. ఆకలిని పెంచుతుంది. బరువు పెరగడానికి నిద్రలేమి కూడా ఒక కారణంగా తేల్చారు. చాలినంత నిద్ర లేకపోవడం వల్ల హార్మోన్ల విడుదలలో అసమతౌల్యం ఏర్పడి ఊబకాయం సమస్య వస్తుంది. కాబట్టి కంటినిండా నిద్రపోవడం అలవర్చుకోవాలి.

# ఆ ఉల్లిగడ్డలను తిని జనాలు ఎందుకు జబ్బుపడుతున్నారు? వాటిలో ఏముంది?

ఉల్లిగడ్డలను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది అని పెద్దలు చెబుతుంటారు. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు. కానీ.. ప్రస్తుతం ఆ ఉల్లిగడ్డలను తినడం వల్లనే చాలామంది వ్యాధి బారిన పడుతున్నారు. ఇప్పటి వరకు ఉల్లిగడ్డలను తినడం వల్ల యూఎస్‌ఏలోని 37 రాష్ట్రాల్లో 652 మందికి పలు ఆరోగ్య సమస్యలు వచ్చాయి. అందులో 129 మంది ఆసుపత్రి పాలయ్యారు. దానికి కారణం వాళ్లు తిన్నది సాల్మానెల్లా అనే బ్యాక్టీరియా ఉన్న ఉల్లిగడ్డలను తినడం. ఆ ఉల్లిగడ్డలను మెక్సికో నుంచి యూఎస్‌కు ఇంపోర్ట్ చేశారు. వాటిని తిని ఇప్పటి వరకు ఎవరూ చనిపోలేదు కానీ.. ఆసుపత్రుల పాలు అవడం.. పలు ఆరోగ్య సమస్యలకు గురి కావడంతో యూఎస్‌లో ఉల్లిగడ్డలను తినాలంటే అక్కడి ప్రజలు వణికిపోతున్నారు.

అసలు సాల్మానెల్లా అంటే ఏంటి?

సాల్మానెల్లా అనేది ఓ బ్యాక్టీరియా. అది ఎక్కువగా ఆహార పదార్థాల్లో ఉంటుంది. వాటిని తినగానే ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ బ్యాక్టీరియా ఉన్న ఫుడ్‌ను తీసుకోగానే పేగుల్లో సమస్యలు వస్తాయి. తద్వారా కడుపు నొప్పి వస్తుంది. ఈ బ్యాక్టీరియా ద్వారా ఆరోగ్య సమస్యలు వస్తే వాటిని సాల్మోనెల్లోసిస్ అని అంటారు.

ఈ రకం బ్యాక్టీరియా ఎక్కువగా జంతువుల్లో, మనిషి పేగుల్లో ఉంటుంది.



ఈ బ్యాక్టీరియా మల విసర్జన ద్వారా బయటికి వెళ్లి ఆహార పదార్థాల్లో, నీళ్లలో కలిసి పోయి.. తిరిగి మనుషుల్లోకి చేరుతుంది. ఈ బ్యాక్టీరియా మనుషుల్లోకి చేరిందని తెలుసుకోవడం చాలా కష్టం.

ఈ బ్యాక్టీరియాతో ఇన్‌ఫెక్ట్ అయితే వాంతులు అవడం, డయోరియా, జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. 5 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు.. 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు ఈ బ్యాక్టీరియా సోకే ప్రమాదం ఎక్కువ.

ఈ బ్యాక్టీరియా రక్త ప్రవాహంలో కలిస్తే మాత్రం చాలా ప్రమాదం. అది మెదడులోని కణజాలాన్ని, వెన్నుముకను డ్యామేజ్ చేస్తుంది. రక్తనాళాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. పైన చెప్పిన లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# ఈ పండుతో ఆరోగ్య ప్రయోజనాలు మెండు!

సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చేకూర్చే ప్రయోజనాలు మెండు అని నిపుణులు చెబుతున్నారు. శీతాకాలంలో లభించే శీతాఫలాల్లో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు మనకు శక్తితో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయని చెబుతున్నారు. ఈ పండులో ఉండే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు మెదడును ఉత్తేజితం చేస్తాయి. శీతాఫలంలో పుష్కలంగా లభించే ఫైబర్‌తో జీర్ణప్రక్రియ సాఫీగా సాగుతూ ప్రేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఈ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్ లుటెన్ కంటి ఆరోగ్యాన్ని కాపాడుతూ కంటి సమస్యలు రాకుండా నివారిస్తుంది.

ఇక సీతాఫలంలో పుష్కలంగా ఉండే మాగ్నీషియం, పొటాషియం ఇతర పోషకాలు రక్తపోటు స్థాయిని మెరుగ్గా నియంత్రిస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఆరోగ్యకరమైన మధుమేహ లెవెల్స్ ఉండేలా చేస్తాయి. వాపు



వల్ల వచ్చే వ్యాధులను నియంత్రించడంతో పాటు ఇవి గుండె ఆరోగ్యాన్నీ సంరక్షిస్తాయని నిపుణులు చెబుతారు. ఈ పండులో ఉండే విటమిన్ సీ ద్వారా రోగనిరోధక వ్యవస్థ బలపడుతుందని, ఇది లో గ్లైసిమెక్ ఇండెక్స్‌ను కలిగి ఉండటంతో మధుమేహ రోగులూ శీతాఫలం తినవచ్చని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు.

# కూల్‌డ్రింక్స్ అధికంగా తాగితే డేంజరే..!

ఎండాకాలం వచ్చిందంటే చాలు.. చాలా మంది కూల్‌డ్రింక్స్‌ను ఎడా పెడా తాగేస్తుంటారు. ఇంకా కొంత మందైతే కాలాలతో సంబంధం లేకుండా కూల్ డ్రింక్స్‌ను తాగుతుంటారు. అయితే నిజానికి ఇవి మన ఆరోగ్యానికి చేటు చేస్తాయి. కూల్ డ్రింక్స్‌ను ఎక్కువగా తాగడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయి. వ్యాధులు

కూల్‌డ్రింక్స్‌ను అధికంగా తాగితే బరువు త్వరగా పెరుగుతారు. వాటిలో ఉండే చక్కెర శరీరంలో కొవ్వును పెంచుతుంది. దీంతో అధిక బరువు పెరుగుతారు. ఫలితంగా డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. అలాగే



ఇతరులు కూడా కూల్ డ్రింక్స్‌ను ఎంత తక్కువగా తాగితే అంత మంచిది. కూల్ డ్రింక్స్ తాగాలనిపించినప్పుడు సహజసిద్ధమైన పానీయాలు తాగండి. కొబ్బరి నీళ్లు, పుచ్చకాయ రసం, చెరుకు రసం తదితర పానీయాలు తాగడం వల్ల మనకు ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి..!

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy